అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంగళవారం 19-12-2023
సంపుటి : 9 | సంచిక : 298 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

78 మంది ఎంపీల సస్పెన్షన్

పార్లమెంట్ చరిత్రలోనే తొలిసారి

- రాజ్యసభలో 45 మంది
- లోక్‌సభలో 33 మంది
- ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే మూడు బిల్లుల ఆమోదం






పార్లమెంట్ ప్రవేశ ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న ఎంపీలు...

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో గతవారం చోటుచేసుకున్న భద్రతా వైఫల్య ఘటనపై ఉభయసభలు దద్దరిల్లుతున్నాయి. ఈ వైఫల్యంపై చర్చ జరపాలనీ, ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసినందుకు ఉభయ సభల్లో 78 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. పార్లమెంట్ చరిత్రలో ఇంత మందిని సస్పెండ్ చేయటం ఇదే తొలిసారి. ఈ శీతాకాల సమావేశాలు ముగిసే వరకూ వీరిని సస్పెండ్ చేస్తున్నట్టు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రకటించారు. గత వారం 14 మందిని సస్పెండ్ చేయగా, సోమవారం 78 మందిపై వేటు వేశారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 92 మందిపై వేటు పడింది.

ప్రతిపక్షాల ఆందోళనతో సోమవారం సభా కార్యకలాపాలు స్తంభించాయి. సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించారని పేర్కొంటూ ...11లో

పార్లమెంట్, ప్రజాస్వామ్యంపై దాడి : ఖర్గే



రాజ్యసభలో రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ 'మొదట, చొరబాటుదారులు పార్లమెంటుపై దాడి చేశారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం పార్లమెంట్, ప్రజాస్వామ్యంపై దాడి చేసింది. మూకుమ్మడిగా ఎంపీలను సస్పెండ్ చేయడం ద్వారా నిరంకుశ మోడీ ప్రభుత్వం అన్ని ప్రజాస్వామ్య నిబంధనలను చెత్తబుట్టలో పడవేస్తోంది' అని విమర్శించారు. పార్లమెంట్ భద్రతలో క్షమించరాని ఉల్లంఘనపై కేంద్ర హెూంమంత్రి పార్లమెంటు ఉభయ సభల్లో ప్రకటన చేయాలి. దీనిపై సవివరమైన చర్చ జరగాలి. ప్రధాని మోడీ వార్తాపత్రికలకు ఇంటర్వ్యూ ఇవ్వవచ్చు. హెూంమంత్రి టీవీ ఛానెళ్లకు ఇంటర్వ్యూలు ఇవ్వొచ్చు. కానీ, భారత ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటుకు మాత్రం సమాధానం చెప్పరు. 'ప్రతిపక్షాలు లేని పార్లమెంటుతో, మోడీ ప్రభుత్వం ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన చట్టాలను బుల్డోజ్ చేయగలదు. అసమ్మతిని ఎలాంటి చర్చ లేకుండానే అణిచివేయగలదు' అని విమర్శించారు.

ప్రజాస్వామ్యానికి మంచి సంకేతం కాదు : హర్‌సిమ్రత్ కౌర్ బాదల్



ఎంపీల సస్పెన్షన్ ప్రజాస్వామ్యానికి మంచి సంకేతం కాదని ఎస్ఏడీ ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ అన్నారు. 'ఇది పెద్ద భద్రతా లోపం, ఇంటెలిజెన్స్ వైఫల్యం.. ఇది ఎలా జరిగిందో ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు. దేశ ప్రజలు చూస్తున్నారు. ప్రశ్నలు అడిగిన వారిని సస్పెండ్ చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచి సంకేతం కాదు' అని ఆమె అన్నారు.



28 నుంచి గ్రామసభలు

రేషన్ కార్డులు, పింఛన్లు, హౌజింగ్ లబ్దిదారుల ఎంపిక

- తెలంగాణ నుంచి సోనియాగాంధీ పోటీ చేయాలి
- కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు
- పార్టీ విజయానికి కృషి చేసిన, కార్యకర్తలు, నాయకులు, అగ్రనేతలకు ధన్యవాదాలు : టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో తీర్మానం
- అసెంబ్లీ సమావేశాలు, లోక్‌సభ ఎన్నికలపై చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, హౌజింగ్ కోసం లబ్దిదారులను ఆయా సభల ద్వారానే ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఏఐసీసీ ఇంచార్జ్ మానిక్ రావ్ ఠాక్రే అధ్యక్షతన నిర్వహించిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కమిటీ కన్వీనర్ షబ్బీర్ అలీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు సంపూర్ణ మద్దతు పలికిన ప్రజలకు కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు, ప్రచారంలో పాల్గొన్న ఏఐసీసీ అగ్రనాయకులకు సమావేశం ధన్యవాదాలు తెలిపింది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలనీ, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని మానిక్ రావు ఠాక్రే సూచించారు.

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో షబ్బీర్ అలీ వివరాలను వెల్లడించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి సోనియాగాంధీ పోటీ చేయాలని కోరుతూ పీఏసీ సమావేశం ఏకగ్రీవంగా ...11లో

కాంగ్రెస్ ఇన్‌చార్జీలు వీరే

వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ అధిష్ఠానం వేగంగా పావులు కదుపుతోంది. అందులో భాగంగానే తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను ఆ పార్టీ నియమించింది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన వారికి ఈ బాధ్యతలు అప్పగించింది. ఇన్‌ఛార్జిలుగా నియమితులైన వారిలో ముఖ్యమంత్రితోపాటు దాదాపు అందరూ మంత్రులే ఉన్నారు.

చేవెళ్ల, మహబూబ్‌నగర్ - రేవంత్ రెడ్డి	ఆదిలాబాద్ - సీతక్క
సికింద్రాబాద్, హైదరాబాద్ - భట్టి	పెద్దపల్లి - దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
నాగర్‌కర్నూల్ - జూపల్లి కృష్ణారావు	కరీంనగర్ - పొన్నం ప్రభాకర్
నల్లగొండ - ఉత్తమ్ కుమార్ రెడ్డి	నిజామాబాద్ - జీవన్ రెడ్డి
భువనగిరి - కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి	జహీరాబాద్ - పి.సుదర్శన్‌రెడ్డి
వరంగల్ - కొండా సురేఖ	మెదక్ - దామోదర రాజనర్సింహ
మహబూబాబాద్, ఖమ్మం - పొంగులేటి	మల్కాజిగిరి - తుమ్మల నాగేశ్వరరావు

మోడీని గద్దె దించడమే లక్ష్యం

ప్రతిపక్ష పార్టీలు కలిసే ఉంటాయి : లాలూ



- ఎన్డీయేను ఐక్యంగా ఎదుర్కొంటాం : నితీశ్
- నేడు ఢిల్లీలో 'ఇండియా' కూటమి నాలుగో సమావేశం
- హాజరుకానున్న లాలూ, నితీశ్

పాట్నా: ఢిల్లీలో ప్రతిపక్ష కూటమి 'ఇండియా' నాలుగో సమావేశం నేడు జరగనున్నది. ఈ సమావేశానికి ముందు అందరి దృష్టి బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌పై ఉన్నది. ఈ ఇద్దరూ ఈ సమావేశానికి హాజరవుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీని ఎదుర్కోవటానికి సీట్ల షేరింగ్, అజెండాను ఖరారు చేయటంలో వీరు నిర్ణయాత్మక పాత్ర పోషించనున్నారు.

కాగా, ఈ సమావేశంలో పాల్గొనటానికి వెళ్లే ముందు లాలూ ప్రసాద్ ...11లో

విద్యుత్‌రంగ కార్పొరేటీకరణ వద్దు

ఆ నిబంధనలు తొలగించండి

- వినియోగదారుల హక్కులు పరిరక్షించండి
- మీ నిర్లక్ష్య ఆర్థిక భారాన్ని మేం ఎందుకు భరించాలి?
- టీఎస్ఈఆర్సీ బహిరంగ విచారణలో విద్యుత్‌రంగ నిపుణులు



బహిరంగ విచారణ నిర్వహిస్తున్న టీఎస్ఈఆర్సీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్‌రంగ కార్పొరేటీకరణ విధానాలను 2024-2029 మల్టీ ఇయర్ టారిఫ్ (ఎమ్‌వైటీ) ప్రతిపాదిత నిబంధనల నుంచి తొలగించాలని పలువురు విద్యుత్‌రంగ నిపుణులు డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు తీసుకొనే అనాలోచిత నిర్ణయాలు, విద్యుత్ సంస్థలు చేసే నిర్లక్ష్య పూరిత తప్పిదాలకు వినియోగదారులు ఎందుకు మూల్యం చెల్లించాలని ప్రశ్నించారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) ఆధ్వర్యంలో సోమవారంనాడిక్కడి కోర్టు హాల్‌లో చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావు అధ్యక్షతన సభ్యులు ఎమ్‌డీ మనోహరరాజు (టెక్నికల్), బండారు కృష్ణయ్య (ఫైనాన్స్) నేతృత్వంలో ఎమ్‌వైటీపై బహిరంగ విచారణ జరిగింది. విద్యుత్‌రంగ నిపుణులు, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎమ్ వేణుగోపాలరావు మాట్లాడుతూ కార్పొరేటీకరణకు అనుగుణంగా ఉన్న నిబంధనల్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఎమ్‌వైటీ నిబంధనలు విద్యుత్ వినియోగదారుల హక్కుల్ని కాపాడేలా ఉండాలే తప్ప, వారిపై ...2లో

వ్యూహ ప్రతివ్యూహాలు

రేపటి అసెంబ్లీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ సన్నాహాలు

- లెక్కలతో పక్కాగా రండి.. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం : అంతర్గత భేటీల్లో రేవంత్
- కాంగ్రెస్‌కు ధీటుగా సమాధానమిద్దాం : బీఆర్ఎస్
- అధ్యయనంలో మునిగిపోయిన కేటీఆర్, హరీశ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శనివారం నాటి శాసనసభ సమావేశం అనుభవంతో ప్రత్యర్థికి ఎంతమాత్రమూ అవకాశమివ్వకుండా, మరింత ధీటుగా ఎదుర్కోవాలని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ భావిస్తున్నాయి. మొన్నటితో పోలిస్తే మరింత ఘాటుగా బదులిచ్చేందుకు ఆ రెండు పార్టీలూ సన్నద్ధమవుతున్నాయి. ఐఏఎస్, ఐపీఎస్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల్లాగానే ఆ రెండు పార్టీల అగ్రనేతలు అధ్యయనాల్లో మునిగి తేలుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి పారుదల, వ్యవసాయం తదితర కీలకాంశాలపై పట్టు సంపాదించేందుకు వీలుగా సీఎం రేవంత్ ఇప్పటికే ఆర్బీఐ మాజీ గవర్నర్ ...11లో



హైదరాబాద్‌కు విచ్చేసిన రాష్ట్రపతి

- స్వాగతం పలికిన గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం, తదితరులు 11లో..
- 23 వరకు రాష్ట్రపతి నిలయంలోనే బస

ఇలా ఎలా చేశారు?

నాణ్యత లేదు..అంతా నాసిరకమే..

- ఎల్‌అండ్‌టీ ప్రతినిధులపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం
- మేడిగడ్డపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

తప్పు చేసి ఎవరూ తప్పించుకోలేరు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'అంత పెద్ద ప్రాజెక్టులో నాసిరకంగా, నాణ్యత లేకుండా పనులు ఎలా చేశారు' అంటూ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పనులకు సంబంధించిన అంశాలపై చర్చిందేకు సోమవారం సచివాలయంలో ఆ కంపెనీ ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఏదో ఒక లెటర్ అధికారికిచ్చి మా ప్రమేయం ...2లో

నూతన పారిశ్రామిక వాడలకు భూమిని గుర్తించండి

- ఓఆర్ఆర్, త్రిపుల్ఆర్‌కు మధ్య 500 నుంచి వెయ్యి ఎకరాలుండాలి
- బంజరు భూములతోపాటు సాగుకు యోగ్యం కానివై ఉండాలి
- గతంలో పరిశ్రమలకు కేటాయించిన భూముల వివరాలివ్వాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

వివరాలు 2లో..

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

- త్వరలో మంత్రివర్గ విస్తరణ ..

వివరాలు 10లో



మేం కదలం

వేసుకున్న గుడిసెల స్థలాలకు పట్టాలివ్వాల్సిందే!

- పోయిన సర్కారు ఇయ్యలే.. కొత్త సర్కారైనా జాగాలియ్యాలే!
- ఇచ్చిన మాటను వెంటనే అమలు చేయాలని డిమాండ్
- జగిత్యాలకు తరలొచ్చిన వేలాది మంది పేదలు
- కలెక్టరేట్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ
- ఇల్లులేని ప్రతి ఒక్కరికీ 120గజాల స్థలం, రూ.15లక్షలు ఇవ్వాలి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాల పోరుయాత్ర

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / జగిత్యాల టౌన్

'ఇండ్ల జాగలు, వాటికి పట్టాలిచ్చే వరకూ గుడిసెలు వేసుకున్న స్థలం నుంచి ఇంచు కూడా కదలం. ఇంకెన్నాళ్లు మమ్మల్ని మోసం చేస్తారు.. పోయిన సర్కారు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇయ్యలే. గుడిసెలు వేసుకున్న జాగలకూ పట్టాలియ్యలే. కొత్తగా వచ్చిన సర్కారైనా పట్టాలిచ్చి, మాట ప్రకారం ఇందిరమ్మ ఇండ్లూ కట్టి ఇవ్వాలే.." అని పేదలు నినదించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఇంటిస్థలాల కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన పోరుయాత్రకు సోమవారం వేలాదిగా ప్రజలు తరలొచ్చారు. ఎర్రజెండా చేతబూనిన పేదలు కలెక్టరేట్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ రెండు కిలోమీటర్ల పొడవునా భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓకు దరఖాస్తులతోపాటు వినతిపత్రం అందించారు.

జగిత్యాల జిల్లా కేంద్ర శివారులోని నర్సింగాపూర్‌లో 437/112/2 సర్వే నెంబర్‌లోని దాదాపు 250 ఎకరాల ప్రభుత్వ భూమిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వేలాది మంది పేదలు గుడిసెలు వేసుకున్నారు. ఇప్పటికే కోరుట్ల పట్టణంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో సాగుతున్న భూపోరాట స్ఫూర్తిగా జగిత్యాలలోనూ పేదలు తరలివచ్చారు. ప్రతి పేద కుటుంబం నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఆ మొత్తం దరఖాస్తులతో సోమవారం పెద్దఎత్తున ర్యాలీ, బహిరంగసభకు పిలుపునిచ్చారు. నిరుపేదలు వేలాదిగా జగిత్యాల జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. కలెక్టరేట్ ఎదుట ...11లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, అజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



బుర్రా వెంకటేశంకు శుభాకాంక్షలు

- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన బుర్రా వెంకటేశంకు చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు సోమవారం ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ అధ్యక్షులు ఎంవీ రమణ, చేనేత కార్మిక సంఘం గౌరవ సలహాదారు కూరపాటి రమేశ్ పాల్గొన్నారు.

నూతన పారిశ్రామిక వాడలకు భూమిని గుర్తించండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నూతన పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసేందుకు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)కు బయట, రీజినల్ రింగ్ రోడ్ (త్రిపుల్ఆర్)కు లోపల 500 నుంచి వెయ్యి ఎకరాల మేరకు భూములను గుర్తించాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆయా భూములు విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులకు 50 నుంచి 100 కిలోమీటర్ల దూరంలోపే ఉండాలని కోరారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిపై సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సీఎం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పరిశ్రమల కోసం సేకరించేవి బంజరు భూములుగా ఉండడంతోపాటు సాగుకు యోగ్యం కానివిగా ఉండాలని స్పష్టం చేశారు. దీనివల్ల, రైతులకు నష్టం కలగదు, కాలుష్యం తక్కువగా ఉంటుంది, అభివృద్ధి వికేంద్రీకరణకు అవకాశముంటుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు రాష్ట్రంలో పరిశ్రమలకు కేటాయించిన భూములు, పారిశ్రామిక అవసరాలకు కాకుండా, ఆ భూములను ఉపయోగించకుండా ఉన్న వాటిపై పూర్తి వివరాలను అందజేయాలని ఆదేశించారు. పారిశ్రామిక వికేంద్రీకరణకు ప్రాధాన్యతనిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు అనేక కంపెనీలకు గతంలో పెద్ద ఎత్తున భూములను కేటాయించారని అన్నారు. వాటిలో ఎన్ని పరిశ్రమలు ఏర్పాటు చేశారు, వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటి? అనే అంశాలపై పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

కాలుష్య రహిత పరిశ్రమలకు ప్రాధాన్యతనివ్వాలి

రాష్ట్రంలో కాలుష్య రహిత పరిశ్రమలకు ప్రాధాన్యత నివ్వాలని రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని నాచారం, జీడిమెట్ల, కాటేదాన్ తదితర పారిశ్రామిక వాడల విషయంలో ప్రత్యామ్నాయాలను సూచించాలని కోరారు. బల్క్ డ్రగ్ ఉత్పత్తుల కంపెనీల ఏర్పాటుకు చేపట్టాల్సిన చర్యలపై మధ్య ప్రాచ్య, యూరోపియన్ దేశాల్లో అమల్లో ఉన్న విధానాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. రాష్ట్రంలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో ప్రభుత్వ, నిరుపయోగ, బంజరు భూములను గుర్తించి పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. ఇవి నివాస ప్రాంతాలకు దూరంగా ఉండాలన్నారు. దీనివల్ల ఆయా భూములకు ధరలు కూడా తక్కువగా ఉండడంతోపాటు భూసేకరణకు రైతులు కూడా సహకరిస్తారని వివరించారు. ఈ సందర్భంగా బాలానగర్‌లోని ఐడీపీఎల్ భూముల పరిస్థితిపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ కృష్ణ భాస్కర్, సీఎంవో అధికారులు వి శేషాద్రి, శివధర్‌రెడ్డి, షానవాజ్ కాసీం తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీఎం కోసం తుగ్లక్ రోడ్ రెడీ

సీఎం నేమ్ ప్లేట్ ఛేంజ్, కొనసాగుతోన్న మరమ్మతులు

- బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు వద్ద సెక్యూరిటీ తొలగింపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ సీఎం అధికారిక నివాసం తుగ్లక్ రోడ్ 23ని నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోసం అధికారులు సిద్ధం చేశారు. సీఎం కేసీఆర్ పేరుతో ఉన్న పాత నేమ్ ప్లేట్‌ను తొలగించి, ఆ స్థానంలో సీఎం రేవంత్ రెడ్డి పేరుతో కొత్త నేమ్ ప్లేట్‌ను పెట్టారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ మూడు భాషల్లో సీఎం రేవంత్ పేరును ఏర్పాటు చేశారు. కాగా, కేంద్ర మంత్రి హోదాలో 2004 లో ఈ నివాసానికి మారిన కేసీఆర్, అనంతరం ఉద్యమ నేతగా, తెలంగాణ సీఎంగా దాదాపు 20 ఏండ్ల పాటు ఈ నివాసంలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో కేసీఆర్ ఈ నివాసాన్ని ఖాళీ చేయక తప్పలేదు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన వస్తువులు, విలువైన సామాగ్రి ఇటీవలే తరలించడంతో... నూతన సీఎం కోసం ఢిల్లీ తెలంగాణ భవన్ అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. తాజాగా సీఎం బంధువులు తుగ్లక్ రోడ్‌లో పలు పూజలు నిర్వహించినట్లు తెలిసింది. వారి ఆదేశాల ప్రకారం, సీఎం రేవంత్ పేరుతో బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు, మరమ్మతులు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే నేడు సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్తున్నప్పటికీ, ఆయక తుగ్లక్ రోడ్ లో ఉంటారా?, ఢిల్లీ అధికారిక నివాసంగా కొనసాగిస్తారా? అనే అంశంపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది.



తనదైన ముద్ర

సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి భద్రత విషయంలో తనదైన ముద్ర వేస్తున్నారు. ఇప్పటికే సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా 'గ్రీన్ ఛానల్ సెక్యూరిటీ' (ట్రాఫిక్ బ్లాక్) వద్దని చెప్పారు. తన కాన్వాయ్ లో 15 వాహనాలుంటే, 9కి కుదిస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అలాగే ఢిల్లీలోనూ సెక్యూరిటీని తగ్గించారు. బీఆర్ఎస్ హయాంలో తుగ్లక్ రోడ్‌లోని సీఎం నివాసానికి ఒక్కో నెల చొప్పున నాలుగు పోస్ట్ లకు తెలంగాణ బెటాలియన్ (సుమారు 50 మంది పోలీసులు) కాపు కాసేవారు. సర్దార్ పటేల్ రోడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ తాత్కాలిక కేంద్ర కార్యాలయం ప్రారంభం తర్వాత, మరిన్ని స్పెషల్ టీంలను గత ప్రభుత్వం ఢిల్లీలో మోహరించింది. ఇక వసంత్ విహార్‌లోని కొత్త భవనానికి భద్రతను పెట్టింది. దీనికి తోడు సీఎం సెక్యూరిటీ ఫోర్స్ అదనంగా ఉండేది. అయితే ఇప్పుడు, ఈ భద్రతను తగ్గించారు. తుగ్లక్ రోడ్ కోసం వచ్చే తెలంగాణ బెటాలియన్‌ను కూడా తాత్కాలికంగా రద్దు చేశారు. ఏపీ, తెలంగాణ భవన్ కోసం వచ్చిన టీంలోని ముగ్గురు జవాన్లు తుగ్లక్ రోడ్‌ని కాపుకాస్తుండగా, సీఎం సెక్యూరిటీలో నలుగురు భద్రతా సిబ్బందిని మాత్రమే ఢిల్లీలో పెట్టారు.

విద్యుత్‌రంగ కార్పొరేటీకరణ వద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థికభారాన్ని పెంచేలా ఉండటం సరికాదన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) బహిరంగ విచారణల్లో ఈఆర్సీ ఎదుట చెప్తున్న మాటలు, అంకెలకూ, ఆ తర్వాత సమర్పిస్తున్న లెక్కలకు మధ్య భారీ అంతరం ఉంటున్నదనీ, ప్రణాళికల అంచనాలు పూర్తిగా మారిపోతున్నాయని చెప్పారు. హేతుబద్ధత లేని ఇలాంటి నిర్ణయాల వల్ల విద్యుత్ వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకొని, ఆ తర్వాత వద్దన్నారనీ, ఫలితంగా రూ.300 కోట్ల పరిహారం చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఇలాంటి తప్పుడు నిర్ణయాలకు విద్యుత్ వినియోగదారులు బాధ్యులు ఎలా అవుతారని ప్రశ్నించారు. అసలు ఇలాంటి నిర్ణయాలకు బాధ్యులు ఎవరో కూడా ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదన్నారు. విద్యుదుత్పత్తిదారులకు సకాలంలో పేమెంట్స్ చేయకుంటే, వడ్డీ, జరిమానాలతో సహా చెల్లించాలని షరతులు పెట్టారనీ, అలా చెల్లింపులు చేయాల్సింది విద్యుత్ సంస్థలే తప్ప ప్రజలు కాదని తేల్చిచెప్పారు. ఆ వడ్డీలు, జరిమానాలు అంతిమంగా ప్రజలపైనే పడుతున్నాయని గుర్తుచేశారు. తెలంగాణ డిస్కంలు మూడేండ్లు వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనలు (ఏఆర్ఆర్) ఇవ్వలేదనీ, సుమోటోగా స్వీకరించాల్సిన ఈఆర్సీ కూడా తన విధినిర్వహణలో ఫెయిల్ అయ్యిందని చెప్పారు. రాజకీయపార్టీలు ఎన్నికలకు ముందు ఇచ్చే వాగ్దానాల అమల్లో ఈఆర్సీ భాగస్వామ్యం కావడం సరికాదన్నారు. ఆయా వాగ్దానాల అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు లభించేదాకా, వాటికి ఆమోదం తెలపడం సరికాదన్నారు. ఇలాంటి తప్పుడు నిర్ణయాల వల్లే డిస్కంలు ఆర్థికంగా కుప్పకూలుతున్నాయని తెలిపారు. విద్యుదుత్పత్తి సంస్థల మధ్య పోటీ ఉంటేనే, ధరలు నియంత్రణలోకి వస్తాయనీ, దానికి సోలార్ విద్యుత్ ధరల తగ్గుదలే ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పారు.

ఉత్పత్తి సంస్థల వద్ద ధర ఎక్కువుందని కొనుగోళ్లు ఆపేస్తే, ఫిక్సెడ్ చార్జీలు చెల్లించాల్సి వస్తున్నదనీ, తక్కువ ధర కరెంటు కంటే ఈ చార్జీలే అధికంగా ఉంటున్నాయని వివరించారు. సహజవాయువు (గ్యాస్) ఆధారిత విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో కార్పొరేట్ సంస్థలు రూపాయల్లో పెట్టుబడులు పెడితే, డాలర్లలో చెల్లింపులు చేయడం ఏంటని ప్రశ్నించారు. బొగ్గు సరఫరాలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందనీ, ఫలితంగా విదేశీ బొగ్గు దిగుమతులు పెరిగాయని చెప్పారు. కానీ స్వదేశంలోని బొగ్గును ఆదానీ గ్రూపు సంస్థలు విదేశాలకు ఎగుమతి చేసి, అక్కడి నుంచి ఇక్కడకు దిగుమతి చేసుకుంటున్నట్టు చూపుతున్నాయనీ, ఇదేం న్యాయమని నిలదీశారు. వినియోగదారుల హక్కుల్ని కాపాడేలా, వారిపై ఆర్థికభారాలు లేకుండా ఎమ్‌వైటీ నిబంధనలు ఉండాలని కోరారు. ప్రయాస్ గ్రూప్ సభ్యులు ఎన్ శ్రీకుమార్ మాట్లాడుతూ ఎమ్‌వైటీ విశ్లేషణకు ఈఆర్సీ అతి తక్కువ సమయం కేటాయించిందనీ, దీనివల్ల అనేక విషయాలు మరుగునపడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిస్కంలు సరైన ప్రణాళికలు రూపొందించాలనీ, దానికి అనుగుణంగా విద్యుతుత్పత్తి, ట్రాన్స్‌మిషన్ లైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అంచనాలు తలకిందులైతే వినియోగదారులపైనే ఆర్థిక భారాలు పడతాయని విశ్లేషించారు. ప్రయివేటు సంస్థల ప్రవేశం ఉన్నప్పుడు కాంపిటీటివ్ బిడ్డింగ్ ఉండాలనీ, దానివల్ల ధరలు తగ్గుతాయని అన్నారు. బహిరంగ విచారణలో డిస్కంలు, ట్రాన్స్‌కో, జెన్‌కో, సింగరేణి కాలరీస్, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తా : సీఎం పీఆర్వో విజయ్

- ఢిల్లీ టీయూడబ్ల్యూజే అభినందనలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ తెలుగు జర్నలిస్ట్‌లకు, తెలంగాణ ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తానని ముఖ్యమంత్రి ఢిల్లీ పీఆర్వో డి. విజయ కుమార్ అన్నారు. సీఎం ఢిల్లీ పర్యటనలు, ఇతర అంశాలపై మీడియాకు సమాచారం ఇవ్వడంతో పాటు, జర్నలిస్ట్‌ల సమస్యల పరిష్కారంలో తనవంతు పాత్ర పోషిస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీలో ప్రజా సంబంధాల అధికారి(పీఆర్వో) గా నియమితులైన డి విజయ కుమార్ ను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) సోమవారం ఘనంగా సత్కరించింది. ఢిల్లీ తెలంగాణ భవన్ లోని గురజాడ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో విజయ్ కుమార్‌ను టీయూడబ్ల్యూజే అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే ఢిల్లీ అధ్యక్షులు నాగిళ్ల వెంకటేశ్ మాట్లాడుతూ యూనియన్ ఉపాధ్యక్షుడిగా ఉన్న విజయ కుమార్ సీఎం పీఆర్వోగా నియమితులు కావడం జర్నలిస్ట్‌లందరికీ శుభపరిణామం అన్నారు. ఢిల్లీలో జర్నలిస్ట్ లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీ జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు, ఆరోగ్యశ్రీ వర్తింపు అంశాలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం జనరల్ సెక్రటరీ తిరుపతి, కోశాధికారి కొండపల్లి శిరీష్ రెడ్డి మాట్లాడుతూ... ఢిల్లీలో తెలుగు మీడియాలో సుదర్ఘీంగా పని చేసిన అనుభవం, జర్నలిస్టుల సమస్యలు తెలిసిన విజయ కుమార్‌కు సీఎం పీఆర్వోగా బాధ్యతలు ఇవ్వడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విజయ్ పిఆర్వో పదవిలో రాణించాలని, దానికి అందరం సహకరిస్తామని అభినందనలు తెలిపారు.



యువత అవకాశాలను వినియోగించుకోవాలి

- టీటీఏ ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళాలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కాజీపేట

తెలంగాణాలో ఉద్యోగాల భర్తీకి తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) నిర్వహిస్తున్న జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం క్వాడ్రంట్ ఆఫీస్, ఐటీ సెజ్ మడికొండలో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణలో ఉద్యోగాల భర్తీకి తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) జాబ్ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్న 35 కంపెనీలు సుమారు 1500 నుంచి 2000 వరకూ ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉంది. వరంగల్‌లో ఉన్న క్వాడ్రంట్ టెక్నాలజీస్ సంస్థలో జాబ్ మేళాలో టెక్ మహీంద్రా, జెన్ పాక్ట్, క్వాడ్రంట్ టెక్నాలజీస్, థ్రిమిర్ సాఫ్ట్ వేర్, కారా, వన్ స్టాప్, టాటా డ్రైవ్, అపోలో మెడ్ స్కిల్స్, వరుణ్ మోటార్స్, వీ3 టెక్ సొల్యూషన్స్ వంటి కంపెనీలు ఈ మేళాలో పాల్గొన్నాయి. యువతలో నైపుణ్యాలను వెలికి తీసేందుకు, యువతకు ప్రభుత్వ, ప్రయివేటు రంగ సంస్థల్లో స్థానికంగా పెద్ద సంఖ్యలో ఉపాధి అకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ మేళాలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్లు ఏ.నాగరాజు, గుంటి కుమారస్వామి, ఎంపీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్టాఫ్ నర్సు పరీక్ష ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ స్టాఫ్ నర్సు ఉద్యోగ పరీక్ష ఫలితాలను టీఎస్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్‌బీ) విడుదల చేసింది. మొత్తం 5,204 పోస్టులకు ఆగస్టు 2న కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించగా.. దాదాపు 40 వేల మంది పరీక్షలను రాశారు. తాజాగా ఈ పరీక్ష తుది కీతో పాటు ఫలితాలను బోర్డు విడుదల చేసింది. తమ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రాథమిక జాబితాను అందుబాటులో ఉంచినట్టు తెలిపింది. అభ్యర్థులు పొందిన పాయింట్లపై అభ్యంతరా లను ఈ నెల 20లోపు ఆన్‌లైన్‌లో తెలపవచ్చని సూచించారు. పరీక్ష నిర్వహణ తర్వాత ఆర్థికశాఖ మంజూరు చేసిన 1,800 పైగా పోస్టులను కూడా ఈ ఫలితాలతో భర్తీ చేయాలని బోర్డు నిర్ణయించిన విషయం విదితమే. దీంతో ఈ మారు 7,094 పోస్టులు భర్తీ కానున్నాయి.

చేనేత పథకాలను పునరుద్ధరిస్తాం : మంత్రి తుమ్మల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చేనేత పథకాలను పునరుద్ధరిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో చేనేత సమస్యలపై పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేతల అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు లేకుండా నిధులు కేటాయిస్తామని తెలిపారు. నూతన పథకాలు కూడా రూపొందిస్తామని హామీ ఇచ్చారు. తనను కలిసిన పద్మశాలి సంఘం నాయకులకు వివిధ జిల్లాల నుండి చేనేత సహకార సంఘం నాయకులతో పాటు చేనేత జౌళి శాఖ కమిషనర్ అలుగు వర్షిని , డైరెక్టర్ శ్రీనివాసరావులతో సమీక్ష సమావేశం నిర్వహించి అప్పటికప్పుడే సంఘాలు ఇచ్చిన వినతి పత్రాలను పరిశీలించి ఆ సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మచ్చ ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి కమ్మర్ల మురళి, అఖిల భారత పద్మశాలి యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్‌లు మాట్లాడుతూ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. గత ప్రభుత్వ పథకాలను యధావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి ఇంజనీరింగ్ విభాగం జాతీయ అధ్యక్షులు పుట్ట పాండురంగయ్య, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు పెద్ద జగదీష్ , రాపోలు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలే లక్ష్యం

ప్రతి అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా శ్వేత పత్రం

- నిర్దిష్టమైన గణాంకాలు ఉండాలి..
- వచ్చేసారి నుంచి శాఖల వారీగా సమీక్ష : పాలేరు నియోజకవర్గం, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంలోని నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై మంత్రి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజలు ఆశయాల మేరకు, వారి నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయమని తెలిపారు. ప్రతి అంశంలో రాష్ట్ర వ్యాప్తంగా శ్వేత పత్రం విడుదల చేస్తామన్నారు. అధికారులు తమ శాఖలకు సంబంధించి కచ్చితమైన లెక్కలు ఇవ్వాలని చెప్పారు. పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, రోడ్లు భవనాలు, డబుల్ బెడ్ రూమ్, వైద్యం, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖల పనులపై సమీక్ష చేశారు. మిషన్ భగీరథ ద్వారా క్షేత స్థాయిలో ఎంత మంది ప్రజలు, ఎన్ని గహాలకు తాగునీటి సరఫరా చేస్తున్నది నివేదిక సమర్పించాలన్నారు. విద్యుత్ ఎన్ని గంటలు ఇస్తున్నది తెలపాలని సంబంధిత అధికారులకు సూచించారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు స్థల కేటాయింపు, ఫ్యాకల్టీ, పూర్తి స్థాయిలో కళాశాల నడిచేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే ద్వారా చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతి, సమస్యలు, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

సీతారామ ప్రాజెక్టు కింద 2 ప్యాకేజీల పనులు జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు. అవసరం లేని చోట భూసేకరణ చేస్తే పనికివచ్చే భూములను ఉంచి, మిగతా భూములు చుట్టుపక్కల గ్రామాల నిరుపేదలకు పంపిణీ చేయాలని సూచించారు. మున్నేరు వాగు నుండి లిఫ్ట్ లేకుండా, గ్రావిటీతో సీతారామ ప్రాజెక్టుకు నీరు వెళుతుందా.. లేదా ప్రణాళిక చేయాలన్నారు. పాలేరు లింక్ కెనాల్ భూసేకరణకు రైతులతో మాట్లాడి పనులు



ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో 7/24 వైద్యాధికారులు అందుబాటులో ఉండేలా, ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చూడాలన్నారు. నగరానికి చుట్టుపక్కల జరిగిన రిజిస్ట్రేషన్లను పరిశీలించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్థిక వ్యవస్థను అతికొద్ది రోజుల్లో గాడిలోకి తెస్తామని, వేతనాలు 1-5వ తేదీలోగా ఇచ్చేలా చర్యలు చేపడతామని అన్నారు. 50 శాతానికి పైగా పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేయాలని, మంజూరయిన పనులు పున్ల సమీక్షించి, ప్రాధాన్యత ప్రకారంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అందరం కలిసి ప్రజలకు మంచి చేసినదే నిజమైన పరిపాలన అని స్పష్టంచేశారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు డీసీపీ ప్రసాదరావు, జిల్లా అధికారులు, డివిజన్, పాలేరు నియోజకవర్గ మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఎలా చేశారు?

(మొదటిపేజీ తరువాయి)

లేదని తప్పించుకోవాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రజా ధనాన్ని వృథా చేసి, ప్రాజెక్టు కూలిపోవటానికి కారణమైన వారినెవ్వరినీ వదిలిపెట్టబోమని ఆయన తెలిపారు. మేడిగడ్డ ఘటనపై పూర్తి స్థాయి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కట్టిన ఏజెన్సీలను కూడా పిలిచి మాట్లాడాలనీ, తప్పు చేసిన వారు తప్పించుకోవాలని చూస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇదీ జరిగింది..!

మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన ప్రాంతాన్ని, దెబ్బతిన్న పియర్స్‌ను పునరుద్ధరించే పని తమది కాదని నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ ఇటీవల స్పష్టం చేసింది. దానికి అయ్యే మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందనీ, అందుకోసం అనుబంధ ఒప్పందం చేసుకుంటేనే ముందుకెళ్తామని పేర్కొంది. బ్యారేజీ కుంగినప్పుడు నిర్వహణ గడువు ఇంకా ఉందనీ, పునరుద్ధరణకు అయ్యే ఖర్చు మొత్తం నిర్మాణ సంస్థే భరిస్తుందని ప్రాజెక్టు ఇంజినీర్లు అధికారికంగా ప్రకటించారు. నిర్మాణ సంస్థ కూడా ఈ మేరకు ప్రకటన చేసింది. తాజాగా ఇందుకు భిన్నంగా లేఖ రాయడం, దీనిపై తదుపరి చర్య తీసుకోవాలని సంబంధిత ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) కింది స్థాయి ఇంజినీర్లకు ఆ లేఖను పంపడం చర్చనీయాంశంగా మారింది. బ్యారేజీ కుంగిన చోట పియర్స్, పునాదికి ఏం జరిగిందో తెలుసుకోవటానికి ఆ ప్రాంతంలోకి నీరు రాకుండా మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఆ నిర్మాణానికి రూ. 55.75 కోట్లు ఖర్చవుతుందనీ, ఈ మొత్తానికి ఒప్పందం చేసుకోవాలని కోరుతూ ఎల్అండ్‌టీ ఈ నెల 2న కాళేశ్వరం ఎత్తిపోతల ఈఎన్‌సీ(రామగుండం) వెంకటేశ్వర్లుకు లేఖ రాసింది. ఈ లేఖను ఈ నెల 5న సంబంధిత ఎస్ఈకి పంపి, అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఈఎన్‌సీ సూచించారు. దెబ్బతిన్న బ్లాక్‌ను, పియర్స్‌ను పునరుద్ధరించటానికి సుమారు రూ.500కోట్ల వరకు ఖర్చు కావొచ్చని నీటిపారుదల శాఖ ప్రాథమికంగా పేర్కొంటూ వచ్చింది.మరో వైపు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో కుంగుబాటుకు గురైన మేడిగడ్డ(లక్ష్మి) బ్యారేజీకి సంబంధించిన పూర్తి వివరాలివ్వాలని నీటిపారుదల శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశించిన సంగతి తెలిసిందే. ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం, ఆదివారం తన నివాసంలో ఇంజినీర్లతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం హయాంలో కొత్తగా నిర్మించిన ప్రాజెక్టులు, వాటికి చేసిన ఖర్చుల వివరాలను అందజేయాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై వాస్తవాలను తేల్చేందుకు జ్యుడిషియల్ విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది.

మహిళలతో బస్సులు కిటకిట

'మహాలక్ష్మి' ఎఫెక్ట్‌తో 40 శాతం పెరిగిన ప్రయాణికులు



రోజువారీ సగటు సంఖ్య 28 లక్షల నుంచి 43 లక్షలకు పెంపు

పాత బస్సులు కావటంతో.. అదుపు తప్పే ప్రమాదం ఉందనే ఆందోళన

నవతెలంగాణ - బోనకల్

మహాలక్ష్మి పథకం ఆర్టీసీ బస్సులపై పెద్ద ప్రభావమే చూపుతోంది. నిత్యం 13 లక్షల మేర ప్రయాణికుల సంఖ్య పెరిగింది. అదనంగా ప్రయాణిసున్న వారిలో 90 శాతం మంది మహిళలే అన్నది సుస్పష్టం. ఈ రూపంలో ఆర్టీసీకి రోజువారీ ఆదాయం దాదాపు రూ.4.50 కోట్లు పెరిగినట్టు లెక్కలు చెబుతున్నాయి. మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో (ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్) ఉచితంగా ప్రయాణిస్తున్నందున టికెట్ రూపంలో నేరుగా ఆర్టీసీకి ఆదాయం తగ్గుతుంది తప్ప పెరగదు. కాని ఈ పథకంతో ఆర్టీసీ కోల్పోయే ఆదాయాన్ని ప్రభుత్వం రీయింబర్స్ రూపంలో ఆదాయం సమకూరుతుంది. గతంలో సాధారణ రోజుల్లో ఆర్టీసీకి నిత్యం రూ.13-14 కోట్ల వరకు ఆదాయం వస్తుండగా, ఇప్పుడది రూ.18.25 కోట్లకు చేరుతోంది. గతంలో సాధారణ రోజుల్లో (సోమవారం కాకుండా) నిత్యం బస్సుల్లో 25-30 లక్షల మధ్య ప్రయాణించేవారు. ఇప్పుడది 43 లక్షలు దాటుతోంది. వెరసి ఈ పథకం ప్రారంభమయ్యాక 40 శాతం ప్రయాణికులు పెరిగనట్టు ఆర్టీసీ అధికారులు గుర్తించారు.

ఖమ్మం జిల్లాలో కూడా మహిళలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం చేస్తున్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టకముందు కనీసం 30 నుంచి 40 శాతం మహిళలు కూడా బస్సుల్లో ఎక్కేవారు కాదు. కానీ ప్రస్తుతం 80శాతం మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లోనే వెళుతున్నారు. బోనకల్ నుంచి ఖమ్మం వెళ్లే రూట్‌లో పల్లె బస్సులే ఎక్కువగా ఉన్నాయి. ఈ రూట్‌లోనే ఆర్టీసీకి అత్యధిక ఆదాయం వస్తుంది. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడంతో ఆదాయం మూడు రెట్ల వరకు పెరిగినట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఖమ్మం నుంచి విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కొన్ని మాత్రమే ఉన్నాయి.

నాలుగు వేల బస్సులు పాతవే..

మహిళల సంఖ్య భారీగా పెరిగినందున బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. చాలా బస్సుల్లో మూడొంతుల స్థలంలో మహిళలే ఉంటున్నారు. దాంతో పురుషులు కొందరు స్థలం లేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుత పరిస్థితి అదుపు తప్పకుండా ఉండాలంటే కనీసం 2,500 కొత్త బస్సులు సమకూర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు లెక్కలేశారు. ప్రస్తుతం 40 శాతం రద్దీ పెరిగినా, ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఉన్న బస్సులతోనే నెట్టుకొస్తున్నారు. అయితే, ఆర్టీసీలో దాదాపు 4 వేల బస్సులు బాగా పాతబడి ఉన్నాయి. ఈ బస్సుల్లో రద్దీ పెరిగితే అదుపుతప్పే ప్రమాదం ఉంటుంది. ప్రమాదాలు చోటుచేసుకునే వరకు ఎదురుచూడకుండా కొత్త బస్సులు సమకూర్చుకోవాలని ఆర్టీసీ భావిస్తోంది. గతంలో ఆర్డర్ ఇచ్చిన బస్సులు కొన్ని త్వరలో సమకూరే అవకాశం ఉంది. కానీ అవి సరిపోవని, ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని కొత్త బస్సులు కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించింది.

జీరో టికెట్ జారీతో తేలిన లెక్క...

సాధారణంగా ఆర్టీసీ బస్సుల్లో సోమవారం రద్దీ అధికంగా ఉంటుంది. సాధారణ రోజుల్లో సగటున 28 లక్షల మంది ప్రయాణిస్తే, సోమవారాల్లో ఆ సంఖ్య 34 లక్షల వరకు ఉంటుంది. మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ప్రారంభమయ్యాక, గత సోమవారం 51 లక్షల మంది ప్రయాణించినట్టు ఆర్టీసీ అధికారులు లెక్కలేశారు. అయితే, ఆరోజు వరకు మహిళలకు టికెట్ల జారీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. టికెట్లు జారీ చేస్తే ఎంతమంది మహిళలు బస్సులు ఎక్కారనేది ఖచ్చితంగా తెలుస్తుంది. మూడు రోజుల క్రితం జీరో టికెట్ల జారీ ప్రక్రియ మొదలుపెట్టారు.

మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణించారో ఆ టికెట్ల జారీతో తేలుతుంది. దానికి ఎంత చార్జీ చెల్లించాల్సి ఉంటుందో కూడా అందులో స్పష్టమవుతుంది. ఆర్టీసీ ఆ లెక్కలను ప్రతినెలా ప్రభుత్వానికి అందిస్తుంది. దాని ఆధారంగానే ఆ మొత్తాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. ఇప్పుడు జీరో టికెట్ల జారీ ప్రకారం 16న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో 43,12,033 మంది ప్రయాణించినట్టు తేలింది. వీరి ద్వారా రూ.1,826.49 కోట్ల ఆదాయం సమకూరింది. (ప్రభుత్వం రీయింబర్స్ చేసే మొత్తంతో కలిపి)



మంత్రి పొన్నం ప్రభాకర్
బాధ్యతల స్వీకరణ

ఆర్టీసీ, రవాణాశాఖకు చెందిన మూడు ఫైళ్లపై సంతకం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఆ తర్వాత ఆయన టీఎస్‌ఆర్టీసీ, రవాణా శాఖకు సంబంధించిన మూడు ఫైళ్లపై సంతకం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి బస్‌పాస్‌లకు రాయితీల ఖర్చు కింద రీయింబర్స్‌మెంట్ కోసం రూ.212.50 కోట్లను విడుదల చేస్తూ ఒక ఫైలు, 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి రూ.162.50 కోట్లను విడుదల చేస్తూ మరో ఫైలు, హెడ్ ట్రాన్స్ పోర్ట్ కానిస్టేబుల్ ఎల్ పాండుబాబు భార్య ఎల్ రాజ్యలక్ష్మికి రూ.లక్ష మెడికల్ క్లెయిమ్‌ను మంజూరు చేస్తూ మూడో ఫైల్‌పై ఆయన సంతకం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్‌ను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వివేక్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శులు బుర్రా వెంకటేశం, వాణీప్రసాద్, టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు కలిసి అభినందించారు.

చైతన్యపురిలో కారు బీభత్సం

- యువకుడు మృతి
- పలువురికి గాయాలు
- కారులో చౌటుప్పల్ తహసీల్దార్ కుమారుడు
- మద్యం మత్తే కారణమా?





నవతెలంగాణ - చైతన్యపురి

హైదరాబాద్ చైతన్యపురిలో అర్ధరాత్రి ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో యువకుడు మృతిచెందాడు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ బోయ నాగార్జున, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

శాలివాహన నగర్‌లో నివసించే చౌటుప్పల్ తహసీల్దార్ హరికృష్ణ కుమారుడు సాయి కార్తీక్, అతని స్నేహితులు శరత్ చంద్ర, మహేష్, సురేష్, నవీన్, నవీన్ రెడ్డి, రజినీకాంత్ కారులో ఆదివారం రాత్రి మీర్‌పేట్‌లోని స్నేహితుని పుట్టినరోజు వేడుకలకు వెళ్లారు. అనంతరం అర్ధరాత్రి సుమారు 1:30 గంటల సమయంలో మీర్‌పేట్ నుంచి ఉప్పల్ వైపు వెళ్తున్నారు. కారు అతివేగం వల్ల అదుపుతప్పి ప్రధాన రహదారి నుంచి పక్కకు వెళ్లి రాజీవ్‌గాంధీ నగర్ కాలనీ కమాన్ వైపు దూసుకుపోయి జెండా దిమ్మెను ఢీకొట్టింది. అదే సమయంలో ఆ జెండా దిమ్మెపై కూర్చున్న రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన చైతేష్ అలియాస్ విశాల్(27) అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో కారు డ్రైవింగ్ చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యులు నిద్రించిన తర్వాత సాయి కార్తీక్ కారు తీసుకొని పార్టీకి వెళ్లినట్టు తెలుస్తోంది. కారు తహసీల్దార్ హరికృష్ణ భార్య పేరిట రిజిస్ట్రేషన్ ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, చైతేష్ డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగించేవాడు.

విషమంగా ఇద్దరి పరిస్థితి..

కారులో ఉన్న ఏడుగురు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉండటంతో కారు డ్రైవింగ్ ఎవరు చేశారన్నది ఇంకా నిర్ధారణ కాలేదని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిలో ఇద్దరు కొత్తపేటలోని ఓమ్ని ఆస్పత్రిలో, ఒకరు యశోద ఆస్పత్రిలో, నలుగురు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉస్మానియాలో చికిత్స పొందుతున్న సురేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీన్ రెడ్డి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు ఇన్‌స్పెక్టర్ నాగార్జున వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన వారిపై మోటార్ వెహికల్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తా..

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హెలికాప్టర్‌పై నుంచి పూల వర్షం

- గజమాలతో ఘనంగా సన్మానం



నవతెలంగాణ- నల్లగొండ టౌన్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తానని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక మొదటిసారి సోమవారం నల్లగొండ నియోజకవర్గానికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. భారీ కాన్వాయ్‌తో మర్రిగూడ బైపాస్ చేరుకున్న మంత్రి డాక్టర్ బీఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

అనంతరం వేలాది మంది అభిమానులతో భారీ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు చల్లూరి మురళీధర్ రెడ్డి వినూత్నంగా స్వాగతం పలికారు. మర్రిగూడ బైపాస్ వద్ద ప్రత్యేక హెలికాప్టర్‌తో కోమటిరెడ్డిపై పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమైన శాఖలు జిల్లా మంత్రుల దగ్గరే ఉన్నాయని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 11 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకొని మరోసారి నల్లగొండ జిల్లా పార్టీ కంచుకోటగా నిరూపితమైందని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. డిసెంబర్ 3న నిజమైన తెలంగాణ సిద్ధించిందని తెలిపారు. నల్లగొండ అభివృద్ధి తమ లక్ష్యం, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోమని చెప్పారు. నల్లగొండలో గూండాయిజం, రౌడీయిజం లేకుండా చేసి 24 గంటలు ప్రజలకి అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

రాబోయే రోజుల్లో అర్హులైన ప్రతి నిరుపేదకీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. గత పదేండ్లలో గజ్వేల్, సిద్దిపేట్, సిరిసిల్ల తప్ప.. ఎక్కడా అభివృద్ధి జరగలేదని, కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకూ న్యాయం చేస్తామని చెప్పారు. 10ఎండ్ల నియంతృత్వ పాలన పోయి.. నిజమైన ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ఇక నుంచి ప్రతి ఒక్కరే సంతోషంగా బతికేలా కాంగ్రెస్ పాలన ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, నల్లగొండ, తిప్పర్తి, జెడ్పీటీసీలు వంగూరు లక్ష్మయ్య, పాశం రామ్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- అభివృద్ధికి ఇద్దరు మంత్రులూ కృషి చేయాలి : విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, దీనికి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రధానంగా ప్రాజెక్టులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, ఎస్‌ఎల్‌బీసీ టెన్నల్ పనులు, ఎడమ కాలు పరిధిలోని లిఫ్టుల నిర్వహణ, మరమ్మతులు, వరద కాలువ రిపేర్లు వెంటనే పూర్తి చేయాలని కోరారు. దీనికోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. పట్టణాల్లో నిలిచిపోయిన అంతర్గత డ్రెయినేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ వెంటనే చేపట్టాలని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, రోడ్లు, ఉద్యోగ అవకాశాలు, కరెంట్ సమస్యలను పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వం గొర్రెల పంపిణీ కోసం లబ్దిదారుల నుంచి డీడీల రూపంలో నగదు స్వీకరించిందని, ఆ లబ్దిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అందుకు అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, నాయకులు నూకల జగదీష్ చంద్ర, మూడవత్ రవి నాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, శశిధర్ రెడ్డి, వరలక్ష్మి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) కార్యాలయాలు ప్రజా పోరాట కేంద్రాలు

సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ ఆక్రమించిన పార్టీ కార్యాలయం తిరిగి స్వాధీనం



నవతెలంగాణ-మోతె

సీపీఐ(ఎం) కార్యాలయాలు ప్రజా పోరాట కేంద్రాలని, నిర్బంధాలతో ప్రజల కార్యాలయాలను ఆక్రమించుకోలేరని పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. మోతె మండలం రావిపహాడ్ గ్రామంలో ఏడేండ్ల కింద బీఆర్‌ఎస్ నాయకులు అక్రమంగా ఆక్రమించుకున్న సీపీఐ(ఎం) కార్యాలయాన్ని తిరిగి సోమవారం నాయకులు స్వాధీనం చేసుకుని, ఎర్రరంగు వేశారు. ఈ సందర్భంగా నాగార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. 12 ఏండ్ల కింద రావిపహాడ్ గ్రామంలో ప్రజల సహకారంతో నిర్మించుకున్న తమ పార్టీ కార్యాలయాన్ని ఏడేండ్ల కింద కొంతమంది నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరడంతోపాటు కార్యాలయాన్ని ఆక్రమించుకున్నారని చెప్పారు.

తిరిగి ఏడేండ్ల తర్వాత ప్రజాచైతన్యంతో తమ పార్టీ నాయకులు కార్యాలయంలోకి ప్రవేశించారన్నారు. అనేక పోరాటాలకు, ఉద్యమాలకు పురిటి గడ్డ అయిన రావిపహాడ్ గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ప్రజల సహకారంతో తిరిగి స్వాధీనం చేసుకోవడం అభినందనీయమన్నారు. ప్రజల సహకారంతో నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని అక్రమంగా ఆక్రమించిన విషయమై.. అనేకసార్లు గత అధికార పార్టీ నాయకులకు విన్నవించినా పట్టించు కోలేదన్నారు.

పార్టీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకునేందుకు గతంలో వచ్చిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మితో పాటు అనేక మందిని అక్రమంగా అధికారపార్టీ వారు అరెస్టు చేయించారని విమర్శించారు. ఇప్పుడు తమ కార్యాలయం తమ చేతుల్లోకి వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పార్టీ జిల్లా కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో రావిపహాడ్ గ్రామంలో ఎర్రజెండా ఎగరవేయడం ఖాయమన్నారు.

ఎన్ని నిర్బంధాలు వచ్చినా భయపడకుండా పార్టీ వైపు నిలిచిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జెండాను ఎగరవేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, నాయకులు కందాల శంకర్‌రెడ్డి, దండ వెంకటరెడ్డి, జె.నర్సింహారావు, ములుకూరి గోపాల్‌రెడ్డి, కాంపాటి శ్రీను, గుంటగాని ఏసు, సోమగాని మల్లయ్య, వెలుగుమధు, చేగువేరా, జంపాల స్వరాజ్యం, రేపాల వెంకన్న, ఎర్రబోయిన మల్సూర్, శీలం సతీష్, అర్వపల్లి లింగయ్య, సంగయ్య, రాములు, గోపయ్య, ముత్తయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్

- మన్నెగూడలో స్పీకర్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-పూడూర్

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని మన్నెగూడలో స్పీకర్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పిన మాటలు విని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. తన ప్రాంత ప్రజలు తనను ఆహ్వానించి గొప్పగా సన్మానించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరిగి, తాండూర్ ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి, సొసైటీ చైర్మెన్ పట్లోళ్ల సతీష్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సురేందర్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి సాగునీరు విడుదల చేయాలి

- డి19 కెనాల్ రైతుల ధర్నా



నవ తెలంగాణ- పెబ్బేరు

డి19 కెనాల్ కింద సాగునీటిని విడుదల చేయాలని రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని ఇరిగేషన్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డి19 కెనాల్ కింద 1500 నుంచి 2000 వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారన్నారు. పెంచికలపాడు, మునగమనన్ దిన్నే, జనుంపల్లి, పాత సుగూరు, కొత్త సుగురు గ్రామాల రైతులు సాగు చేశామన్నారు. వారం నుంచి నీళ్ల రాక మిర్చి పంట ఎండిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాగైనా పంటను కాపాడుకోవాలని ఆరు గ్రామాల రైతులు పెబ్బేరు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎస్సీ ఆఫీస్ ముందర ధర్నా నిర్వహించి ఎస్సీని కలిశారు. వారబంది కింద ఫిబ్రవరి 15 తేదీ వరకు సాగినీటిని వదిలి పంటలు కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. వారబంది కింద నీళ్ల వదులుతామని ఎస్సీ హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం రైతులు ఎస్సీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండలం బీఆర్‌ఎస్ నాయకులు పెద్దింటి పద్మ వెంకటేష్, వనం రాములు,పెంచకలపాడు సర్పంచ్ గోవిందు నాయుడు, జనుంపల్లి సర్పంచ్ రాజవర్ధన్ రెడ్డి, తిప్పాయపల్లి సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్/జనగామ

నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం జనగామ కలెక్టరేట్‌లో కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారులతో ఆయా శాఖలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సాగు, తాగునీరు, రోడ్ల మరమ్మత్తులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, జిల్లా ప్రజా పరిషత్, పురపాలక సంఘం, ధాన్యం కొనుగోళ్లు, పరిశ్రమలు, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖలు, పౌర సరఫరాలు తదితర శాఖలపై అధికారులతో సమీక్షించారు. వెంటనే సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. సమస్యలను పరిష్కరించడంలో ఎలాంటి జాప్యం చేయొద్దని అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేగా మొదటి సారి సమీక్షా సమావేశానికి వచ్చిన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి.. కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ పర్మర్ పింకేస్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ కళింగరాజు, పీఏసీఎస్ జనగామ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ అనిల్ కుమా ర్, మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రశాంత్, సీపీఓ ఇస్మాయిల్, డీఎస్ఓ రోజారాణి, టీడబ్ల్యూఓ జయంతి, జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మిడ్ మానేరు బాధితుల సమస్యలు పరిష్కరించండి

- ఎంపీ సంతోశ్‌రావు, మాజీ సీఎం బంధువులపై చర్యలు తీసుకోండి : సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ బండి సంజయ్ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మిడ్‌మానేరు బాధితుల సమస్యలను పరిష్కరించాలనీ, వారికి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కోరారు. అర్హత లేకున్నా ఆ ప్రాజెక్టు కింద పరిహారం పొందిన ఎంపీ సంతోశ్‌రావుతో పాటు మాజీ సీఎం కేసీఆర్ బంధులపైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా పనిచేయాలని సూచించారు. సోమవారం ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. సంబంధిత మంత్రి, స్థానిక శాసనసభ్యుడు, ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి 12 గ్రామాలకు చెందిన 12,500 ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. మిడ్ మానేరు బాధితులకు ఐఏవై ఇండ్లకు బదులుగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మిస్తామనీ, అందులో భాగంగా ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల 4 వేలు చెల్లిస్తానని గత సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి మాటతప్పారని విమర్శించారు. 2015 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ యువకులకు ముంపు పరిహారం, పట్టా ఇస్తానన్న హామీనీ నిలబెట్టుకోలేదని తెలిపారు.

రెండేండ్ల కింద మిడ్‌మానేరు ముంపు బాధితుల పక్షాన కొదురుపాకలో నిర్వహించిన అఖిలపక్ష మహాధర్నాలో తమ పార్టీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని గుర్తుచేశారు. తక్షణమే ఇండ్ల నిర్మాణ పరిహారాన్ని చెల్లించాలని కోరారు. 2015 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ యువకులకు సైతం ప్యాకేజీని వర్తింపజేయాలని విన్నవించారు. ఇచ్చిన హామీ మేరకు నీలోజిపల్లి నుంచి అగ్రహారం వరకు పారిశ్రామిక కారిడార్‌ను, స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీని ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు.


ఆదర్శాలు, లక్ష్యాలు, నియమాలు మరిచినపుడే అపజయం పొందుతాము
- జవహర్ లాల్ నెహ్రూ

సంపాదకీయం

'న్యాయ' విలాపం

"ఏడాదిన్నరగా నడిచే శవంగా బతుకీడుస్తున్నాను. ఇక జీవ రహితమైన ఈ కాయాన్ని ఇక కొనసాగించలేను. నా జీవితాన్ని గౌరవప్రదంగా ముగించుకోవడానికి నాకు అనుమతించండి" అన్న మహిళా న్యాయమూర్తి ఆవేదనా భరిత వ్యాఖ్యలు ఈ దేశ న్యాయవ్యవస్థనే ప్రశ్నిస్తున్నాయి. ఎన్ని చట్టాలున్నా, ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నా మహిళలకు వేధింపులు తప్పడంలేదని తరచూ రుజువవుతూనే వుంది. చివరకు న్యాయస్థానాలు కూడా ఇందుకు మినహాయింపు కాదని మహిళా జడ్జీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖ స్పష్టం చేస్తోంది. జిల్లా జడ్జి, ఆయన అనుచరుల నుంచి ఆమె ఎదుర్కొంటున్న వేధింపులు ఎలాంటివో, అవి ఎంత ఆత్మక్షోభకు గురిచేశాయో లేఖలో ఆమె వాడిన పదజాలమే పట్టిచూపుతోంది.

"సామాన్య ప్రజలకు న్యాయం చేసేందుకు న్యాయవృత్తిలో చేరిన నేను.. ఇప్పుడు అదే న్యాయం కోసం ప్రతి తలుపు తట్టాల్సి వస్తోంది. గత కొన్ని రోజులుగా జిల్లా న్యాయమూర్తి, ఆయన అనుచరులు నాపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. నన్ను పురుగుకంటే హీనంగా చూస్తున్నారు. రాత్రి పూట జిల్లా న్యాయమూర్తిని ఒంటరిగా కలవమంటున్నారు" అని ఒక న్యాయమూర్తే వేదన చెందుతున్న దుస్థితిలో మనం ఉన్నామంటే కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా తీసుకువచ్చిన "నారీశక్తి వందన్" కు అర్థం పరమార్థం ఏమిటో ఏలినవారికే తెలియాలి.



'మీరంతా ఆటబొమ్మగా, ప్రాణరహిత పదార్థంగా మారటం నేర్చుకోండి' అని మహిళలకు హితవు పలికారు. తనను రాత్రిపూట ఒంటరిగా కలవమంటూ వేధిస్తున్నారని మొన్న జూలైలో ఆమె చేసిన ఫిర్యాదుపై హైకోర్టులోని అంతర్గత ఫిర్యాదుల కమిటీ విచారించింది. కానీ కింది ఉద్యోగులు ధైర్యంగా సాక్ష్యం చెప్పాలంటే ఆ జడ్జిని విచారణ సమయంలో బదిలీ చేయాలన్న ఆమె వినతిని పట్టించుకున్నవారు లేరు. దీనిపై సుప్రీంకోర్టులో రిట్ దాఖలు చేస్తే ఈ దశలో జోక్యం చేసుకోలేమంటూ ధర్మాసనం 8సెకన్లలోనే తోసిపుచ్చడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయారు. ఆ పర్యవసానమే ఈ లేఖ.

నిజానికి న్యాయవ్యవస్థలో లైంగిక వేధింపుల ఆరోపణలు రావటం ఇదే తొలిసారి కాదు. సాక్షాత్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు జస్టిస్ రంజన్ గొగోయ్‌పై 2019లో ఒక మహిళా ఉద్యోగి ఫిర్యాదు చేసినప్పుడు ఆమెను బదిలీ చేసి, చివరకు చీటింగ్ కేసు పెట్టి ఉద్యోగంలో నుంచి తొలగించారు. సదరు న్యాయమూర్తిపై ఏ చర్యకూ ఉపక్రమించలేదు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లా అదనపు సెషన్స్‌కోర్టు మహిళా జడ్జి సైతం హైకోర్టు న్యాయమూర్తి నుంచి 'నీ పని తీరు చాలా బాగుంది. నీ అందం మరింత బాగుంది' అనటం, 'ఒంటరిగా ఓసారి నా బంగ్లాకు రా' వంటి వేదింపులను ఎదుర్కొన్నారు. ఆమె గోడు అరణ్యరోదన కావటంతో గత్యంతరం లేక 2014లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. కానీ విషాదమేమంటే ఆ ఫిర్యాదుకు అతీగతీ లేకపోయింది.

పెద్ద చదువులు చదువుకుని, ఉన్నత పదవులు వెలగబెడుతున్న వారిలో కొందరు మహిళలపై, బాలికలపై వేధింపులకు పాల్పడతున్న వారుంటారని ఇలాంటి ఘటనలు చెబుతున్నాయి. ఇలాంటి కేసుల్లో అసహాయ మహిళలకు ఆసరాగా నిలవాల్సిన మహిళా న్యాయమూర్తులకు సైతం వేధింపులుంటే ఇక దిక్కెవరు? కాలం మారింది. యువతులు చదువుల్లో ఎంతో ముందుంటున్నారు. ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తున్నారు. వేరే వృత్తి ఉద్యోగాలను కాదనుకుని న్యాయవ్యవస్థ వైపు వచ్చే వారిలో చాలామంది సమాజానికి ఏదో చేద్దామన్న సంకల్పంతో వస్తారు. అలాంటి వారికి సమస్యలుండటం దురదృష్టకరం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆ మహిళా జడ్జి లేఖపై వెనువెంటనే స్పందించటం, అలహాబాద్ హైకోర్టు నుంచి నివేదిక కోరటం హర్షించదగ్గ అంశం. గతంలో మాదిరి కాక దోషులపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తే తప్ప ఈ దుశ్శాసన పర్వం ఆగదు. మాతృహృదయ నిర్వేదం తీరదు.

తాజాగా విడుదలైన ఎన్‌సీఆర్‌బీ నివేదిక మరోసారి మాతృహృదయ నిర్వేదనను ఆవిష్కరించింది. గతేడాది దేశవ్యాప్తంగా మహిళలపై 4.45 లక్షల నేరాలు చోటు చేసుకున్నాయని, సగటున ప్రతి 51 నిమిషాలకూ ఒక ఎఫ్‌ఐఆర్ నమోదవుతున్నదని ఆ నివేదిక వెల్లడించింది. ఈ నేరాల్లో ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్రలు తొలి రెండు స్థానాల్లో ఉండగా.. పని చేసే చోట మహిళలను వేధించటంలో ఢిల్లీ అగ్రస్థానంలో వుంది. నిజానికి వాస్తవ ఘటనలతో పోలిస్తే కేసుల వరకూ వెళ్లే ఉదంతాలు చాలా తక్కువ. లైంగిక వేధింపుల కేసుల్లో న్యాయమైన తీర్పులు చెప్పి, నేరగాళ్లను కఠినంగా శిక్షించి, బాధితులకు ఉపశమనం కలగజేయాల్సిన చోటే... మహిళా న్యాయమూర్తులకు వేధింపులుంటే ఇంతకన్నా ఘోరమైన స్థితి ఉంటుందా? ఈ దేశంలో మహిళా న్యాయమూర్తులకే భద్రత లేకపోతే ఈ ప్రభుత్వం ఎవరిని కాపాడుతుంది?

> **వేరే వృత్తి ఉద్యోగాలను కాదనుకుని న్యాయవ్యవస్థ వైపు వచ్చే వారిలో చాలామంది సమాజానికి ఏదో చేద్దామన్న సంకల్పంతో వస్తారు. అలాంటి వారికి సమస్యలుండటం దురదృష్టకరం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆ మహిళా జడ్జి లేఖపై వెనువెంటనే స్పందించటం, అలహాబాద్ హైకోర్టు నుంచి నివేదిక కోరటం హర్షించదగ్గ అంశం. గతంలో మాదిరి కాక దోషులపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తే తప్ప ఈదుశ్శాసన పర్వం ఆగదు. మాతృహృదయ నిర్వేదం తీరదు.**

అవాస్తవాల ప్రచారం


ప్రభాత్ పట్నాయక్

నయా ఉదారవాదం ఓ పచ్చి అబద్దాల పుట్టగా తయారైంది. అంతకు మునుపటి పరిస్థితితో-అంటే, ప్రభుత్వ నియంత్రణ కింద మార్కెట్ శక్తులు వ్యవహరించవలసి వచ్చిన కాలంతో-పోల్చితే, నయా ఉదారవాదకాలం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతున్నట్టు చిత్రించడానికే ఈ అబద్దాల ప్రచారం సాగుతోంది. నయా ఉదారవాద కాలంలో జిడిపి వృద్ధిరేటులో ఎంత పెరుగుదల ఉందంటే దాని ఫలితంగా ప్రజానీకం మొత్తంగానే చాలా మెరుగైన పరిస్థితులలో జీవించగలుగుతున్నారు అని నమ్మించడమే ప్రధాన వ్యూహంగా ఈ ప్రచారం ఉంటోంది. అత్యధిక శాతం ప్రజలు పేదరిక స్థాయి నుండి బయటపడిపోయారంటూ ప్రచారం జరుగుతోంది. ఒక వీర ఔత్సాహికుడైతే ప్రస్తుతం మన దేశంలో కేవలం రెండే రెండు శాతం ప్రజలు మాత్రమే ఇంకా పేదరికంలో కొనసాగుతున్నారని ప్రకటించాడు కూడా!

ప్రభుత్వ నియంత్రణ కింద మార్కెట్ శక్తులు వ్యవహరించవలసి వచ్చిన పూర్వ కాలంలో (1990కి మునుపు) మన దేశం ఏమీ సిరి సంపదలతో తులతూగిపోలేదు, నిజానికి అప్పటి విధానాలను విమర్శించడంలో వామపక్షాలే ముందున్నాయి కూడా. కాని, అప్పటికన్నా ఇప్పుడు ప్రజల జీవనప్రమాణాలు బాగా మెరుగుపడినట్టు నయా ఉదారవాదం చెప్పుకోవడం మాత్రం పూర్తిగా అవాస్తవం.

నయా ఉదారవాదం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్న వైనాన్ని (ప్రస్తుత ఫాసిస్టు తరహా ప్రభుత్వ హయాంలో మాత్రమే కాక అంతకు ముందరి ప్రభుత్వాల హయాంలో సైతం) ఇప్పుడు నేను ప్రస్తావించబోవడం లేదు. వ్యక్తి ప్రయోజనాలే కేంద్రంగా, స్వార్థమే పరమావధిగా సమాజం యావత్తూ వ్యాపించిన భావజాలం గురించీ ప్రస్తావించను, సంపదలను మరింత ఎక్కువగా పోగేసుకోవాలనే దురాశతో, పేదలంటే తీవ్ర ద్వేషంతో వ్యవహరించే సంపన్నులను సృష్టించిన వైనాన్నీ నేనిక్కడ లేవనెత్తబోవడంలేదు. మనం జీవిస్తున్న కాలంలో ఎన్నడూ కనీవినీ ఎరుగనంత ఘోరంగా జాతి నిర్మూలన సాగుతూంటే, దానికి వ్యతిరేకంగా ప్రజానీకం తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయబూనినప్పుడు ఆ నిరసన ప్రదర్శనలకు ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే మీడియాలో ఎక్కడా కనీసమైన విమర్శ కూడా కనిపించనంతగా మన దేశ నైతిక ప్రమాణాలు పతనం అయ్యాయన్న సంగతినీ నేను చర్చించబోవడం లేదు. కేవలం ఆర్థిక సూచికలకు మాత్రం పరిమితం అవుతాను.

కొట్టవచ్చినట్టు కనిపించేదీ, విషాదభరితమూ అయిన ఆర్థిక సూచిక రైతుల ఆత్మహత్యలు. మూడు లక్షల మందికి పైగా రైతులు, వ్యవసాయ కూలీలు గత మూడు దశాబ్దాల కాలంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. స్వతంత్రం పొందిన తర్వాత మన దేశంలో ఇంతవరకూ ఇటువంటిది మనం చూడలేదు. ఈ ఆత్మహత్యలకు ప్రత్యక్ష కారణం రైతుల దుర్భర దారిద్ర్యం. ఆ పరిస్థితికి వారిని నెట్టినవి నయా ఉదారవాద విధానాలే. ఆ విధానాల అమలులో భాగంగానే రైతులకు ప్రభుత్వం మద్దతును ఉపసంహరించింది. వాణిజ్య పంటలకు అంతవరకూ ప్రభుత్వం మద్దతు ధర ఇస్తూ వచ్చింది. ఇప్పుడు దానిని రద్దు చేయడంతో ప్రపంచ మార్కెట్‌తో బాటు దేశీయంగానూ వాణిజ్య పంటల ధరలు ఒడిదుడుకులకు లోనయ్యాయి. పలువురు రైతులు దివాలా తీశారు.

1991కి, 2011కి మధ్య వ్యవసాయదారుల సంఖ్య కోటీ ఏభై లక్షల మేరకు తగ్గిపోయింది. కొందరు రైతులు కూలీలయ్యారు. మరికొందరు పట్టణాలకు వలసలు పోయి అక్కడ ఉపాధి వేటలో పడ్డారు. అంతకు పూర్వపు కాలంతో పోల్చితే నయా ఉదారవాద కాలంలో కొత్త ఉద్యోగాల కల్పన వేగం తగ్గిపోయింది. అంతకు పూర్వపు కాలంలో జిడిపి వృద్ధిరేటు చాలా తక్కువగా ఉండేది. మరో పక్కన వలస పాలన పుణ్యమా అని నిరుద్యోగమూ చాలా అధికంగానే ఉండేది. ఆ కాలంలో కొత్త ఉద్యోగాల కల్పన రేటు రెండు శాతంగా ఉండేది. అదే నయా ఉదారవాద కాలంలో (జిడిపి వృద్ధిరేటు బాగా పెరిగినా) కొత్త ఉద్యోగాల కల్పన రేటు ఒక్క శాతానికి పడిపోయింది. సగానికి సగం తగ్గిపోయింది. దాంతో నిరుద్యోగ సైన్యం విపరీతంగా పెరిగిపోతోంది. కనీసం జనాభా ఏ వేగంతో పెరుగుతోందో ఆ మేరకన్నా ఉపాధి కల్పనలో పెరుగుదల లేదు. సిఎంఐఇ అంచనా ప్రకారం గత ఐదేళ్ళ కాలంలో ఉన్న ఉద్యోగాల సంఖ్యలో ఏ పెరుగుదలా లేదు.


జిడిపి వృద్ధి రేటు పెరుగుతున్నా, ఉపాధి కల్పనలో పెరుగుదల లేకపోవడానికి కారణం ఉంది. కార్మికుల ఉత్పాదకత వృద్ధిరేటు వేగం ఈ కాలంలో బాగా పెరగడమే ఆ కారణం. నయా ఉదారవాద విధానాలతోబాటు దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రస్థాయిలో విదేశీ పోటీని ఎదుర్కోవలసి వచ్చింది. ఆ పోటీని తట్టుకునే క్రమంలో కార్మిక వర్గపు ఉత్పాదకత వేగంగా వృద్ధి చెందింది. ఐతే ఆ వృద్ధికి తగ్గట్టు వారి ఆదాయాలు మాత్రం పెరగలేదు. ఒక కనీస స్థాయికి ఆ వేతనాలు కట్టడి చేయబడ్డాయి. దాంతో మిగులులో వారి వాటా తగ్గిపోయింది. ఆ విధంగా నయా ఉదారవాద విధానాల కాలంలో ఆర్థిక అసమానతలు బాగా పెరిగాయి. బడా పెట్టుబడిదారులతో బాటు ఒక చిన్న ఉన్నత మధ్యతరగతి వర్గం కూడా తన ఆదాయాలను బాగా పెంచుకోగలిగింది. వీరంతా ప్రస్తుతం నయా ఉదారవాదానికి గట్టి సమర్ధకులుగా కొనసాగుతున్నారు.

థామస్ పికెటీ, లూకాస్ చాన్సెల్ అనే ఇద్దరు ఫ్రెంచి ఆర్థికవేత్తలు మన దేశంలో ఆదాయాలలోని అసమానతలను అంచనా కట్టారు. ఇందుకోసం వారు మన దేశ ఆదాయ పన్ను గణాంకాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. మొత్తం దేశపు జాతీయాదాయంలో అత్యంత సంపన్నులైన ఒక్క శాతం జనం తాలూకు వాటా ఎంత అన్నది లెక్క గట్టారు. 1982 నాటికి ఆ ఒక్క శాతం సంపన్నుల వాటా 6 శాతానికి తగ్గింది. అంటే ఆదాయాల్లో అసమానతలు తగ్గుతూ వచ్చాయన్న మాట. ఆ తర్వాత, ముఖ్యంగా నయా ఉదారవాద విధానాలు అమలు కావడం మొదలయ్యాక వారి వాటా పెరుగుతూ పోయింది. 2013-14 నాటికి వారి వాటా 22 శాతం అయింది. మన దేశంలో ఆదాయ పన్ను విధించడం మొదలైనది 1922లో. అప్పటి నుండీ చూస్తే ఇంత ఎక్కువ వాటా సంపన్నులకు ఇంతకు మునుపెన్నడూ లేదు. ఇదే మాదిరిగా తక్కిన దేశాల్లోనూ ఆర్థిక అసమానతలు పెరిగాయి. మిగులులో సంపన్నుల వాటా పెరుగుతోంది. అది అధికోత్పత్తి సంక్షోభానికి దారి తీసింది. నయా ఉదారవాద విధానాలు ముందుకు పోడానికి దారి లేని పరిస్థితులు ఏర్పడ్డాయి.

కార్మికుల తలసరి నిజ ఆదాయాలలో పెరుగుదల లేకపోగా, ఉద్యోగులతో పోల్చినప్పుడు నిరుద్యోగుల నిష్పత్తి పెరుగుతూ పోతోంది. పని చేసేవారిలో పూర్తి ఉద్యోగులు, కొద్ది గంటలు లేదా నెలలో కొద్దిరోజులు మాత్రమే పని దొరుకుతున్నవారు, ఉన్న పనులు పోగొట్టుకుంటున్నవారు-ఇలా రకరకాలుగా ఉన్నారు. వీరిలో పూర్తి స్థాయిలో పని లభిస్తున్నవారి సంఖ్య సాపేక్షంగా తగ్గుతోంది గనుక సగటు తలసరి నిజ ఆదాయాలు పడిపోతున్నాయి. వారు తిరిగే రోడ్ల స్థితి మెరుగుపడింది. వీధిలైట్లు బాగా వెలుగుతున్నాయి. కాని వారికి ప్రాథమికంగా అత్యంత అవసరం అయిన ఆహారధాన్యాల లభ్యత మాత్రం తగ్గిపోతోంది. పేదరికం కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది.

1973-74 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని పేదరికాన్ని మన దేశంలో అధ్యయనం చేయడం ప్రారంభమైంది. పూర్తి స్థాయిలో పేదరికం నెలకొంది అని నిర్ధారించడానికి ఆ ప్రజలకు ఎంత శక్తినిచ్చే ఆహార దినుసులు లభిస్తున్నాయి అన్నది కొలబద్దగా ప్లానింగ్ కమిషన్ తీసుకుంది. గ్రామాల్లో తలసరి 2200 కేలరీలు, పట్టణాల్లో 2100 కేలరీలు ప్రమాణంగా తీసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వాలు, ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థలు ఈ ప్రమాణాన్ని నీరుగార్చడానికి చాలా కుట్రలు సాగిస్తూ వచ్చాయి. తద్వారా దేశంలో పేదరికం తగ్గిపోయిందంటూ చిత్రించ ప్రయత్నించాయి. కాని ఇప్పుడు మనం మాత్రం ఈ ప్రాథమికమైన నిర్వచనానికే కట్టుబడదాం.

1973-74లో తలసరి 2200 కేలరీల శక్తినిచ్చే ఆహారం పొందలేకపోయినవారు 56.4 శాతం గ్రామీణ జనాభా. తలసరి 2100 కేలరీల శక్తినిచ్చే ఆహారం పొందలేకపోయిన పట్టణ జనాభా 49,2 శాతం. 1993-94 వచ్చేసరికి అది గ్రామాల్లో 58 శాతానికి (స్వల్ప పెరుగుదల) పట్టణాల్లో 57 శాతానికి (ఇది కాస్త ఎక్కువ పెరుగదల)పెరిగింది. అప్పటికి దేశంలో నయాఉదారవాద విధానాల అమలు మొదలైంది. 2011-12నాటికి చూస్తే గ్రామీణ ప్రాంతాల్లో 68శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 65శాతానికి పెరిగింది.



ఆ తర్వాత 2017-18కి మళ్ళీ గణాంకాలు సేకరించారు. 2011తో పోల్చినప్పుడు ఆ గణాంకాలు ఎంత దారుణ స్థితిని సూచించాయంటే మోడీ ప్రభుత్వం ఆ గణాంకాలను మొత్తంగానే విడుదల చేయకుండా తొక్కిపెట్టింది. ఎంతో కొంతమేరకు ఆ గణాంకాల్లో బైటకు పొక్కినదానిని బట్టి లభించే వివరాలను చూస్తే 2011-12 తో పోల్చితే 2017-18 నాటికి మరో తొమ్మిది శాతం మేరకు ప్రజల వినిమయ శక్తి తరిగిపోయింది. దానిని బట్టి కనీస స్థాయిలో ఆహారధాన్యాలు పొందలేకపోతున్నవారు గ్రామీ ణ ప్రాంతంలో 80 శాతానికి పెరిగారు (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రిసెర్చ్‌కి ఉత్సా పట్నాయక్ తాజాగా సమర్పించిన నివేదిక 'ఎక్స్‌ప్లోరింగ్ ది పావర్టీ క్వశ్చన్' నుండి)!

ప్రపంచ ఆకలి సూచికలో ఉన్న 125 దేశాలకు గాను మన దేశం 111వ స్థానంలో ఉండడం ఆశ్చర్యం కలిగించేదేమీ కాదు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ వంటి పొరుగు దేశాలకన్నా మనం ఆ సూచికలో వెనుకబడ్డాం. దేశం మొత్తం మీద తలసరి ఆహారధాన్యాల లభ్యతకు సంబంధించిన గణాంకాలతో సరిపోల్చినా పై గణాంకాలు సరైనవేనని స్పష్టపడుతుంది. బ్రిటిష్ ఇండియాలో తొలి కాలంలో తలసరి ఆహార ధాన్యాల లభ్యత 200 కిలోలు. అది కాస్తా క్రమంగా తగ్గుతూ స్వతంత్రం వచ్చేనాటికి 138 కిలోలకు దిగజారింది. ఈ దిగజారుడును అరికట్టి మెరుగుదల సాధించడానికి 1980 దశకం దాకా సమయం పట్టింది. అప్పటి నుంచీ తలసరి ఆహార ధాన్యాల లభ్యత దాదాపు గా స్థిరంగా ఒకే స్థాయిలో కొనసాగుతోంది. దేశంలో సంప న్నులు స్వీకరించే ప్రాసెస్డ్ ఫుడ్స్ వాటా పెరుగుతోంది. మరోపక్క కోళ్ళు, పందులు, తదితర పశువులకు మేత రూపంలో ఖర్చు చేసే ఆహారధాన్యాల వాటా కూడా పెరుగుతోంది. దానిని బట్టి తక్కిన జనాభా వాటా తరుగుతోంది అని చెప్పవచ్చు.

అందుచేత ఏ విధంగా చూసుకున్నా పూర్తి స్థాయి పేదరికంలోకి దిగజారిపోతున్నవారి నిష్పత్తి పెరుగుతూనే వుంది. ప్రభుత్వ నియంత్రణలో మార్కెట్ ఉన్న కాలంలో తగ్గుతూ వచ్చిన పేదరికం నయా ఉదారవాద కాలంలో పెరుగుతూ పోతోంది. నయా ఉదారవాదాన్ని సమర్థించే బాకారాయుళ్ళు ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చుతున్నారు. అందుకోసం రకరకాల మోసపూరిత వాదనలను, వక్రీకరణలను ముందుకు తెస్తున్నారు. నయా ఉదారవాద కాలం అంటేనే అందరికీ సిరిసంపదలను అందించే కాలం అంటూ చిత్రిస్తున్నారు.

(స్వేచ్ఛానుసరణ)

> **జిడిపి వృద్ధి రేటు పెరుగుతున్నా, ఉపాధి కల్పనలో పెరుగుదల లేకపోవడానికి కారణం ఉంది. కార్మికుల ఉత్పాదకత వృద్ధిరేటు వేగం ఈ కాలంలో బాగా పెరగడమే ఆ కారణం. నయా ఉదారవాద విధానాలతోబాటు దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర స్థాయిలో విదేశీ పోటీని ఎదుర్కోవలసి వచ్చింది. ఆ పోటీని తట్టుకునే క్రమంలో కార్మిక వర్గపు ఉత్పాదకత వేగంగా వృద్ధి చెందింది. ఐతే ఆ వృద్ధికి తగ్గట్టు వారి ఆదాయాలు మాత్రం పెరగలేదు. ఒక కనీస స్థాయికి ఆ వేతనాలు కట్టడి చేయబడ్డాయి. దాంతో మిగులులో వారి వాటా తగ్గిపోయింది. ఆ విధంగా నయా ఉదారవాద విధానాల కాలంలో ఆర్థిక అసమానతలు బాగా పెరిగాయి. బడా పెట్టుబడిదారులతోబాటు ఒక చిన్న ఉన్నత మధ్యతరగతి వర్గం కూడా తన ఆదాయాలను బాగా పెంచుకోగలిగింది. వీరంతా ప్రస్తుతం నయా ఉదారవాదానికి గట్టి సమర్థకులుగా కొనసాగుతున్నారు.**

> **ప్రపంచ ఆకలి సూచికలో ఉన్న 125 దేశాలకు గాను మన దేశం 111వ స్థానంలో ఉండడం ఆశ్చర్యం కలిగించేదేమీ కాదు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ వంటి పొరుగు దేశాలకన్నా మనం ఆ సూచికలో వెనుకబడ్డాం. దేశం మొత్తం మీద తలసరి ఆహారధాన్యాల లభ్యతకు సంబంధించిన గణాంకాలతో సరిపోల్చినా పై గణాంకాలు సరైనవేనని స్పష్టపడుతుంది. బ్రిటిష్ ఇండియాలో తొలి కాలంలో తలసరి ఆహార ధాన్యాల లభ్యత 200 కిలోలు. అది కాస్తా క్రమంగా తగ్గుతూ స్వతంత్రం వచ్చేనాటికి 138 కిలోలకు దిగజారింది. ఈ దిగజారుడును అరికట్టి మెరుగుదల సాధించడానికి 1980 దశకం దాకా సమయం పట్టింది. అప్పటి నుంచీ తలసరి ఆహార ధాన్యాల లభ్యత దాదాపుగా స్థిరంగా ఒకే స్థాయిలో కొనసాగుతోంది. దేశంలో సంప న్నులు స్వీకరించే ప్రాసెస్డ్ ఫుడ్స్ వాటా పెరుగుతోంది.**



హామీల అమలుకు ఆర్థిక వనరులు ఎలా!?

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు వాగ్దానాలకు ఆర్థిక వనరులు సమీకరణ ఎలా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. పాత పథకాలు అమలు తలనొప్పిగా మారిన క్రమంలో కొత్తగా కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా పలు గ్యారంటీలు అమలు చేయాలంటే అదనంగా నిధులు సమకూర్చుకోవల్సిన అవసరం ఉంటుంది. ఇప్పటికే రూ.5.80లక్షల కోట్ల అప్పులతో తెలంగాణ ఆర్థిక ఇక్కట్లు ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ "ఆరు గ్యారంటీలతో పాటు పలు హామీలు ఇచ్చి అధికారం చేపట్టింది. ఆరు గ్యారంటిలో "మహాలక్ష్మీ" రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు అమలు చేసింది. మరో నాలుగు గ్యారెంటీలతో పాటు, ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి వేల కోట్లు అవసరం అవ్వొచ్చు. ఇన్ని వేల కోట్ల నిధుల సమీకరణ ఎలా సాధ్యం అవుతుంది. ప్రత్యామ్నాయ ఆర్థిక వనరుల సమీకరణ ఎలా అన్న ప్రశ్నలు వెలుగు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా నాలుగు శాఖలు ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రవాణశాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల నుంచి ఆదాయం వస్తుంది. మిగతా శాఖల నుంచి ఆదాయం వచ్చే అవకాశాలు చాలా తక్కువ. హామీలు అమలు చేయాలంటే అప్పులు తప్పవా? అన్న చర్చ సాగుతోంది. టీఎస్ఆర్‌టీసీ ప్రతిరోజు రూ.14 కోట్ల ఆదాయం వస్తుంది. ప్రభుత్వం "మహాలక్ష్మీ" పథకం అమలు చేసి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీకి ఏటా రూ.2500 కోట్ల నుంచి 3వేల కోట్ల నష్టపోవలసి వస్తుంది. ఈ లోటును ప్రభుత్వం భర్తీ చేస్తుందా లేదా అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం మంచిదే. అయినప్పటికి వైద్య పరిమితి రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచారు. గృహలక్ష్మి పథకం కింద 2500, పెన్షన్ రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు వంటి గ్యారంటీల అములుకు అదనపు ఆర్థిక భారం పడుతుంది. లక్ష లోపు రుణమాఫీ పథకం గతంలో రూ.7800 కోట్లు ఖర్చు కాగా కాంగ్రెస్ పార్టీ 2లక్షలు రుణ మాఫి చేస్తామని ప్రకటించడంతో రూ.16 వేల కోట్లు అవసరం అవుతోంది. రైతు బంధు పథకం అమలు చేసి ఎకరానికి రూ.15 వేలు ఇస్తే దాదాపు 22 వేలకోట్లు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. 48 లక్షల పెన్షన్లు చెల్లించాలంటే రూ.22 వేల కోట్లు ఖర్చు అవుతోంది. 97లక్షల గ్యాస్ కనెక్షన్స్‌కు రూ.500 సిలిండర్ ఇవ్వాలంటే రూ.6 వేల కోట్లు, ప్రతి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలంటే 3 వేల కోట్లు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. 18 ఏండ్లపై ఉన్న అమ్మాయిలకు ల్యాప్‌టాప్‌లు రూ.2వేల కోట్లు ప్రతి మహిళలకు రూ.2500 ఇవ్వాలంటే కనీసంగా రూ.20 వేల కోట్ల ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఇంటి స్థలం ఉంటే రూ.5 లక్షలు, ప్రతి ఒక్కరికి రూ.10 లక్షల ఇన్సూరెన్సు అమ్మాయి పెళ్లికి తులం బంగారం, వ్యసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్, రైతులకు రూ.3 లక్షలు వడ్డీలేని రుణాలు, వ్యవసాయ కూలీలకు, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు, అంగన్‌వాడీలకు నెలకు వేతనం రూ.16 వేలకు పెంపు. రేషన్ డీలర్లకు రూ.5 వేలు గౌరవ వేతనంతో పాటు చిన్న చితక పథకాలను అమలు చేయాలంటే కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ గుదిబండగా మారనున్నది. సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణం ప్రభుత్వంకు సవాల్‌గా మారనున్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.2 వేల కోట్ల నుంచి 3 వేల కోట్లు ఉన్నాయి. రైతు బీమా, గొర్రెల పంపిణీ, రేషన్ బియ్యం పంపిణీ వంటి పలు ఉచిత పథకాలు అమలు కావాలంటే భారీగా నిధులు అన్వేషణ చేసుకోవలసిన అవసరం ఉంటుంది. ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడానికి, ఉద్యోగులకు వేతనాలు, పెన్షన్ దారులకు పెన్షన్ చెల్లించాలంటే కనీసంగా రూ.25 వేల కోట్లు అవసరం అవుతుంది. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయడం, ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు చేపట్టాలంటే ఆర్థికంగా ప్రభుత్వానికి భారమే. ఇప్పటివరకు ఉన్న రూ.5 లక్షల 80 వేల కోట్ల అప్పుకు 12 వేల కోట్లు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం వేసే ప్రతి అడుగు ఆర్థిక వనరులతో కూడుకున్నది. వేల కోట్లు రుపాయలు సమీకరించుకొని సర్కారును నడపాలంటే పెద్ద సవాల్. పాత, కొత్త పథకాలు అమలు చేయాలంటే అప్పులు చేయక తప్పే మార్గం కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రజలపై భారాలు తప్పవా? అనే ఆందోళన రాష్ట్రంలో నేడు నెలకొంది. దీనిపై ప్రభుత్వం స్పందించడంతో పాటు ఆర్థిక నిర్వహణపై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలి.

- గుర్రం రామ్మోహన్ రెడ్డి



చలి పులితో పోరాటం

చలిపై గాలి సవారి చేస్తూ
బెబ్బులిలా వేటాడుతోంది
గూడేలు గుడిసెలు గజగజలాడాయి
మేడలు ఫ్లాట్లు వెచ్చటి దుప్పట్లో
పండుగ చేసుకుంటున్నాయి

దోమలు ఫీ రావాలు చేస్తూ
విరామ మెరుగక రక్తం జుర్రేస్తుంటే
కంపెనీలు అలుపెరగని యాడ్సుతో
'మస్కిటో'లతో జేబులు పిండేస్తున్నాయి

వీధుల్లో చెత్తబండ్లే కాస్త చుక్కేసుకని
వీధులన్నిటికీ స్నానాలు చేయిస్తున్నాయి
పాపం చలైనా, ఎండైనా కడుపు గోలకు
జోల పాడాలంటే తప్పని పనులు మరి

స్వెట్టర్లు తొడుక్కుని కూరగాయలు
చలి గాయాలు తప్పించుకుంటూ
లూనా బండ్లెక్కి రండమ్మ రండంటూ
వంట ఇళ్లల్లో ఘుమఘుమలు రేపాయి

చలిపులిని పాల వ్యాన్లు వెంటాడుతూ
ప్యాకెట్లను గురి చూసి బాణాలు చేసి
బడ్డీ కొట్ల లోపలకి విసురుతున్నాయి
బట్టర్లై వ్యాపారులు సేవలందిస్తున్నారు

ఇప్పుడూ వెరపెరుగని కష్టజీవి సాహసమే
జనం బతుకు దినాన్ని దొర్లిస్తోంది, ఔ కదా

- ఉన్నం వెంకటేశ్వర్లు

ఓట్లు కాదు! పోరాటాలే కమ్యూనిస్టుల ఆయువుపట్టు!

అసెంబ్లీ ఎన్నికలలో వినియోగించుకున్న ఓటుకు గుర్తుగా ఎడమ చేతి చూపుడు వేలు మీద వేసిన సిరా చెదిరిపోక ముందే ప్రజా సమస్యలపై గళం విప్పారు కమ్యూనిస్టులు. వారు బలహీనంగా ఉన్నారని భావించే జగిత్యాల జిల్లాలో 300 ఎకరాల ప్రభుత్వ భూమిలో 8 వేల గుడిసెలు వేశారు. గూడు లేని ప్రజలు గెలిచిన ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లలేదు. గట్టి పోటీ ఇచ్చిన ఇతర పార్టీల అభ్యర్థుల వద్దకు వెళ్లలేదు. వారు ఎర్రజెండాను నమ్ముకున్నారు. గోదావరిఖని, ఎన్టీపీసీ, కోరుట్లలో 600 పైగా పక్కా ఇండ్లను ప్రజలు నిర్మించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక భూ పోరాట కేంద్రాలలో పేదల ఇళ్ల నిర్మాణం జరుగుతున్నది. తొమ్మిదిన్నర సంవత్సరాలు కేసీఆర్ అధికారంలో ఉండి కేటాయించిన బహుళ అంతస్తుల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సంఖ్య కంటే ఇవి చాలా ఎక్కువ సంఖ్యలోనే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు గత ఆరు నెలలుగా తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెలు, ఆందోళనలు చేపట్టిన అంగన్వాడీ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులు, ఆరోగ్య శాఖలోని ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు, హమాలీలు, బిల్డింగ్ నిర్మాణ కార్మికులు, ప్రయివేటు ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు వారి యూనియన్ల నాయకత్వంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి చెందిన సంబంధిత శాఖల మంత్రులను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవిస్తున్నారు. పరిష్కరిస్తే సరి, లేదంటే ఉద్యమానికి రెడీ అంటున్నారు.

గత దశాబ్ద కాలంగా ఎన్నికల రాజకీయాలలో కమ్యూనిస్టులు బలహీనపడుతున్నారనే ప్రచారం జరుగుతున్నది. బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో ప్రభుత్వాలను కోల్పోవడం, ఆ తర్వాత జరిగిన వివిధ ఎన్నికలలో కూడా ఓట్లు, సీట్లు తగ్గిపోవడం ఈ అభిప్రాయానికి కారణంగా ఉన్నది. సాంప్రదాయానికి భిన్నంగా కేరళలో వరుసగా రెండవసారి కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చినప్పటికీ, బీహార్, రాజస్థాన్, మహారాష్ట్రలో ఓట్లు, సీట్లలో మెరుగైన ఫలితాలు సాధించినప్పటికీ బూర్జువా, భూస్వామ్య శక్తులు, మీడియా, సోషల్ మీడియా అదే పనిగా కమ్యూనిస్టుల పని అయిపోయిందని ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కూడా వామపక్షాలతో ఎన్నికల పొత్తు విషయంలో అవకాశవాదంగా వ్యవహరించిన బిఆర్ఎస్ ను, ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేసిన కాంగ్రెస్ ను కాకుండా వామపక్షాలపై ముఖ్యంగా సీపీఐ(ఎం)పై విమర్శలు ఎక్కుపెట్టారు.


మొసలి బలం నీటిలోనే. కమ్యూనిస్టుల బలం ప్రజా ఉద్యమాలతోనే. ఆ మాటకొస్తే సమాజ పురోగమ నానికి ప్రధాన కారణం ప్రజా ఉద్యమాలే. సారా వ్యతిరేక ఉద్యమం, కుల నిర్మూలన పోరాటం, బాల్య వివాహాల రద్దు పోరాటం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, వర్లీ ఆదివాసి తిరుగుబాటు, పోడు భూముల పోరాటం, బొగ్గు గని కార్మికుల పోరాటం, ఆర్టీసీ, విద్యుత్తురంగ సంస్కరణల వ్యతిరేక ఉద్యమాలు ఎన్నో జరిగాయి. స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత జరిగిన అనేక ప్రజా పోరాటాల ఫలితంగానే ప్రజలకు ఉపయోగపడే ఎన్నో కొన్ని చట్టాలు, చట్ట సవరణలు, సంస్కరణలు జరిగాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వల్లనే భూ సీలింగ్ చట్టం, రక్షిత కౌలుదారి చట్టాలు వచ్చాయి. ప్రభుత్వం కొంత భూమిని పంచింది. వినోబభావే భూదాన్ సంస్కరణ ఉద్యమం వచ్చింది.



2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ సంస్కరణల వ్యతిరేక పోరాటం ఫలితమే వ్యవసాయానికి ఉచిత విద్యుత్. కుల వివక్ష వ్యతిరేక పోరాట ఫలితం జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల చట్టబద్ధత పోరాట ఫలితమే.

లోక్ సభలో 303 సీట్లతో సంపూర్ణ మెజార్టీ కలిగిన బీజేపీ ప్రభుత్వం తాను తీసుకు వచ్చిన మూడు రైతు చట్టాలను తానే రద్దు చేయడానికి కారణం ఢిల్లీ కేంద్రంగా ఏడాదికి పైగా రైతాంగం నిర్వహించిన ఉద్యమం. ఈ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినవి వామపక్ష రైతు సంఘాలు. ఈ ఉద్యమ స్పూర్తితోనే ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పాండిచ్చేరి, హర్యానా తదితర రాష్ట్రాల్లో వినియోగదారులకు, ఉద్యోగులకు తీవ్ర నష్టదాయకమైన విద్యుత్ సవరణ చట్టాలను వెనక్కి తిప్పిగొట్టగలిగింది. ఆయా రాష్ట్రాల్లో విద్యుత్ ఉద్యోగులు చేసిన సమ్మె పోరాటాల వల్లే ఇవి సాధ్యమయ్యాయి. ప్రజా ఉద్యమాలకు ఉండే శక్తి అటువంటిది. అందుకే కమ్యూనిస్టులు ప్రజా ఉద్యమాలకు ఊపిరిలౌతారు. వాటికే ప్రథమ ప్రాధాన్యతను ఇస్తారు. ప్రజా ఉద్యమాల ఫలితంగానే కమ్యూనిస్టులు చట్టసభలకు ఎన్నికైనారు. కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏర్పాటు చేశారు. వాటిని ఉపయోగించింది ప్రజా సమస్యల పరిష్కారం కోసమే. యూపీఏ-1 కు ఇచ్చిన మద్దతు ఫలితం సమాచార హక్కు చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం తీసుకురాగలగడం.

ఆయా వర్గాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా పట్టి పోరాడుతున్నారు. సాధారణ ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీలకు పెద్దగా ఓట్లు వేయని కార్మికవర్గం పరిశ్రమలలో జరిగే యూనియన్ గుర్తింపు ఎన్నికలలో మాత్రం ఎర్రజెండా యూనియన్లనే ఎక్కువగా ఎన్నుకుంటున్నారు. ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడే హరీశ్‌రావును, హోం మంత్రిగా పనిచేసిన నాయిని నరసింహారెడ్డిని, బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే రఘునందన్‌రావు వంటి అనేకమందిని వివిధ పరిశ్రమల యూనియన్ గుర్తింపు ఎన్నికలలో ఓడించి, సీఐటీయూను గెలిపించారు. సింగరేణి, ఆర్టీసీ వంటి సంస్థలలోనూ ఎక్కువసార్లు గెలిచినవి ఎర్రజెండా యూనియన్లే. పోరాటాలలో ఎర్రజెండా నీడన చేరుతున్న ప్రజలు, పరిశ్రమలలో ఎక్కువ శాతం ఎర్రజెండా యూనియన్లనే గెలిపిస్తున్న కార్మికులు సాధారణ ఎన్నికలలో కమ్యూనిస్టులకు ఓట్లు ఎందుకు వేయడం లేదు? అది కమ్యూనిస్టు శ్రేణులు అర్థం చేసుకోవాల్సిన అంశం. ప్రజల జీవితాలకి సంబంధించిన ప్రతి పార్శ్వాన్ని టచ్ చేసేలా కమ్యూనిస్టుల పని ఉండాలని లెనిన్ చెప్పిన మాటలను గమనంలో ఉంచుకుని కృషి చేయాలి.



- గీట్ల ముకుంద రెడ్డి, 94900 98857

> **లోక్ సభలో 303 సీట్లతో సంపూర్ణ మెజార్టీ కలిగిన బీజేపీ ప్రభుత్వం తాను తీసుకు వచ్చిన మూడు రైతు చట్టాలను తానే రద్దు చేయడానికి కారణం ఢిల్లీ కేంద్రంగా ఏడాదికి పైగా రైతాంగం నిర్వహించిన ఉద్యమం. ఈ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినవి వామపక్ష రైతు సంఘాలు. ఈ ఉద్యమ స్ఫూర్తితోనే ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పాండిచ్చేరి, హర్యానా తదితర రాష్ట్రాల్లో వినియోగదారులకు, ఉద్యోగులకు తీవ్ర నష్టదాయకమైన విద్యుత్ సవరణ చట్టాలను వెనక్కి తిప్పిగొట్టగల్గింది ఆయా రాష్ట్రాల్లో విద్యుత్ ఉద్యోగులు చేసిన సమ్మె పోరాటాల వల్లనే. ప్రజా ఉద్యమాలకు ఉండే శక్తి అటువంటిది. అందుకే కమ్యూనిస్టులు ప్రజా ఉద్యమాలకు ఊపిరిలౌతారు. వాటికే ప్రథమ ప్రాధాన్యతను ఇస్తారు.**

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
మంగళవారం | డిసెంబర్ 19, 2023 | www.navatelangana.com

ప్రయివేట్ పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడిగా పసుపులేటి నాగేశ్వరరావు



నవతెలంగాణ-సత్తుపల్లి

ప్రయివేట్ పాఠశాలల సంఘం సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడిగా స్థానిక విశ్వశాంతి విద్యాలయం కరస్పాండెంట్ పసుపులేటి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మదర్ థెరిసా టెక్నో స్కూలులో సోమవారం సంఘ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వలసాల బాలాజీ (కల్లూరు), కోశాధికారిగా చీకటి శ్రీనివాసరావు (సత్తుపల్లి), ఉపాధ్యక్షుడిగా పలగాని ఈశ్వర్ (పెనుబల్లి), సలహాదారునిగా మందపాటి ప్రభాకరరెడ్డి (సత్తుపల్లి), సహాయ కార్యదర్శిగా చెన్నారావు (కందుకూరు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంతారావు, నాయుడు వెంకటేశ్వరరావు, నాసరయ్య, జిల్లా బాధ్యులు లక్కినేని ప్రసాద్, ఇస్మాయిల్, నాగేందర్‌రెడ్డి, ఒగ్గు భగవాన్‌రెడ్డి, పులి శ్రీనివాసరావు, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య బాధ్యులు పాల్గొన్నారు.

పందికొక్కులకు వేసిన విద్యుత్ వైరు తగిలి మహిళ మృతి

నవతెలంగాణ-కారేపల్లి

పంది కొక్కుల బెడదను నివా రించటానికి వైరు ద్వారా విద్యుత్ ప్రసరణ చేస్తుండగా ప్రమా దావశాత్తు ఆ విద్యుత్ వైరు తాకి మహిళ మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం మాణిక్యారం గుడితండాలో సోమవారం చోటుచేసుకుంది. బానోత్ గంసీ(60)ది వ్యవసాయ కుటుంబం. ఇటీవల వరి కల్లాలు వేసిన వడ్లను ఇంటి వరండాలో బస్తాలలో నింపి ఉంచారు. పందికొక్కులు రాత్రి సమయంలో వడ్లను ధ్వంసం చేస్తుండటంతో కుటుంబ సభ్యులు వాటిని నివారించటానికి బస్తాల చుట్టు విద్యుత్ వైరు ఉంచి దానికి విద్యుత్ ప్రసరణ చేశారు. ఉదయం సమయంలో ఆ వైరు తీయటం చేస్తున్నారు. ఆదివారం రాత్రి కూడా బస్తాల చుట్టు విద్యుత్ ప్రసరణ జరిపిన కుటుంబ సభ్యులు తెల్లవారిన తర్వాత విద్యుత్ ప్రసరణను నిలుపుదల చేయకుండా మరిచిపోయి ఎవరి పనులకు వారు వెళ్ళిపోయారు. ఈక్రమంలో ఇంటిని ఊడ్చే పని చేస్తున్న గంసీ బస్తాల వద్ద చీపురుతూ ఊడుస్తుండగా అడ్డుగా వచ్చిన విద్యుత్ వైరును చేతితో పట్టుకోగా గంసీ విద్యుద్ఘాతంకు గురై పెద్ద కేకవేసి పడిపోయింది. కేక విని ఇంటి ముందుకు వెళ్ళిన కుటుంబ సభ్యులకు విద్యుద్ఘాతంకు గురైన గంసీ కనిపించటంతో వెంటనే విద్యుత్ ప్రసరణను ఆపి చూడగా అప్పటికే గంసీ మృతి చెందింది. మృతురాలికి భర్త పంతుల్యా, ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



బీఆర్ఎస్ నుండి భారీగా కాంగ్రెస్‌లో చేరికలు

- సాదరంగా ఆహ్వానించిన తుంబూరు దయాకర్‌రెడ్డి

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని రాజుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్ఎస్ పార్టీ నుండి సోమవారం ఎస్సీ కాలనీవాసులు, తండావాసులు భారీ ఎత్తున పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో తుంబూరు దయాకర్ రెడ్డి సమక్షంలో చేరారు. మంత్రి క్యాంపు కార్యాలయాల ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ఈ సందర్భంగా బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన వారికి కాంగ్రెస్ కండవాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారి వివరాలు, అబ్బనపురిచారి, సంద్ర వెంకట కుమార్, సబ్బు జానకి రామయ్య, వన్నాపురం వెంకట నరసింహారావు, బానోతు ఉపేందర్ నాయక్, సంద్ర వెంకన్న, చింత గోపి, ఉప్పల ఉదయ్, సంద్ర గోపి, మేళ్లచెరువు సద్గున్, షేక్ పాషా, భూక్య రాజేష్, షేక్ పాషా హుస్సేన్ బి, అబ్బన పూరి సూరి, సిలువేరు సాయి. తదితరులు తుంబూరు దయాకర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్‌రెడ్డి, రేల వెంకటరెడ్డి, కొర్ర రమేష్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజుపేట గ్రామస్తులందరికీ తగిన న్యాయం చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలన్నీ అందరికి అదే విధంగా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ కనెక్షన్లు తదితర పథకాలను కచ్చితంగా అందించి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేలా వెంకటరెడ్డి, కొర్ర రమేష్‌తో పాటుగా, యాస సత్యనారాయణరెడ్డి, షేక్ మేరా సాహెబ్ లాడెన్, బైరిశెట్టి కోటయ్య, కోటా రామ్‌రెడ్డి, కిన్నెర ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం

- పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్‌లో వేంచేసియున్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణాన్ని ఆలయ కమిటీ వారు సోమవారం జరిపించారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రజలంతా అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో సంతోషంగా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దేవుని కోరారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యేను ఆలయ కమిటీ బాధ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మధిర

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రులుగా ప్రమాణ స్వీకారం, మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క 4వ సారి విజయం సాధించడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆదివారం మండల పరిధిలోని నిధానపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా విజయవాడ గుణదల మేరీ మాత ఆలయంలో తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాధా కృష్ణారెడ్డి, పద్మ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండా వీరారెడ్డి, అమరవాది సత్యనారాయణ రెడ్డి, వెంపటి రమేష్ బాబు, కనపర్తి లాజర్, కనపర్తి యర్రయ్య అమరవాది వసంతరెడ్డి, యర్రం శ్రీనివాసరెడ్డి, కనపర్తి పరిశుద్ధం, వెంపటి ప్రభాకర్‌రావు, చల్లా సిద్దారెడ్డి, అమరవాది కృష్ణారెడ్డి, మేసిపోగు ఇర్మియా, దాసరి ప్రకాష్‌రావు, బొమ్మిరెడ్డి రామకృష్ణారెడ్డి, అలవాల సోమిరాజు, కనపర్తి షడ్రక్, కనపర్తి పుల్లయ్య, వెంపటి శ్రీను, కనపర్తి శ్రీనివాసరావు, కనపర్తి శ్రీకాంత్, కనపర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కరాటే ఛాంపియన్ హర్షిత్‌ను అభినందించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లికి చెందిన టాలెంట్ స్కూలు 4వ తరగతి విద్యార్థి హర్షిత్ 14వ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్-2023 పోటీల్లో ప్రథమస్థానం సాధించాడు. నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ సాధించిన హర్షిత్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సోమవారం వారి క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఇలాంటి విజయాలను మరెన్నో హర్షిత్ సాధించి సత్తుపల్లికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూలు కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, స్కూలు ఇన్‌ఛార్జి రమణ శంకర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రీవేన్స్

- పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్

నవతెలంగాణ-ఖమ్మం



ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రీవేన్స్ అని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ అన్నారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గ్రీవేన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులో వృద్ధాప్యంలో వారసులు పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలు ఫిర్యాదు వచ్చాయి. అదేవిధంగా భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు, భార్యభర్తల సమస్యలపై వచ్చిన బాధితుల ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌లో అధికారులను ఆదేశించారు.

మంత్రి పొంగులేటికి అభినందనల వెల్లువ



- ఉమ్మడి జిల్లా నుంచి తరలొచ్చిన ప్రజానీకం
- జనసందోహంతో కిక్కిరిసిన మంత్రి క్యాంపు కార్యాలయం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలోని ఆయన గుమ్మంలో తొలిసారిగా అడుగుపెట్టిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఉమ్మడి జిల్లా ప్రజానీకం ఘనస్వాగతం పలికింది. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లాకు విచ్చేసిన శీనన్నకు శాలువాలు, బొకేలతో సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. పూల మొక్కలను ప్రేమతో అందించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఉన్నతస్థాయి వర్గానికి చెందిన వారు మొదలు సామాన్య ప్రజానీకం వరకు ప్రతి ఒక్కరూ శీనన్నను కలిశారు. ప్రతీ ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారు చేసిన చిరు సత్కారాలను స్వీకరించారు. ఉమ్మడి జిల్లా ప్రజల ఆదరాభిమానాలే తనకు ఉన్నత పదవి వరించేలా చేసిందని ఈ సందర్భంగా పొంగులేటి పేర్కొన్నారు. ఉదయం 06.30గంటల నుంచి మొదలైన తాకిడి మధ్యాహ్నం మూడు గంటల వరకు కూడా కొనసాగింది. శీనన్నను కలిసేందుకు వచ్చిన వాహనాలు క్యాంపు కార్యాలయం బయట బారులు తీరాయి.

మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీవో నేతలు

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొలిసారిగా ఖమ్మం ఐడిఓసికి జిల్లా అధికారుల సమీక్ష సమావేశం కోసం వచ్చిన సందర్భంగా టీఎన్జీవో నేతలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అఫ్జల్ హసన్, ఆర్‌వీఎస్. సాగర్‌ల పిలుపు మేరకు టీఎన్జీవో యూనియన్ బాధ్యులు, ఉద్యోగులతో కలిసి అఫ్జల్ హసన్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహపూర్వక సంబంధంను కొనసాగిస్తోందన్నారు. ఉద్యోగుల పక్షాన వెన్నంటి ఉంటోందని స్పష్టం చేశారు. ప్రజారంజక పాలనను అందించడంలో ఉద్యోగులు తమ భాగస్వామ్యాన్ని కలిగి ఉండాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను, రాష్ట్ర కార్యదర్శి జీఎస్. ప్రసాద్‌రావు, టౌన్ అధ్యక్షులు నాగుల్ మీరా, కార్యదర్శి కట్టా నవీన్, రూరల్, వైరా, కల్లూరు యూనిట్‌ల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, శివ స్వప్న, సవర్జన్‌పాల్, ప్రసాద్, రాజేష్, నరేష్ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, వై.శ్రీనివాసరావు, పాషా, మహిళవిభాగం జిల్లా అధ్యక్షురాలు శాబాసు జ్యోతి, కార్యదర్శి ఏ. స్వప్న, ఉపాధ్యక్షురాలు ఎ. జ్యోతి, శాంతకుమారి, స్వర్ణ లతా, మెడికల్ ఫోరమ్ అధ్యక్షులు బుద్దా రామకృష్ణ, వలి, డీఈఓ ఫోరమ్ అధ్యక్షులు యూసఫ్ అహ్మద్, చావ శ్రీనివాసరావు, హాస్పిటల్ ఫోరమ్ హబీబ్, లింగరాజు ల్యాండ్ రికార్డు ఫోరమ్ మురళి, ఉపేందర్, ఇరిగేషన్ మయింటెనెన్స్ ఫోరం అధ్యక్షులు వెంకటి, కార్యదర్శి రమణారెడ్డి, వెటర్నరీ సత్యనారాయణ, ఆడిట్ జ్వలనర్సింహారావు, అన్ని ఫోరమ్‌ల బాధ్యులు, టౌన్ బాధ్యులు, దేవేందర్, రామారావు, రచన, శ్రీదేవి, జిలాని, వెంకటేశ్వర్లు, నంద కిశోర్, రెహ్మాన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





కారేపల్లి

మంత్రి పొంగులేటిని కలిసిన మండల నాయకులు

కారేపల్లి : రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కారేపల్లి మండల నాయకులు సోమవారం కలిశారు. ఖమ్మంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో భాగ్యనగర్‌తండా ఎంపీటీసీ ఆలోత్ ఈశ్వరీనందరాజ్ దంపతులు, మాధారం సర్పంచ్ అజ్మీర నరేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి పొంగులేటిని కలిసి పూలబొకెలతో అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీల అమలు చేయటంపైనే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆదిశగా ఇప్పటికే చర్యలు తీసుకుంటుందని వారు తెలిపారు. బీఆర్ఎస్ నియంతృత్వ పాలనలో పేదలకు ప్రభుత్వ పథకాలు దక్కలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను అక్కున చేర్చుకిని పథకాలను అమలు చేయనుందన్నారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీపీ బానోత్ పద్మావతి, అజ్మీర శివనాయక్, వడ్డె వెంకటేశ్వర్లు, కుర్ర శ్రీను, శ్యామ్‌లాల్, బానోత్ రాందాస్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

కమ్యూనిస్టులకు గెలుపు ఓటములు ముఖ్యం కాదు

- ప్రజా సమస్యలే ముఖ్యం
- భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-కొణిజర్ల



అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) ఓడిపోయిందని, కమ్యూనిస్టులకు గెలుపోవటములు ముఖ్యం కాదు... ప్రజా సమస్యలు కోసం నిత్యం పోరాటాలు చేయడమే కమ్యూనిస్టుల లక్షణమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం అన్నారు. సోమవారం సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం బాలాజీ అధ్యక్షతన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్య వీరభద్రం మాట్లాడారు. అలాగే ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిందని, వాటిని పగడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రజలు ఈ పది సంవత్సరాల కాలంలో విసిగి ప్రభుత్వం మీద వ్యతిరేకతతో కాంగ్రెస్ గెలిపించాలని, దాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీ లతోపాటు కార్మికుల సమస్యలను నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే కమ్యూనిస్టులుగా మేము ప్రజల తరపున ప్రజా సమస్యల కోసం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఆరోగ్య శ్రీ పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో దళిత బంధు పేరుతో బీసీ బందు పేరుతో ప్రజలను మోసం చేసి తమ పార్టీ జెండా మోసిన వారికి దళిత బందును, బీసీ బందును కట్టబెట్టిందని, అది పునరావృతం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన దళితులందరికీ దళిత బంధం ఇవ్వాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని నిరుపేదలైన కూలీలకు కూలి బంద్ ఇవ్వాలని కూలీలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొంతెబొయిన నాగేశ్వరరావు, ఏర్పుల రాములు, నండూరి శ్రీనివాసరావు, తమ్మినేని వెంకటయ్య, వేణు, నామ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నామినేటెడ్ పదవి పుచ్చకాయల వీరభద్రంకు దక్కేనా...?

- 10సంవత్సరాలు పార్టీకి విశేష కృషి
- భట్టి అనుచరుడిగా ప్రత్యేక గుర్తింపు
- పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు బీసీ వర్గాల సమన్వయం

నవతెలంగాణ-కామేపల్లి



మండల పరిధిలోని తాళ్ళగూడెం గ్రామానికి చెందిన పుచ్చకాయల వీరభద్రంకు ప్రభుత్వ నామినేటెడ్ పదవి దక్కుతుందా లేదా అనే సందిగ్ధంలో జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ సెల్ పుచ్చకాయల వీరభద్రం యాదవ్ గత నెల 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలలో వీరభద్ర యాదవ్ అభ్యర్థుల విజయానికి విశేష సేవలందించి ఆదర్శంగా నిలిచారు. వీరభద్రం యాదవ్ గడిచిన 30 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు పొంది పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. కామేపల్లి సొసైటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్‌గా గెలుపొందారు. వీరభద్రంను బీఆర్ఎస్‌లో చేరమని, చేరితే సొసైటీ చైర్మెన్ పదవి ఇస్తామని గత ఎమ్మెల్యే అడిగితే సున్నితంగా తిరస్కరించారు. 10సంవత్సరాలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ప్రస్తుత డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అత్యంత సన్నిహితుడుగా ఉండి పార్టీలో కీలక పాత్ర పోషిస్తూ జిల్లాలో అందరివాడిగా పేరు తెచ్చుకున్న వీరభద్రం యాదవ్‌కు ప్రభుత్వ నామినేటెడ్ పోస్టును కేటాయించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, అభిమానులు, సానుభూతిపరులు కోరుతున్నారు. పార్టీని అధికారంలోకి తెచ్చుకోవడం కోసం, ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 10 అసెంబ్లీ స్థానాలలో యాదవ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు పార్టీ విజయానికి చేయూతనివ్వాలని కోరుతూ ఊరూరా విస్తృత ప్రచారాన్ని సైతం నిర్వహించి అభ్యర్థుల విజయానికి వీరభద్ర యాదవ్ కృషి అభినందనీయమని పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు అనడం విశేషం. కాంగ్రెస్ పార్టీ వీరభద్రం యాదవ్‌కు ప్రభుత్వం నామినేటెడ్ పోస్ట్ కేటాయించాలని జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, నాయకులు కోరుతున్నారు.

మట్ట రాగమయికి ఘనంగా సన్మానం

- కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటా : ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు



సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మండల నాయకులు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే గెలుపొందిన తర్వాత తొలిసారి తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన పంట పొలాలను పరిశీలించేందుకు వచ్చారు. అప్పుడు రైతులు బాధల్లో ఉన్నారు. సన్మానాలు ఆడంబరాలుకు దూరంగా ఉండాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలు సూచించారు. దీంతో రెండోసారి కల్లూరు వచ్చిన సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయంలో శాలవ కప్పి ఘనంగా సత్కరించారు. సందర్భంగా కార్యకర్తలకు నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉంటానని ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పసుమర్తి చంద్రరావు, భాగం ప్రభాకర్, ఏనుగు సత్యంబాబు, కే వెంకటేశ్వరరావు, మాదాల గోపాల్ రావు, గుండమనేని పుష్పావతి (అలియాస్ బోడెమ్మ) ఎంపీటీసీ లక్కిరెడ్డి గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోచవరంగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో చెన్నూరు గ్రామంలో కార్యకర్తలు నాయకులు ఎమ్మెల్యే రాగమయిని ఆపి కే.వెంకటేశ్వర గృహంలో ఘనంగా సత్కరించి చీరను బహుకరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర దంపతులు, నల్లజాల మంగపతి, తదితర నాయకులు పాల్గొన్నారు.



ప్రీ రీజినల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 'హార్వెస్ట్' విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఖమ్మం

2023-24 విద్యాసంవత్సరానికిగానూ మ్యాథ్స్ టీచర్స్ అసోసియేషన్ వారు దేశవ్యాప్తంగా నిర్వహించే మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో తమ విద్యార్థులు, విశేష ప్రతిభ కనబరచి ప్రశంసాపత్రాలు సాధించినట్లు 'హార్వెస్ట్' గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతీరెడ్డి తెలిపారు. ఈఏడాది సెప్టెంబరు 23న దేశవ్యాప్తంగా నిర్వహించిన 'ప్రీరీజినల్ మ్యాథ్స్ ఒలింపియాడ్' పరీక్షలో తమ విద్యార్థులు పరీక్ష వ్రాయగా, ప్రకటించిన ఫలితాల్లో తమ విద్యార్థులు టి. రేవంత్ కుమార్, కె. ఫణీష్క్ చౌదరి, సిహెచ్. క్రిష్ణ మాధుర్, ఎం.శ్రీకర్‌రెడ్డిలు ఉత్తమ శ్రేణి సాధించి ప్రశంసాపత్రాలు సాధించారన్నారని, తదుపరి నిర్వహించబోయే రీజినల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షకు ఇద్దరు విద్యార్థులు టి. రేవంత్ కుమార్, కె.ఫణీష్క్ చౌదరిలు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో ఐఐటి బ్రాంచ్ ఇంచార్జ్ జి. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వికలాంగుల దినోత్సవం

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ స్త్రీశక్తి భవనంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎస్సై గజ్జెల నరేష్ పాల్గొని మాట్లాడారు. వికలాంగులు కల్మషం లేకుండా ఐక్యమత్యంతో ఉండాలన్నారు. వికలాంగులకు తమ వంతుగా చేయూతనందిస్తానన్నారు. వికలాంగుల సమస్యలు పరిష్కారానికి, హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం గంగుల చిన్నవెంకటేశ్వర్లు, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు పాలకిటి సీతారాములు, జిల్లా అధ్యక్షులు బొజ్జ జీవరత్నం, మండల అధ్యక్షులు ఇనప ఉపేందర్, వికలాంగుల మహిళా జిల్లా అధ్యక్షురాలు అధ్యక్షురాలు సుకన్య, నాయకులు గుంజులూరి రాంబాబు, ఎక్కిరాల సుజాత, మోరం నాగేశ్వరరావు, భారతి, మాతంగి వీరబాబు, ఇరుకు భూలక్ష్మి, వేముల ఉపేందర్, కుంచం ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

సైకిలు తొక్కుతూ దేశమంతా తిరుగుతా

- ఇప్పటికి 240 రోజులు 9వేల కిలోమీటర్లు

- సత్తుపల్లికి సైకిలు యాత్రికుడు శివంవర్మ

నవతెలంగాణ-సత్తుపల్లి



సైకిలు తొక్కుకుంటూ దేశమంతా పర్యటించేందుకు బయలుదేరానని ఉత్తరప్రదేశ్‌కు చెందిన మధుర నివాసి శివం వర్మ తెలిపారు. 240 రోజుల క్రితం శివం వర్మ మధుర నుంచి ప్రారంభించిన సైకిలుయాత్ర జమ్మూ అండ్ కశ్మీర్ వరకు, అక్కడి నుంచి పలు రాష్ట్రాల మీదుగా ప్రయాణం చేస్తూ సోమవారం సత్తుపల్లికి చేరింది. ఇక్కడికి వచ్చిన శివం వర్మ విలేకర్లకు తారస పడగా యాత్రా విశేషాలను వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ నా యూట్యూబ్ ఛానల్ ఎస్‌వీ ద్వారా ఆయా ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను వివరించుకుంటూ వస్తున్నానన్నారు. ఈ యాత్ర ద్వారా ప్రజలకు కొన్ని సందేశాలను చెప్పాలనుకుంటున్నానని వర్మ తెలిపారు. యువత డ్రగ్స్‌కు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారన్నారు. ఇది దేశ భవిష్యత్తుకు చాలా ప్రమాకరమన్నారు. మత్తు పదార్థాలు మాత్రమే దేశ భవిష్యత్తును నాశనం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ విషయాన్ని కూడా నా ఛానల్ ద్వారా యువతకు తెలియజేస్తున్నానన్నారు. దేశంలోని యువత తమ బాధ్యతను అర్థం చేసుకొని డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని శివం వర్మ కోరారు. ఇదేగాక దేశంలోని మహిళలు అభద్రత భావంతో ఉన్నారన్నారు. మహిళలు, వారి ఆడపిల్లలు బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోందన్నారు. పురుషుల్లో చాలా వరకు మహిళలను తప్పుడు కోణంలో చూడటం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని శివం వర్మ కోరుతున్నారు.

యథావిధిగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించాలి

- మండల సర్వసభ్య సమావేశం ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-తల్లాడ

అభివృద్ధి కార్యక్రమాలను యథావిధిగా కొనసాగించాలని తల్లాడ మండల సర్వసభ్య సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం సోమవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్, తల్లాడ ఇంచార్జ్ ఎంపిడిఓ మయాంక సింగ్ పర్యవేక్షించి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో తల్లాడ మేజర్ సర్పంచ్ పొట్టేటి సంధ్యారాణి, ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి, మండల విద్యాశాఖ అధికారి దామోదర్ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ తాజుద్దీన్, డాక్టర్ రత్న మనోహర్, ఎంపీటీసీ సభ్యులు దగ్గుల రఘుపతిరెడ్డి, కొమ్మినేని ప్రభాకర్, రుద్రాక్ష బ్రహ్మం, లక్ష్మీపురం సర్పంచ్ ఓబుల సీతారామరెడ్డి, అంబేద్కర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పిట్ల గోపికి అభినందనలు

నవతెలంగాణ-మధిర



మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామానికి చెందిన పిట్ల గోపి ఆదివారం పాల్వంచలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచి అండర్-17 రాష్ట్ర స్థాయి జట్టుకి ఎంపిక అవటమే కాకుండా ఖమ్మం జిల్లా కబడ్డీ జట్టుకి కెప్టెన్‌గా ఎంపిక అయిన సందర్భంగా సోమవారం 7వార్డ్ కౌన్సిలర్ కళ్యాణి కిరణ్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడారు. గోపి మంచి అవార్డులు రివార్డులు గెలుచుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

నవతెలంగాణ
నలుగురి గొంతుక ప్రజల పత్రిక
ఖమ్మం
6
మంగళవారం | డిసెంబర్ 19, 2023 | www.navatelangana.com

ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా మంత్రి పొంగులేటి

- డిప్యూటీ సీఎం మల్లుకు జంటనగరాలు
- మంత్రి తుమ్మలకు మల్కాజిగిరి బాధ్యతలు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జిగా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నుంచి సోమవారం ఓ ప్రకటన వెలువడింది. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి సహా పలువురు మంత్రులకు బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో ఖమ్మం, మహబూబాబాద్ స్థానాలు పొంగులేటికి అప్పగించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు హైదరాబాదు, సికింద్రాబాద్ స్థానాలు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మల్కాజిగిరి పార్లమెంట్ బాధ్యతలను అప్పగిస్తూ టీపీసీసీ ఆదేశాలు జారీ చేసింది.

ప్రజాసేవ చేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చాం

- చర్చి ప్రారంభ కార్యక్రమంలో మట్టా రాగమయి
- చర్చి అభివృద్ధి కోసం లక్ష రూపాయలు విరాళం
- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

నవతెలంగాణ-కల్లూరు

తాము చేస్తున్న ప్రజాసేవ విస్తరింపజేసి అందరికీ సేవ అందించాలని లక్ష్యంతోనే రాజకీయాల్లోకి రావడం జరిగిందని సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి అన్నారు. మండల పరిధిలోని పోచవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చిని సోమవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాగమయి మాట్లాడుతూ 2006లో తమ కుమార్తె ఆశ మృతి చెందడంతో ఆ పేరు మీద ఆశా స్వచ్ఛంద సంస్థ ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా 30 సంవత్సరాల పాటు సత్తుపల్లి ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు చేశామన్నారు. కరోనా సమయంలో పేదలకు అండగా నిలబడ్డామని తెలిపారు. తాము చేస్తున్న సేవలను విస్తరింప చేసి ప్రజలందరికీ అందించాలని లక్ష్యంతోనే రాజకీయాల్లోకి రావడం జరిగింది అన్నారు. తాము ఎంతో భయంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశామని ఇటు ప్రజలు అటు దైవం ఒక పూర్తి సహకారం అందించడంతోనే ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగింది అన్నారు. మీరిచ్చిన ఈ అవకాశాన్ని ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉండి మీకు సేవ చేసే భాగ్యం కలిగిందని ఏ సమయంలోనైనా తనను కలిసి మీ సమస్యలు చెప్పిన పరిష్కరించడానికి నా వంతు కృషి చేస్తానన్నారు. చర్చి అభివృద్ధి కోసం తన వంతు సహాయంగా లక్ష రూపాయలు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా క్రిస్టమస్ పండగను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. చర్చి ఫాదర్ లు యాకోబు, జోజయ్య, తమ దీవెనలు అందించారు. ఈ సందర్భంగా



నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. తొలిత పోచారంలో ఎమ్మెల్యేకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పసుమర్తి చంద్రావు, భాగం ప్రభాకర్, ఏనుగు సత్యంబాబు, కె. వెంకటేశ్వరరావు, నగేష్, బత్తుల భరత్, తెలుగుదేశం నాయకులు తాళ్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్

నవతెలంగాణ-రఘునాథ పాలెం

అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అన్నారు. ఖమ్మం నగరంలోని సుందరయ్య భవనంలో రఘునాథపాలెం మండల కమిటీ సమావేశం మండల నాయకుడు రహీం ఖాన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ అకాల వర్షానికి వరి, మిరప, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. మండలంలో 1600 ఎకరాల్లో వరి, 1400 ఎకరాల్లో మిర్చి, 50 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు సర్వే ద్వారా తేల్చారని వీరికి నష్టపరిహారం వెంటనే అందజేయాలన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల బాధలను అర్థం చేసుకొని వెంటనే నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా విచారణ చేసి అర్హులైన పేదలకు ఆరు గ్యారంటీలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రమ్, మండల కార్యదర్శి నవీన్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, కన్నెగంటి తిరపయ్య, వల్లూరి శీను, గుగులోత్ కుమార్, బాణోత్ నాగేశ్వరరావు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు హిమమ్, హరి తదితరులు



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు రాజా మృతి

- నివాళులర్పించిన జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండలంలోని యం.వెంకటయాపాలెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు గడదాసు రాజా(80) గత కొంతకాలం అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. రాజా మృతదేహాన్ని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ సందర్శించి రాజా మృతదేహంపై ఎర్రజెండా కప్పి నివాలర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాజా కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. మృతునికి భార్య సత్యమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రాజా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో పార్టీ రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, శాఖ కార్యదర్శి ఏపూరి వరకుమార్, మాజీ సర్పంచ్ నాగండ్ల అచ్యుత్‌రావు, నాయకులు చావా నాగేశ్వరరావు, వేగినాటి వెంకటనారాయణ, వడ్లపూడి మల్లయ్య, నాగేశ్వరరావు, మునిగంటి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ఏపూరి నాగేశ్వరరావు, తుపాకుల వెంకన్న, వెంకన్న, లక్ష్మి, వీరస్వామి, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'బాలభారతి'లో సెమీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-తల్లాడ

స్థానిక బాల భారతీయ విద్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. లూధు మాత చర్చ్ సహాయక గురువు ఫాదర్ ముగిరాల ఫ్రాన్సిస్ సందర్భంగా మాట్లాడుతూ క్రిస్మస్ అంటే చీకటిలో నుంచి విజ్ఞానం అనే వెలుగులోకి రావడం అన్నారు. పెద్దలను ఉపాధ్యాయులను గౌరవించడం పిల్లల బాధ్యత అన్నారు. క్రమశిక్షణతో ప్రణాళికతో చదువుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రీస్తు జననంపై అవగాహన కల్పించారు. పశువుల పాక శాంటా క్లాస్, బహుమతులు, విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కెఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ తాళ్లూరు రామారావు, వి. నాగరాజు, తల్లిదండ్రులు విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

తెలంగాణలో కార్ ఇన్ ఆటో మార్ట్‌కు అరుదైన పురస్కారం

- తెలంగాణ బిజినెస్ అవార్డు 2023 సాధించిన కార్ ఇన్ ఆటోమార్ట్
- ఖమ్మానికి అవార్డు పట్ల పలువరి హర్షం
- ప్రముఖ పారిశ్రామిక వేత్త అమీన్, ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్
- కొమ్ముల రాకేష్ పలు వ్యాపారవేత్తల శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఖమ్మం



ఏషియన్ అరబ్‌ట్రేడ్ ఛాంబర్ అఫ్ కామర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా మోస్ట్ ప్రామిసింగ్ యాక్సెసరీస్ స్టోర్ 2023 అవార్డు ఖమ్మం నగరంలోని ప్రముఖకార్ యాక్సెసరీస్ షోరూం కార్ ఇన్ ఆటోమార్ట్ కైవసం చేసుకుంది. నిర్వాహకులు ఏషియన్ అరబ్ ట్రేడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మెన్ అబ్ద్ అల్ ముఖద్దిస్ చేతుల మీదుగా కార్ ఇన్ ఆటోమార్ట్ అధినేత అబ్దుల్ అజీమ్ ఈ అవార్డు ను ఇటీవల హైదరాబాద్లో అందుకున్నారు. ఈ సందర్భంగా కార్ ఇన్ ఆటో మార్ట్ సంస్థల అధినేత ఛైర్మెన్ మహమ్మద్ అబ్దుల్ అజీమ్ (ఎన్ఆర్ఐ, పారిశ్రామికవేత్త) మాట్లాడుతూ దశాబ్దకాలానికి పైగా ఖమ్మం నగరంతో పాటుగా హైదరాబాద్‌లో కూడా తమ సేవలు అందిస్తూ, వినియోగదారుల మన్ననలు పొందుతున్న క్రమంలో ఈ అవార్డు రావడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఈ అవార్డు లభించడం పట్ల తన బాధ్యత మరింత పెరిగిందని, కస్టమర్లకు మెరుగైన సేవలు అందించే దిశగా తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ తరఫున అబ్దుల్ అజీమ్, నసీం, జహీర్, అజహర్, నాసర్, తదితరులు పాల్గొన్నారు. ఖమ్మానికి చెందిన సంస్థ ఒక రాష్ట్రస్థాయి అవార్డు సాధించడం ఎంతో సంతోషం అని, ప్రస్తుతం ఖమ్మం నగరం కూడా వ్యాపారం రంగంలో హైదరాబాద్, విజయవాడ నగరాలకు దీటుగా సేవలు అందిస్తుందని చెప్పటానికే ఇదొక నిదర్శనం అని ప్రముఖ పారిశ్రామిక వేత్త అమీన్, ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ ఛైర్మెన్ కొమ్ముల రాకేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంలో నగరానికి చెందిన నగర ప్రముఖులు, వైద్యులు, వివిధ వ్యాపారాలకు చెందిన వారు వసీం అబ్దుల్ వాహెద్, ఖయ్యుమ్, అఫ్రోజ్, మున్వర్, అష్రఫ్, బోడేపూరి రాజా, మోతుకూరి శ్రీనివాస్, అబ్దుల్ రాఫాయ్, డాక్టర్ సుదర్శన్ రావు, పారుపల్లి నాగేశ్వర్ రావు, టియుడబ్ల్యూ జేటీజే ఎఫ్ ఎలక్ట్రానిక్ మీడియా ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జర్నలిస్ట్ జానిపాషా, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

అర్జీదారుల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతనివ్వాలి

- జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం



అర్జీదారుల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో "గ్రీవెన్స్ డే"లో అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించి తగు చర్యలకై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సింగరేణి మండలం కొమ్ముగూడెంకు చెందిన ఎట్టి వీరన్న తాను కొమ్ముగూడెం ఎంపిపి స్కూల్‌లో మనఊరు-మనబడి క్రింద పనులు పూర్తి చేయడం జరిగిందని, ఇందుకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ఎంఎంబి కో ఆర్డినేటర్‌ను ఆదేశించారు. ఖమ్మం నగరం 29వ డివిజన్‌కు చెందిన నివాసులు తమ ప్రాంతంలో ఎఫ్‌సిఐ గోడౌన్ వద్ద గోళ్ళపాడు చానల్ కాలువ నిర్మించిన ప్రదేశం వద్ద మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిపై కవర్లు వేయించి గుంతలు పూడ్చించగలరని సమర్పించిన దరఖాస్తును, 34వ డివిజన్‌కు బాపూజీ పార్కు సమీపంలో గల వి.దేవెందర్ తాము నివాస సమీపంలో బొమ్మల తయారీలో వాడుతున్న రంగులు, రసాయనాలు, వెల్డింగ్‌ల వల్లన గాలి కాలుష్యంతో శ్వాసకోశ వ్యాధులకు గురికావడం జరుగుతుందని, అ బొమ్మల తయారీని నిలుపుదల చేయించగలరని సమర్పించిన దరఖాస్తులను తగు చర్య నిమిత్తం నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడు గ్రామంకు చెందిన డి.రమాదేవి తన భర్త దొంతగాని కృష్ణయ్య కరోనాతో అక్టోబరు 2021లో చనిపోయినారని, ప్రభుత్వం నుండి అందే ఆర్థిక సహాయం ఇప్పించగలరని సమర్పించిన తగు చర్య నిమిత్తం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి సూచించారు. ముదిగొండ మండలం మాధాపురం గ్రామంకు చెందిన పడిశాల విజయ తాను 2019 సంవత్సరంలో ట్యాక్సీ కారుకొనుగోలు చేయడం జరిగిందని, తనకు పరిశ్రమల శాఖ నుండి రాయితీ మంజూరు కావడం జరిగినదని, కాని ఇంతవరకు తన ఖాతాలో జమకాలేదని అ రాయితీసొమ్మును ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం పరిశ్రమల శాఖ అధికారికి సూచించారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంకు చెందిన జి.నాగేశ్వరరావు తనకు 2020-21 సంవత్సరంలో ఎస్సీ కార్పోరేషన్ ద్వారా లోన్ మంజూరు కావడం జరిగిందని, కాని ఇంతవరకు తన ఖాతాలో నిధులు జమచేయబడలేదని అ రుణం నిధులు ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ఎస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌ను ఆదేశించారు. తదితర మండలల నుంచి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు ఆ సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా అధికారులు తదితరులు గ్రీవెన్స్ డేలో పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం



పార్టీ గెలుపునకు విశేష కృషి చేసిన ప్రతి మండల అధ్యక్షులతో పాటు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో బ్లాక్ మండల కాంగ్రెస్ అధ్యక్షులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా పార్టీ తరపున కృషి చేయాలని కోరారు. తొమ్మిది యేండ్ల నుండి అధికారంలో లేకపోయినా పార్టీ వెన్నంటే ఉండి ప్రజా సమస్యలపై నిత్యం పోరాడిన ఫలితంతోనే ప్రజలు అధికారం కట్టబెట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిల ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయా మండలాల్లో ఆయా అధ్యక్షులు లబ్ధి దారుల ఎంపికలో సహకారాలు అందించాలని కోరారు. త్వరలో టీపిసిసిలో మార్పులు చేర్పులు ఉంటాయని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఖమ్మం కాంగ్రెస్ పై మంచి అభిప్రాయంతో ఉన్నాయని, అందుకే జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కాయని తెలిపారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు, పిసిసి సభ్యులు మహమ్మద్ జావేద్, పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క మండల అధ్యక్షుడుకి ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఇదే స్పూర్తితో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రతి బ్లాక్, మండల అధ్యక్షున్ని పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, వడ్డే నారాయణరావు, శీలం వెంకటనర్సిరెడ్డి, జఠిపోతుల సత్యనారాయణ, కందిమల్ల వీరబాబు, కళ్లెం వెంకటరెడ్డి, మట్టే గురవయ్య, భూక్యా బాలాజీ నాయక్, కొమ్మినేని రమేష్‌బాబు, అంబటి వెంకటేశ్వరరావు, గాలి దుర్గారావు, తలారి చంద్రప్రకాష్, స్వర్ణ నరేందర్, మాలోత్ మంగిలాల్, ఎదునూరి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెలలో వెసెక్టమీ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు

- డీఎం అండ్ హెచ్‌వో మాలతి

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లాలో ఈ నెలలో వేసెక్టమీ (కోత కుట్టు లేని) కుటుంబ నియంత్రణ శాస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. మాలతి తెలిపారు. సోమవారం ఖమ్మంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో వైద్యాధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కుటుంబ నియంత్రణలో పురుషులు భాగస్వామ్యన్ని ప్రోత్సాహస్తూ వాసెక్టమీ ఆపరేషన్‌లు చేయించాలని, జిల్లా ఆసుపత్రికి పంపించాలని చెప్పారు. ప్రోత్సహించిన వారికి రూ.200 వాసెక్టమీ చేయించు కొన్న వారికి రూ.1,100 ప్రోత్సాకంగా ఇస్తారని చెప్పారు. సిబ్బందితో వాసెక్టమీ (కోత కుట్టు లేని) ఆపరేషన్‌ల గురించి అవగాహనా కల్పించి, వారిని మోటివేషన్ చేయాలని కోరారు. అలాగే జిల్లా ఆసుపత్రిలో ఏ రోజు చేస్తారో ప్రజలకు వివరించాలని చెప్పారు. ఉప జిల్లా వైద్యారోగ్య శాఖధికారి డాక్టర్ బి. సైదులు మాట్లాడుతూ మాతా శిశు సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలని, డెంగీ శాంపిల్‌ను ఎక్కువగా చేయాలని, నివారణ కార్యక్రమాలను పగడబందిగా చేసి డెంగీ కేసులు పెరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో డెమో సాంబశివరెడ్డి, డి ఎస్ఓ వేణు, హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారావుకి సన్మానం

నవతెలంగాణ - బోనకల్

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావుని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్, సిపిఐ, వైఎస్ఆర్‌టీపీ పొత్తులో భాగంగా పది అసెంబ్లీ స్థానాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 9 స్థానాలను కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో ప్రధాన భూమిక ఖమ్మం జిల్లా నుంచి పోషించడం పట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ క్యాడర్ ను ఉత్తేజపరుస్తూ ఉత్సాహంగా పనిచేసిన జిల్లా వ్యాప్తంగా గల మండల అధ్యక్షులను సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో శాలువాలతో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గాలి దుర్గారావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మండలం నుంచి ఉపముఖ్యమంత్రి, మధిర శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్కకి 3,700 భారీ మెజార్టీ అందించేందుకు తనకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ, తన వెన్నంటి ఉన్న టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల జడ్పిటిసి సభ్యులు మోదుగు సుధీర్ బాబు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, మండల కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల సెల్స్ అధ్యక్షులకు, గ్రామ శాఖ అధ్యక్షులకు, యువజన కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు ఓటర్లకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు, ఖమ్మం టౌన్ అధ్యక్షులు మహమ్మద్ జావిద్, తదితరులు పాల్గొన్నారు.



ఈఎంఆర్ఎస్.. గేమ్స్‌లో పాల్వంచ ఈఎంఆర్ఎస్ విద్యార్థిని విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-పాల్వంచ

పాల్వంచ ఈఎంఆర్ఎస్ విద్యార్థిని, విద్యార్థులు తెలంగాణ సెకండ్ ఈఎంఆర్ఎస్ గేమ్స్ మంచి ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఎల్లారెడ్డిపేటలో ఈనెల 14 నుండి 16వ తేదీ వరకు జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో అండర్-19 కబడ్డీ విన్నర్స్‌గా, అండర్-19 చెస్‌పోటీలో విన్నర్స్‌గా, అండర్-17 క్యాటగిరిలో హాకీ రన్నర్, బాల్ బ్యాడ్మింటన్ రన్నర్ 10 కేటగిరి విభాగంలో ఓవరాల్ ఛాంపియన్స్ అన్ని విభాగాల్లో బహుమతులు సాధించారు. విజేతలుగా నిలిచి, పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రిన్సిపల్ కాయం స్వర్ణలత, స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్యా నాయక్, సెక్రెటరీ నికోలస్ అభినందనలు తెలిపారు. ఇందులో పాల్వంచ పిఈటిలు డి.బాలకృష్ణ, ఎస్.హేమలత, విద్యార్థుల్ని ప్రత్యేకంగా

ఓల్డ్ యూపీఎస్‌ను సందర్శించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లిలోని పాతసెంటర్ యూపీఎస్, ఎంపీపీఎస్‌ను సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సందర్శించారు. అనంతరం తరగతి గదులను సందర్శించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్ విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును పిల్లలను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్స్, తాగునీరు, వసతులను ఆరా తీశారు. విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి మృతికి నివాళులర్పించిన బాలసాని

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని 58వ డివిజన్ రాపర్తి నగర్ నివాసి, రిటైర్డ్ లెక్చరర్ పుట్లూరి మల్లారెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకుని సోమవారం నివాసానికి వెళ్లి, మృతదేహాన్ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ సందర్శించి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 58వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాలబోయిన వెంకటేశ్వర్లు, దుర్గ భవాని, సుంకరి శేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, హనుమారెడ్డి, కృష్ణారెడ్డి, రామాచారి, రామారావు, రమేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోరం కనకయ్యను అభినందించిన ఎంపీటీసీ లక్ష్మయ్య

నవతెలంగాణ-కామేపల్లి



ఎమ్మెల్యే కోరం కనకయ్యను పింజ రమడుగు ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, వెంకటనర్సయ్య (కవలలు) బ్రదర్స్ సోమవారం ప్రత్యేకంగా బోకే అంద జేసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఇల్లందు నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో కోరం గెలవడానికి కృషి చేసినందుకు ప్రత్యేకంగా ఇల్లందు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగిరేయడంతో సంతోషంగా ఎమ్మెల్యేను కలిసి అభినందించినట్టు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని నమ్మిన సిద్ధాంతం కోసం కష్టకాలలో కార్యకర్తలను ఆదుకుంటు అండగా ఉంటూ పనిచేసామన్నారు. అందరి సహకారంతో పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోని అధికారంలోకి వచ్చామన్నారు. కాంగ్రెస్ పార్టీ అందరికీ అండగా ఉంటుందని, ఎవరు అధైర్యపడవలసిన అవసరం లేదని ప్రజలకు భరోస ఇచ్చారు.

త్రివేణి పాఠశాలలో అమ్మ శతకం నాన్న శతకం పఠనం

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో సోమవారం విద్యార్థినీ, విద్యార్థులు డాక్టర్ చిగురుమళ్ళ శ్రీనివాస్ రచించిన అమ్మ శతకం నాన్న శతకం, గురువు శతకాలలోని పద్యాలను కంఠస్థం చేసి గానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ విద్యార్థులకు మాతృదేవోభవ.. పితృదేవోభవ.. ఆచార్యదేవోభవ అనుసూక్తులను వంట బట్టిచ్చేలాగా ఈ శతకార్చన కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీయవచ్చునని, అందుకు ఈ కార్యక్రమం ఎంతగానో తోడ్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అనుదినం...జనస్వరం

www.praja.khammam@gmail.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం 19, డిసెంబర్ 2023

ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తాం

- ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం
- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో కోరం



నవతెలంగాణ-ఇల్లందు

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం 6 గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 72, మున్సిపాలిటీ పరిధిలో 25 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాలలో ఇప్పటికే రెండు అమలు చేశామని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గం సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ డీవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా రంజక పాలన కొనసాగిస్తుందని అన్నారు. ప్రజలు మెచ్చే నచ్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీపీ చీమల నాగరత్నమ్మ జానీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ జాని, వైస్ ఎంపీపీ ప్రమోద్, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఎమ్మార్వో రవికుమార్, ఎండిఓ బాలరాజు, ఆర్ఐ పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ



నవతెలంగాణ-దమ్మపేట

అంకంపాలెం గ్రామంలో గల వాలీబాల్ క్రీడాకారులకు అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆది నారాయణ పేరు మీద క్రీడా దుస్తులను శ్యేంద్రు శ్రావణ్ కుమార్ స్పాన్సర్ చేస్తూ ఎమ్మెల్యే చేతుల మీదగా సోమవారం క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొర్సా సాగర్, వాడే వెంకట్రావు, కాక ప్రసాదు, పొట్ట శివాజీ, మోకాళ్ళ వితేజ్, సోయం చరణ్, అంకంపాలెం జారే సైన్యం యూత్ పాల్గొన్నారు.



కార్మికుల పక్షాన గళం విప్పుతా

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం

సంఘటిత, అసంఘటిత కార్మికుల పక్షాన చట్టసభలో గళం విప్పుతానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సోమవారం శేషగిరిభవన్‌లో జరిగిన సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కార్మికుల హక్కులు, కనీస వేతనాలు అమలుకు నోచుకోలేదని, నిత్యం నిర్బంధాలతో పాలనా సాగించారని విమర్శించారు. కార్మిక చట్టాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంటే టీఆర్ఎస్ ప్రభుత్వం పరోక్షంగా సహకరించారని ఆరోపించారు. క్రమబద్ధీకరణ హామీని అమలుచేయలేకపోయారని, కేంద్ర నిర్ణయాలను అమలుచేస్తూ ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటురంగంగా మార్చివేస్తున్నారన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో అత్యధికమంది కార్మికులు తనపై నమ్మకంతో చట్టసభకు పంపారని, వారి ఆశయాలకు అనుగుణంగా సమస్యల పరిస్కారం, చట్టాల అమలుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు కూనంనేనిని శాలువాలు, పూలమాలలు, బొకేలతో సత్కరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, కంచర్ల జమలయ్య, రామకృష్ణ, అమర్‌నాథ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి ఏరియాలో మహిళలకు ఆటల పోటీలు

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి డే సందర్భంగా సోమవారం కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్, గౌతంపూర్ సేవ సభ్యులకు సింగరేణి దినోత్సవ వేడుకలు-2023 పురస్కరించుకొని ప్రగతి వనం, రుద్రంపూర్ నందు ఆటల పోటీలు నిర్వహించారు. కొత్తగూడెం ఏరియా సేవ ప్రెసిడెంట్ జి. మధురవాణి షాలేం రాజు ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సింగరేణి సంస్థ గృహిణిలకు, నిరుద్యోగ యువతకు వివిధ ఉచిత వృత్తి శిక్షణ కోర్సులను ఇస్తుందని, శిక్షణ కోర్సులను నేర్చుకొని స్వయం ఉపాధి పొందాలని తెలియజేశారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఈనెల 23న శనివారం ప్రగతి వనం నందు జరుగు సింగరేణి దినోత్సవ వేడుకలలో బహుమతుల ప్రధానం జరుగునని, ఈ వేడుకలకు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా సేవ బాధ్యులు పద్మజా రాణి, కోటి రెడ్డి, డి.వై.పిఎం. జికేఓసి, ఎం.శ్రావణ్ కుమార్, కో-ఆర్డినేటర్ సాగర్, సేవ సెక్రటరీలు అనిత, మహిళలు పాల్గొన్నారు.

పే డే సంఖ్యను పెంచి కార్మికులను ప్రోత్సహించాలి

నవతెలంగాణ-మణుగూరు

నష్టాల్లో ఉన్న కేపీయూజీ మైన్‌ను లాభాల బాటలో పయనింప చేయడానికి దోహద పడుతున్న కార్మిక వర్గానికి యాజమాన్యం పే డే సంఖ్యను పెంచి ప్రోత్సాహం అందించాలని కార్మికులు తెలిపారు. సింగరేణి ఏరియా నందు జనరల్ మేనేజర్‌గా దుర్గం రామ చందర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గని అధికారుల సమన్వయం కార్మికుల సమిష్టి కృషి ఫలితంగా నష్టాల్లో ఉన్న కొండాపురం భూగర్భ గని నేడు అద్భుతమైన పురోగతి సాధిస్తుందన్నారు. గణనీయమైన స్థాయిలో లాభాలు గడిస్తుండంతో గని కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గడుస్తున్న లాభాల దృష్ట్యా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సరిపడా పేడేలు కల్పించక పోవడంతో కార్మికులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామ చందర్ వినూత్నమైన ప్రణాళికల నడుమ అయన ఎప్పటికప్పుడు ఇచ్చే దిశ నిర్దేశం ద్వారానే కార్మికులంతా సమన్వయంతో శ్రమించి కష్ట పడి నష్టాల్లో ఉన్న గని నేడు అద్భుతమైన లాభాలు గడించే విధంగా చేస్తున్నారని జీఎం ప్రత్యేకంగా దృష్టి సారించి సాధ్య అసాధ్యాలను పరిశీలించి గని నందు పే డేల సంఖ్యను పెంచే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని గని కార్మికులు వేడుకుంటున్నారు.

విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే పాఠశాలలో సమస్యలు

ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ

నవతెలంగాణ-జూలూరుపాడు

విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే పాఠశాలలు సమస్యల నిలయంగా మారాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ అన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా నరసాపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఏఐఎస్ఎఫ్ బృందం సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి పలు సమస్యలు వెలికి తీసింది. గత ప్రభుత్వంలో మన ఊరు- మనబడి కార్యక్రమంలో నాలుగు రూములలో ఏర్పాటు చేయడం జరిగిందని, అప్పటి ఎమ్మెల్యే లావుడ్య రాముల నాయక్ ప్రారంభించారని, అయినా ఇప్పటివరకు అందులో ఇంకా పూర్తి స్థాయిలో పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందని, రూములు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నా ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తుందని వంశీ అన్నారు. ప్రభుత్వ పాఠశాల అనేక సమస్యలు ఉన్నాయని ముఖ్యంగా మౌలిక వసతులు ఏర్పాటు చెయ్యకుండా విద్యార్థులు విద్యను ఎలా అభ్యసిస్తారని అయన ఆవేదన వ్యక్తం చేసారు. మినరల్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చెయ్యాలని, విద్యార్థుల పట్ల చిన్న చూపు చూస్తే ఊరుకునేదే లేదని అయన ప్రభుత్వన్ని హెచ్చరించారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యలు తక్షణ పరిష్కరించాలని లేని పక్షాన పెద్ద ఎత్తున విద్యార్థులు ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుగులోతు అఖిల్, సాయి, రామ్ చరణ్, అనిల్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు కాంగ్రెస్ నాయకుల అభినందనలు



నవతెలంగాణ-అశ్వాపురం

తెలంగాణ రాష్ట్ర శిశు సంక్షేమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కను సోమవారం మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ములుగులో మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెకు పూల బొకే ఇచ్చి మంత్రి కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆ పార్టీ అశ్వాపురం మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్ష మయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవ రెడ్డి మాట్లాడారు. నూతన రాష్ట్రంలో ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన మేరకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాదె ప్రతాపరెడ్డి, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ పి.రాంబాబు



నవతెలంగాణ-పాల్వంచ

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల దరఖాస్తులు వారు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అందజేసిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలపై నివేదికలు అందజేయాలని చెప్పారు. దరఖాస్తులను ఎండర్స్మెంట్ చేసి ఆయా శాఖల అధికారులకు తగు చర్యల నిమిత్తం సిఫార్సు చేసినట్టు చెప్పారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని గడ్డం శకుంతల తనకు 14వ వార్డు లిస్టులో డబల్ బెడ్ రూమ్ మంజూరు అయినదని, ఎన్నిసార్లు అధికారులను కలిసిన ఇస్తామని రేపు, మాపు అంటూ కాలం వెలబుస్తున్నారని, తమయందు దయతో కొత్తగూడెం పరిధిలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇంటిని ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. పాతూరు గ్రామం, మర్కోడు గ్రామపంచాయతీ నుండి కొమరారం బాయక్క తనకు 9.3 గుంటల వ్యవసాయ భూమి (ఆర్ఎఫ్ పట్టా) కలదని, సుమారు ఐదు సంవత్సరాల క్రితం తనకు రైతుబంధు మంజూరైనదని తన అకౌంట్లో డబ్బులు జమ అయినదని, కానీ అదనంగా 2000 నాకు చెక్కులో ఎక్కువ ఉన్నాయని సరిచేసి తిరిగి ఇస్తామని చెప్పి వ్యవసాయ అధికారులు తీసుకుని వెళ్లారు. కానీ ఇప్పటివరకు చెక్కు డబ్బులు గానీ, మరో విడత రైతు బంధు పథకానికి సంబంధించి డబ్బు తనుకు అందలేదని దయతో తనకు రావలసిన రైతుబంధు బకాయిలతో సహా ఇప్పించగలరని కోరారు.

బట్టు కృష్ణ కరకగూడెం వాస్తవ్యులు తాను గత మార్చ్ నెలలో కొత్తగూడెం, లక్ష్మీదేవి పల్లి మండలం రేగళ్ల, బానోజీ తండా ప్రాథమిక పాఠశాలల యందు మన ఊరు మన బడిలో మేజర్ అండ్ మైనర్ కార్యక్రమం కింద సుమారు రూ.6 లక్షలు వెచ్చించి కాంట్రాక్టు పనులు చేయించినట్లు, ఇంట్లో బంగారం తాకట్టు పెట్టి, బయట వడ్డీలకు పెట్టుబడి డబ్బులు తెచ్చి పనులు పూర్తి చేశానని తెలిపారు. పూర్తి అయినప్పటినుండి నేటి వరకు ఒక రూపాయి కూడా బిల్లు జమ కాలేదని, దయతో తనకు రావలసిన బిల్లులు ఇప్పించ గలరని కోరారు.

పాల్వంచ మండలం ఒడ్డుగూడెం గ్రామస్తురాలు కే.ధనలక్ష్మి తనకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల రెవెన్యూ గ్రామములో 1-34 కుంటల వారసతో పట్టా భూమి కలదని, అట్టి భూమికి రెవెన్యూ శాఖ భూమి రికార్డుల ప్రకారము 1-బి నమూనా (ఆర్ఓఆర్) కూడా వచ్చినదని, 2020లోనే తనకు పట్టా కావాల్సి ఉన్నదని, కానీ అనారోగ్య కారణాలవల్ల తాను పట్టా చేయించుకోలేకపోయినానని, దయతో తనకు టీఎస్ పట్టాదారు పాస్ బుక్ ఇవ్వాల్సిందిగా కోరారు.

మూడ్ లచ్చు పెద్ద తండ మాచినపేట జూలూరుపాడు మండలం వాస్తవ్యులు తాను వికలాంగుడనని, బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్నానని, బిఏ, బిఈడి చదివి ఉన్నానని, ఎటువంటి ఉద్యోగం రాక ఇబ్బందులు పడుతున్నానని, తనకు వికలాంగుల కోట కింద అంత్యోదయ కార్డు మంజూరు చేయవలెనని కోరారు.

ఈ కార్యక్రమంలో డీఆర్ఓ. రవీంద్రనాథ్, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం సమిష్టిగా పనిచేద్దాం

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ-కొత్తగూడెం

శాంతి భద్రతలు కాపాడడంకోసం, ప్రజా సమస్యల పరిస్కారంకోసం సమిష్టిగా పనిచేద్దమని, అధికార యంత్రాంగం, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. సోమవారం తన నివాసంలో కొత్తగూడెం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అబ్దుల్ రహమాన్, పలువురు సిఐలు, ఎస్సైలు కూనంనేనిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ చైర్పర్సర్ కాపు సీతా లక్ష్మి, పలువురు కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిదులు కూనంనేని పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పనిచేస్తేనే సమస్యలకు పరిస్కారం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య, కంచర్ల జమలయ్య, కొత్తగూడెం మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతామాలక్ష్మి వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సీఐటీయూ వినతి



నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతన పెరుగుదల, ఇతర సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సిఐటియు యూనియన్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు కోరారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సిఐటియు) రాష్ట్ర ప్రతినిధి బృందం సోమవారం హైద్రాబాద్ సచివాలయంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. సింగరేణి మొదటి సమీక్షలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రస్తావించినందుకు సిఐటియు ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తుందని చెప్పారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెరుగుదల, కోలిండియా వేతనాల అమలు, జీఓ నెం.22పై సింగరేణి యాజమాన్యం గత రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖ, కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లింపు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రమైన వివరాలతో కూడిన వినతి పత్రాన్ని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (ఎస్‌సికెఎస్) అందజేసి వివరించడం జరిగింది. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెరుగుదల, ఇతర సమస్యల పరిష్కారానికై చొరవ చేయాలని వారికి విజ్ఞప్తి చేశారు.

సిఐటియు వినతి పత్రంపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెరుగుదల, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిఐటియు ప్రతినిధి బృందానికి హామీనిచ్చారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారు సిఐటియు రాష్ట్ర నాయకులు పాలడుగు సుధాకర్ తదితరులు ఉన్నారు.

సింగరేణి ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించండి



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి ఎన్నకల్లో ఐఎన్టీయూసీని గెలిపించాలని ఆపరేషన్ ఫిట్ సెక్రటరీ రాంశెట్టి కృష్ణ చేతన్ అన్నారు. సోమవారం ఏరియా వైస్ ప్రెసిడెంట్ వెలగపల్లి జాన్ అధ్యక్షతన నిర్వహించిన ఐఎన్‌టీయూసీ యూనియన్ గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. యువకార్మికులను ప్రోత్సహిస్తూ సీనియర్ నాయకులతో కలిసి పనిచేయడానికి అవకాశం కల్పించిన జనక్ ప్రసాద్‌కి వారి ఆలోచనలను అమలులో పెడుతున్న మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ వెలగపల్లి జాన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణకే తలమాణిక్యమైనటువంటి సింగరేణి భవిష్యత్తుని సీనియర్ నాయకుల అనుభవం, సలహాలతో (అగ్నికి వాయువు తోడైనట్టు) యువ కార్మికులం యువశక్తితో సింగరేణిని అన్ని విభాగాల్లో అత్యంత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లుతామని కార్మికులతో నాయకుల ఉండబోమని కార్మికులే మా నాయకులని, కార్మికులకు సేవకులలాగా పని చేస్తామని మాట్లాడారు. అనంతరం ఏరియా వైస్ ప్రెసిడెంట్ వెలగపల్లి జాన్ మాట్లాడుతూ టీబీజీకేఎస్ యూనియన్ 64హక్కులు సాధించామని గొప్పలు చెప్పుకుంటూ తిరుగుతున్నారన్నారు. సాధించిన హక్కులను ఒక కరపత్రం విడుదల చేయాలన్నారు. అంబేద్కర్ జయంతిని పీహెచ్డీగా తీసుకువచ్చి ఎస్-1 అండ్ 50శాతం పిహెచ్డిని సింగరేణిలో అమలు చేసి కార్మికుల పొట్టకొట్టింది టీబీజీకేఎస్ యూనియన్ కాదా అని ప్రశ్నించారు. ఎవరైనా టీబీజీకేఎస్ యూనియన్‌కి ఎదురు మాట్లాడితే అధికారులతో కలిసి ఛార్జ్ షీట్ ఇప్పివ్వడం, కుదిరితే అక్రమ ట్రాన్సుర్ చేపించడం కార్మికుడికి ఏ పని చేయాలన్నా దానికి లంచం తీసుకోవడం ఇన్నిరోజులు చేసిన పనులు అని నాయకులపై మాటల తుటాలతో విరుచుకుపడ్డారు. అనంతరం నామ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అలాగే కొన్ని యూనియన్ల నుండి స్వచ్ఛందంగా ఐఎన్‌టియూసి యూనియన్‌లో చేరడానికి వస్తున్న కార్మికులను, కార్యకర్తలను కొంతమంది నాయకులు బెదిరింపులకు గురించేస్తున్నారన్నారు.

కార్మికులు సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలలో మీకు తగిన బుద్ధి చెప్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గట్టయ్య సోమరాజు, వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ టి.పెదనాగయ్య, బ్రాంచ్ సెక్రటరీ రాజలింగు, ఫిట్ జాయింట్ సెక్రటరీ ఎండీ కరీమ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు తెప్పా శ్రీనివాస్, శివ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాగం రవి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరుడు మృతి

- నివాళులర్పించిన కాసాని



నవతెలంగాణ-సుజాతనగర్

సీపీఐ(ఎం) పార్టీ సానుభూతిపరుడు, ప్రజా నాట్యమండలి కళాకారుడు బొమ్మగాని రాజకుమార్ సోమవారం ఉదయం మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకుమార్ మృతి పార్టీకి తీరనిలోటని, వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి వీర్ల రమేష్, బాలు, వెంకటేశ్వర్లు, కోలాహలం శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



హార్ట్ బీట్ స్వచ్ఛంద సంస్థకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-జూలూరుపాడు

హార్ట్ బీట్ స్వచ్ఛంద సంస్థకు సోమవారం మండల కేంద్రమైన జూలూరుపాడుకు చెందిన సాయి ఎక్సలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం రూ.8,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారదా దేవి, కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్, అనిత, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో ఎస్సీ వర్గీకరణ కోసం మౌనదీక్ష

- టీఎంజేఏసీ యూత్ జిల్లా అధ్యక్షులు గద్దల రమేష్

నవతెలంగాణ-పాల్వంచ

శీతాకాలం పార్లమెంటు సమావేశంలో ఏబిసిడి ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశం పెట్టాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ తెలంగాణ భవనంలో డాక్టర్ బీఆర్ అబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు పిడమర్తి రవి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో మౌనం దీక్ష సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో బీజేపీ మెడల వంచి ఎస్సీ వర్గీకరణ బిల్లును పెట్టేవరకూ వదిలే ప్రసక్తే లేదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమలరావు, మాదిగ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరి రవి, ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల శ్రీనివాస్, జిల్లా నాయకులు దేపంగి వెంకటరమణ, రాళ్లపల్లి నరసింహారావు, మాచర్ల విజయ్. తదితరులు పాల్గొన్నారు.

20న వికలాంగుల కోసం ప్రత్యేక బస్ పాస్ మేళా

దుమ్ముగూడెం మండల పరిషత్ సమావేశపు మందిరంలో ఈ నెల 20వ తేదీన వికలాంగుల కోసం ప్రత్యేక బస్ పాస్ మేళాను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.ముత్యాలరావు సోమవారం తెలిపారు. సదరం సర్టిఫికెట్‌లో అంగవైకల్యం 40 శాతం మించి ఉండాలని, వినికిడి, దృష్టిలోపం ఉన్నవారికి 100 శాతం ఉండాలని, మెంటల్ రిటార్డేషన్ ఉన్న వారికి ఐక్యూ 69 శాతం కంటే తక్కువ ఉండాలని తెలిపారు. క్యాంప్ మేళకు వచ్చే వికలాంగులు ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు, ఐడి కార్డ్ జిరాక్స్‌తో పాటు సర్వీస్ ఛార్జ్ కోసం రూ.50లు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. వికలాంగుల కోసం ఏర్పాటుచేసిన బస్ పాస్ స్పెషల్ క్యాంప్ మేళాలో పి.హెచ్.సి బస్ పాస్‌లను అందజేయడం జరుగుతుందన్నారు. వికలాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

భద్రాద్రి కవి తాతోలు దుర్గా చారికి ఘన సన్మానం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో జరిగిన ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలులో ప్రతిభ ప్రదర్శించిన భద్రాద్రి కవి తాతోలు దుర్గా చారిని సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహితి ప్రధాన సలహాదారు జీ.ఎస్.శంకర్‌రావు, ప్రముఖులు పాకాల దుర్గా ప్రసాద్, గోళ్ళభూపతిరావు, గాదె మాధవి రెడ్డి, చారుగుళ్ళ శ్రీనివాస్, కవి వర్యులు మాల్యశ్రీ, సోంపాక సీత, బిజెఎల్ పి.దాసు, టి.వి.చలం, సి.నాగేంద్ర ప్రసాద్, బాలాజీ రాజు, కె.కనక దుర్గా, యం.పద్మావతి, ఉమాదేవి, సిహెచ్.విజయలక్ష్మి, కే.ప్రశాంతి, కే.నాగమణి, యస్.కే.జహీదాబేగం, కే.నాగలక్ష్మీ, యం.శివ, ఈగపాటి రంజాన్ తదితరులు కవి తాతోలు దుర్గా చారిని అభినందించారు.

చేసే పనికి గౌరవేతనం ఇవ్వండి



నవతెలంగాణ-జూలూరుపాడు

మమ్మల్ని గుర్తించి మేము చేసే పనికి గౌరవేతనం రూ.9500లు ఇవ్వాలని జూలూరుపాడు మండలంలో బహుజన కార్మిక విభాగం (బికెవి) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్మిక విభాగ గౌరవ అధ్యక్షులు తంబర్ల నరసింహారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో స్లీపర్‌గా పనిచేస్తున్నటువంటి కార్మికులను గుర్తించి, వారు చేసేటువంటి పని పాఠశాల గదులు, ఆవరణలు ఊడ్చడం, టాయిలెట్స్ కడగటం లాంటి పనులు చేస్తున్న అటువంటి స్వీపర్లకు కనీసం గౌరవ వేతనం రూ.9500 ఇవ్వాలని తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు వచ్చేటువంటి కొద్ది జీతం ఎటు సరిపోక వారి ఫ్యామిలీ గడవక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారని ఈ పరిస్థితులన్నీ గమనించి వీరి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్య సాలి, నూనవత్ లక్ష్మణ్, వట్టం కష్టయ్య, పాయం శేషమ్మ, ప్రేమమ్మ కవిత, సాయమ్మ, ప్రతాప్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కోరంకు శుభాకాంక్షలు తెలిపిన జీఎం

నవతెలంగాణ-ఇల్లందు

నియోజకవర్గ ఎమ్మెల్యేగా నూతనంగా ఎన్నికైన కోరం కనకయ్యను సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నూతన జెకె ఓసి ప్రాజెక్టు గురించి ఎమ్మెల్యేకు తెలియజేసి తగు సహకారాన్ని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి కావలసిన సహకారాన్ని అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి శివ కుమార్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అనుదినం-జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం 19 డిసెంబర్ 2023

పరశురామవతారంలో పర్ణశాల రామయ్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా 6వ రోజు సోమవారం పర్ణశాల రామయ్య పరశు రామవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ మహావిష్ణువు జమదగ్ని అనే మహర్షికి కొడుకుగా జన్మించి పరశురాముడు భార్గవరాముడు అని పిలవబడుతూ దుష్టులైన కర్తవీరార్జునుని, దుర్మార్గులైన రాజులను ఇరవైఒక్కమారు దండెత్తి సంహరించాడు. ధర్మాన్ని స్థాపించాడు. శుక్రగ్రహ బాధలు ఉన్నవారు ఈ అవతారాన్ని దర్శించడం వలన శుభ ఫలితాలు పొందుతారని పురాణాలు చెబుతున్నాయి. సాయంత్రం 4.30 గంటలకు స్వామివారిని గ్రామ పురవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రావణ్ కుమార్, అనిల్, సూపరిండెంట్ కిషోర్, పర్ణశాల ఆలయ ఇన్చార్జ్ ప్రసాద్, అర్చకులు అ మరవాది కిషోర్ కుమారాచార్యులు, శేషం కిరణ్ కుమారాచార్యులు, భరద్వాజచార్యులు, ఆలయ సిబ్బంది యగ్గడి శివ, కంటెం రాము తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

- మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాంబాబు, బాలకృష్ణ

నవతెలంగాణ-చర్ల



చర్ల మండలం టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తిరిగి మళ్ళీ కాకా రాంబాబు, వుయికా బాలకృష్ణలను సోమవారం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా ఉపాధ్యక్షులు బి.మురళీమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం దేశంలో, రాష్ట్రంలో సంక్షోభంలో ఉన్నదని మౌలిక సదుపాయాలు, బడ్జెట్ లేమి, ఉపాధ్యాయ ఖాళీలు విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని పేదలు నాణ్యమైన విద్యను పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన ప్రభుత్వం అయినా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఐఆర్ 5శాతం నుంచి 15శాతం పెంచాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, విద్యా వాలంటీర్లను నియమించి సబ్జెక్ట్ టీచర్ల కొరతను తీర్చాలన్నారు. 317 జీఓ వల్ల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలని, నిలిచిపోయిన పదోన్నతులు నిర్వహించాలన్నారు. బదిలీ అయ్యి రిలీవ్ కాకుండా ఉన్న ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఆదాయ పన్ను చట్టాన్ని 8లక్షల వరకు పన్నులేని ఆదాయంగా పరిగణించే విధంగా సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీ

అధ్యక్షులు కాక రాంబాబు, ప్రధాన కార్యదర్శి వుయిక బాలకృష్ణ, సహధ్యక్షులు కె.యాదగిరి, సహధ్యక్షురాలు పి.రాధ, కోశాధికారి సకినం బాలకృష్ణ, కార్య దర్శులుగా కె.కృష్ణవేణి, చిడెం హిమగిరి బాబు, వజ్జ రాంబాబు, బి.పంతులు, రుక్మిణీ (కేజీబీవీ), ఆడిటర్ బి.సర్వేశ్వర రావు, మహిళా కమిటీ కన్వీనర్ బి.వాణిశ్రీ, సోషల్ మీడియా కన్వీనర్ ఈ. వెంకటేశ్వర్లు, ఓటు కన్వీనర్ మిడి యం.యడమరాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విజయ్, గెజిటెడ్ హెడ్ మాస్టర్‌లు పి.వీ.రమణ, ఎ.శ్రీనివాస రావు, జి.వ సంత, భానుప్రియ, శ్రీలక్ష్మి వీర్రాజు మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-మణుగూరు

తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకం అమలు నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్లకు న్యాయం చేయాలనీ ఐఎఫ్‌టీయూ మణుగూరు ఏరియా నాయకులు సాధనపల్లి రవి తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సురక్షా బస్ స్టాండ్‌లో జరిగిన ఆటో డ్రైవర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ఆరు గ్యారంటీల పథకాలు అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు టీఎస్ ఆర్టీసీ బస్సులో ఈనెల తొమ్మిదవ తేదీ నుండి ప్రారంభమైన ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయడంతో ఆటోలు నడిపి తమ కుటుంబాలను పోషించుకుంటున్న ఆటో డ్రైవర్లు, ఓనర్ కం డ్రైవర్ల ఇతర కార్మికుల ఉపాధి పై తీవ్ర ప్రభావం చూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు నాగేశ్వరరావు, శంకర్, నాగేశ్వరరావు, శ్రీను, చారి, సాంబ, సూర్యనారాయణ, రాములు, రషీద్, భద్రం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమాలతో అవగాహన పెంపుదల

- ఏడీ హేమంత్ కుమార్

నవతెలంగాణ-అశ్వారావుపేట



వివిధ ప్రాజెక్టులు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలకు హాజరు అవడం ద్వారా అభ్యసనం అభివృద్ధికి తోడ్పాటుతో పాటు మేధో పరంగా అవగాహన పెంపుదల అవుతుందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్ కుమార్ విద్యార్థులకు సూచించారు. "బ్లాక్ సోల్జర్ ఫ్లై" పెంపకం పై జాతీయ వ్యవసాయ ఉన్నత విద్యా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ కళాశాల విద్యార్థులకు సోమవారం ప్రాజెక్ట్ సహ పరిశోధకులు డాక్టర్ వై.ఎస్ పరమేశ్వరి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ విద్య అభ్యసిస్తున్న చివరి సంవత్సర విద్యార్థులు, భోధన సిబ్బంది ఇందులో బ్లాక్ సోల్జర్ ఫ్లై గురించి, వాటి ఉపయోగాల గురించి తెలుసుకున్నారు. ఈ కీటకం సేంద్రియ వ్యర్థాలను ఉపయోగపడే ఉత్పత్తులుగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని పరమేశ్వరి తెలిపారు. కళాశాల అసోసియేట్ డీన్ డా. హేమంత కుమార్, సహ ఆచార్యులు గోపాల కృష్ణ మూర్తి, సహాయ ఆచార్యులు టి.పావని, రెడ్డి ప్రియా, రామ్ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

సురక్ష ఒకేషనల్ కాలేజీలో క్యాపింగ్ వేడుక

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెంలోని ఒకేషన్ కాలేజీలో సోమవారం మొదటి సంవత్సరం నర్సింగ్ చదువుతున్న విద్యార్థులకు క్యాపింగ్ వేడుక నిర్వహించారు. కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్, రామ టాకీస్ రోడ్‌లో గల సురక్ష ఒకేషనల్ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంపిహెచ్‌డబ్ల్యు (ఫిమేల్) నర్సింగ్ విద్యార్థులకు కొత్తగూడెం పట్టణంలోని ఉషా డెంటల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎస్.కె నజియా విద్యార్థులకు క్యాపిటింగ్ పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎలదండి రాము, ప్రిన్సిపాల్ మల్లం సతీష్, అధ్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు క్రీడా పోటీలు

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి దినోత్సవంలో భాగంగా సోమవారం సింగరేణి సేవ సమితి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు సేవా మెంబర్స్‌కి ట్రైనర్స్‌కి సింగరేణి కుటుంబ సభ్యులకి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రీడలలో పాల్గొన్న విజేతలకు డిసెంబర్ 23న జరిగే సింగరేణి దినోత్సవ వేడుకలలో జీఎం చేతుల మీదగా ప్రైజులు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఏరియా సీనియర్ పర్సన్ ఆఫీసర్ సాయి స్వరూప్ సింగరేణి ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ సుధాకర్, సేవా సమితి కోఆర్డినేటర్ బి.కే సాంబయ్య, సేవ సెక్రటరీ విజయ, సులక్షణ సేవా మెంబర్లు ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలకు గుర్తింపు సర్వే

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో పరిధిలో ఓఎస్సీ సర్వే ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు జిల్లా డీఈవో ఆదేశానుసారం డిసెంబర్ 10వ తారీకు నుంచి జనవరి 11వరకు టేకులపల్లిలో ఉన్న 6 కాంప్లెక్స్‌లో సిఆర్పిలు తమ తమ కాంప్లెక్స్‌లో అన్ని పాఠశాల పరిధిలో ఉన్న బడి బయట పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించడం జరుగుతుందని సోమవారం తెలిపారు. కుంటల కాంప్లెక్స్ పరిధిలోని మంగలి తండా గ్రామంలో ఇద్దరు పిల్లలు చాలా రోజుల నుంచి బడికి వెళ్లకుండా కూలికి వెళ్తున్నట్టు తెలిసి చేనుకు వెళ్లి చదువు గొప్పదనం గురించి దానివల్ల కరిగే ప్రయోజనాలు గురించి వివరించి తిరిగి పాఠశాలకు వెళ్లే విధంగా చేయడం జరిగిందన్నారు. సోమవారం తమ పరిధిలో ఉన్న పాఠశాల ఊరిలో బడి బయట పిల్లలను గుర్తించి అదే పాఠశాలలో చేర్పించారు.

సీఐటీయూ గెలిస్తే కార్మికులు గెలిచినట్లే..!

ఒక్కసారి అవకాశం ఇవ్వండి సింగరేణి రక్షణ కోసం పాటుపడతాం

- యాజమాన్యానికి తలొగ్గే వారికి బుద్ధి చెప్పండి
- "ఉదయించే సూర్యుని గుర్తుకు" ఓటెయ్యండి
- మంద నరసింహారావు పిలుపు



నవతెలంగాణ-కొత్తగూడెం

సింరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గెలిస్తే కార్మికులు గెలిచినట్లేనని, సింరేణి గుర్తుంపు సంఘంగా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని, సింగరేణి రక్షణ కోసం పాటుపడతామని, యాజమాన్యానికి తలొగ్గే వారికి బుద్ధి చెప్పాలని సింరేణి ఎన్నికల్లో 'ఉదయించే సూర్యుని గుర్తుకు" ఓటెయ్యాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు కార్మికులకు పిలుపు నిచ్చారు. సోమవారం సింగరేణి బొగ్గు బావుల వద్ద, కార్పొరేట్ ఏరియాలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఫిట్ మీటింగ్‌లు, గేట్ మీటింగులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు మాట్లాడుతూ సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నా సీఐటియూ యూనియన్‌ని గెలిపించాలని, సింగరేణి ప్రైవేటు పరం చేస్తున్న యూనియన్లను ఓడించేందుకు ప్రతి కార్మికుడు సిద్ధంగా ఉండాలని కోరారు. ఒక్కసారి సీఐటీయూని గెలిపిస్తే , కార్మికుల సత్తా చాటుతాం అని అన్నారు. యాజమాన్యంకు తలొగ్గి, కార్మికుల జీవితాలను తాకట్టు పెట్టే సంఘాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం, సొంత ఇంటి కల కోసం, సింగరేణిలో జరుగుతున్న అవినీతి కార్యకలపాలని అరికట్టేందుకోసం కృషి చేస్తున్న సిఐటియుని గెలిపించాలని కార్మికులను కోరారు. ఇప్పటి వరకు అధికారంలో ఉన్న యూనియన్లు కార్మికుల హక్కులు కాలరాసే విధంగా సింగరేణి సంస్థను బొగ్గు బ్లాక్లుగా వేరుచేసి ప్రైవేటుపరం చేసే పద్ధతికి శ్రీకారం చుట్టాయని ఆరోపించారు. కార్మికులు కష్టపడి తమ రక్తాన్ని చమట చుక్కగా చేసి శ్రమటోడ్చి పనిచేస్తున్న కార్మికులకు అండగా నిరంతరం సిఐటియు నిలబడిందన్నారు. ప్రైవేటీకరణను కార్మికుల హక్కుల కాపాడేందుకు సిఐటియు కృషి చేసిందని గుర్తు చేశారు. వేతన ఒప్పందాల విషయంలో కార్మికులకు న్యాయం చేసే విధంగా జేబీసీసీఐ సమావేశాల్లో గట్టిగా కోట్లాడి హక్కులు సాధించుకోవడం జరిగిందన్నారు. కాబట్టి సీఐటీయూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్‌ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, నాయకులు వై. వెంకటేశ్వరరావు, సూరం ఐలయ్య, కర్ల వీరాస్వామి, కె.రమేష్ బాబు, నాజర్, కూరపాటి సమ్మయ్య, రామ్మూర్తి, డి.వీరన్న, భూక్య రమేష్, లిక్కి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా ద్వారక సాయి శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మన్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



స్థానిక జూనియర్ కాలేజి రోడ్ నందు గల శ్రీ ద్వారక సాయి శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మన్యేశ్వర స్వామి వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం 5 గంటలకు స్వామి వారికి పంచామృతాలతో రుద్రాభిషేకం చేసినారు. అనంతరం మహిళ భక్తులతో నాగ దేవతకు ఆలయ పూజారి భైరవభట్ల వెంకట రత్నం కుంకుమ పూజ నిర్వహించి భక్తులకు అమ్మవారి పసుపు కుంకుమ, గాజులు, జాకెట్ ముక్కను అందించారు. సాయంత్రం శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణంను కనుల పండువగా నిర్వహించినారు. ఇట్టి కార్యక్రమానికి లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల అధినేత కీ.శే.మాగంటి సూర్యం కుమారులు ప్రసాద్ బాబు, రమేష్ బాబు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మీ ఆప్యాయత మరవలేనిది : ఎమ్మెల్యే జారే

నవతెలంగాణ-దమ్మపేట



మీలో ఒకణ్ణి నేను, మీ గ్రామాలకే నేను వస్తానని అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల ఆప్యాయత అభిమానం వెల కట్టలేనిదని, ఈ నియోజకవర్గ ప్రజలందరికీ ఋణపడి ఉంటానని, మీకు సేవకుడిలా పనిచేస్తానని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ స్పష్టం చేశారు. సోమవారం దమ్మపేట మండలం, గండుగుల పల్లి గ్రామంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ నివాసానికి నియోజకవర్గానికి చెందిన 5 మండలాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో వచ్చి జారెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జారె మాట్లాడుతూ తాను గతంలో ఎప్పుడూ ప్రభుత్వాలపై విమర్శలు చేయలేదని, తనయొక్క సేవ ద్వారా ప్రజలకు చేరువై తనకు అవకాశం ఉన్నంత మేరకు ప్రజా సేవ చేశానని తాను ఎమ్మెల్యే అయినప్పటకి గతంలో మాదిరిగానే ప్రజాసేవను కొనసాగిస్తానని తెలిపారు. ఈ నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పు తాను తలకెక్కిచ్చుకోకుండా ప్రజాతీర్పుకు వ్యతిరేకంగా ఏ చర్యలు ఉండవని తనకు ఇంత అద్భుత విజయాన్ని అందించిన ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన తనకు సాధ్యమైన ప్రజా ఆమోదం కలిగిన కార్యక్రమాలు నిర్వహించడానికి తాను ముందువరుసలో ఉంటానని పేర్కొన్నారు. కొంత సమయం హైదరాబాదులో గడపడం వలన నియోజకవర్గ ప్రజలందరినీ కలుసుకోలేకపోయానని ప్రజలు ఎవ్వరూ అర్జీలు పట్టుకొని తనవద్దకు రావాల్సిన అవసరం లేదని తానే నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాలలో పర్యటించి అంశాల ప్రాతిపదికన పక్కా ప్రణాళికతో ఒక ఎజెండాను రూపొందించి ప్రజా సమస్యలు అన్నింటిని పరిష్కరిస్తానని నియోజకవర్గంలోని ఏ గ్రామాన్ని మినహా యించకుండా అన్ని గ్రామాలలో పర్యటించి మీ ఇళ్ళవద్దకు, మీవద్దకు నేను వస్తానని ఈ సంద ర్భంగా జారె ఆదినారాయణ ప్రజలకు తెలియ జేశారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ ఆ సమస్య తక్షణం పరిష్కారం అయ్యేవిధంగా తాను నిర్విరామ కృషి చేస్తానని పేర్కొన్నారు. తనను కలవడానికి వచ్చిన ప్రజల అభిమానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొయ్యల అచ్యుతరావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొర్సా సాగర్, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతం, తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



నీతి, నిజాయితీకి మారు పేరైన సీఐటీయూను ఆదరించండి

- ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓటు వేయాలి
- సీఐటీయూ జాతీయ నాయకులు రాజా రావు విజ్ఞప్తి

నవతెలంగాణ-ఇల్లందు



కార్మికుల సంక్షేమాన్ని కోరుతూ నీతి, నిజాయితీకి మారుగా నిలుస్తున్న సీఐటీయూను ఆదరించాలని సీఐటీయూ జాతీయ నాయకులు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రాజారావు అన్నారు. సింగరేణి ఎస్అండ్పీసీలో సోమవారం పిట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బొగ్గుగనులను నిర్వీర్యయం చేస్తున్నాయని అన్నారు. ప్రైవేటీకరణ చేస్తూ సింగరేణిని కనుమరుగు చేసే చర్యలుకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఏటా కార్మికుల సంఖ్య తగ్గుతోందని, ఓసీలు తీయటం మూలంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని అన్నారు. ఓసిలు తీయమని భూగర్భగనులకు ప్రాధాన్యత ఇస్తామని తెలంగాణ ఉద్యమ సమయంలో అనంతరం ముఖ్యమంత్రి అయిన తర్వాత కేసీఆర్ అన్నారని తర్వాత మాట నిలబెట్టుకోలేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓసిలకు ప్రాధాన్యంత ఇస్తూ బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటుపరం చేస్తున్నారని అన్నారు. టీబీజీకేఎస్ హయాంలో కార్మికులకు ఒరిగిందేమీ లేదన్నారు. అవినీతి, ఫైరవీలు పెరిగిపోయాయని, పక్షపాతంగా వ్యవహరిస్తూ కార్మికులను అనేక రకాల ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. ప్రధాని మోడీ, కేసీఆర్ మూలంగానే సింగరేణి పూర్వ వైభవాన్ని కోల్పోయిందని అన్నారు. కార్మికులకు సొంతింటి కళ నెరవేరాలంటే, సింగరేణి సంస్థను కాపాడాలంటే సీఐటీయూ గుర్తు ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ నబి, అబ్బాస్, కోసూరి రమేష్, కే.శంకర్, తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్ కుమార్, దారవత్ రాందాస్, హుస్సేన్, గోబ్రియా, వైఖుంటం, కేశవ్ శ్యామ్ లోధ్ సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.



రైళ్లని పునరుద్ధరించకపోతే అఖిలపక్ష ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం)కు వచ్చే రైళ్లని పునరుద్దరణ చేయకపోతే అఖిలపక్ష ఆధ్వర్యంలో ధర్నా చేయడం తప్పనిసరి అఖిలపక్షం నాయకులు స్పష్టం చేశారు. సోమవారం అఖిల పక్షం నాయకులు కొదమసింహం పాండు రంగా చార్యులు ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ మాస్టర్ కుందన్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేవలం బొగ్గు రవాణా కోసం మాత్రమే ఈ రైల్వే స్టేషన్ పనిచేస్తుందే తప్ప ప్రజల కోసం, ప్రయాణికుల సౌకర్యార్థం పనిచేయడం లేదని ఆరోపించారు. రైల్వే శాఖ వాళ్ల పాలు ప్రకటించిన విధంగా వారం లోపు రైళ్ళను నడపకపోతే ఆందోళన చేయడం తప్పదని, ఎలాంటి అరెస్టులకు వెనుకాడేది లేదని ఉద్ఘాటించారు. అధికారులు కేవలం బొగ్గు సరఫరా చేసి రైల్వే శాఖకు రెవిన్యూ అందించడానికి తప్ప ప్రజల సౌకర్యాలు, బాగోగులు పట్టించుకోవట్లేదు విమర్శించారు. ముఖ్యంగా ఉదయాన్నే బయలుదేరే సింగరేణి రద్దు చేశారని, అదే విధంగా కొల్హాపూర్ ట్రైన్ లేకుండా చేశారు. దీనివల్ల ప్రయాణికులకు, వ్యాపారస్తులకు ఎంతో లాభదాయకమని చెప్పారు. చిన్నచిన్న స్టేషన్లో ఆగే రద్దు చేశారని, దీనివలన ఈ ప్రాంత గిరిజనులకు, దళితులకు ఇబ్బంది జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా భద్రాచలం పుణ్యక్షేత్రం అయిన శ్రీ సీతారామ దేవాలయానికి దగ్గరకు వచ్చి యాత్రికులకు సౌకర్యం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల అసౌకర్యాలను గమనించి రైల్వే అధికారులు వెంటనే వారంలోపు నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించకపోతే ఆందోళన తప్పని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు అన్నవరం సత్యనారాయణ, సీపీఐ పార్టీ నాయకులు సలిగంటి శ్రీనివాస్, బత్తుల సత్యనారాయణ, సిపిఐ ప్రజా పంథా నాయకులు ఎదుర్లాపురం గోపాల్ రావు, ధర్మ, గుండా రమేష్, ఎంఆర్‌పీఎస్ రైల్వే పోరాట కమిటీ నుండి పవన్ కళ్యాణ్, చైతన్య, కల్లూరు కృష్ణ, సతీష్ తదితరులు ఉన్నారు.

మహాలక్ష్మి అమలుతో ఆటో డ్రైవర్‌లకు అన్యాయం

- ఆదుకోవాలని ఎమ్మెల్యేకు ఎంపీటీసీ వినతి

నవతెలంగాణ-అశ్వారావుపేట



ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో ఆటో డ్రైవర్‌లకు అన్యాయం జరుగుతుందని, అన్నా ఆటో వాళ్ళను ఆదుకుందాం అంటూ ఎమ్మెల్యే ఆదినారాయణకు అశ్వారావుపేట ఒకటో సెగ్మెంట్ కాంగ్రెస్ ఎంపీటీసీ వేముల భారతి సోమవారం వినతి పత్రం అందజేశారు. నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం అమలు చేయడం, ఈ పథకంతో ఆటో వాళ్ళకు అన్యాయం జరుగుతుందని అదే పార్టీ ఎమ్మెల్యేకు ఇదే పార్టీ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీటీసీ ఇలా వినతి పత్రం అందజేయడం సర్వత్రా చర్చాంశనీయం అవుతుంది. అదే వినతి పత్రంలో గత ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని, ప్రజలను సైతం నొప్పించే లా గత పాలన చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. అశ్వారావుపేట సెంటర్ లైటింగ్ పనుల క్రమంలో రోడ్డుకి ఇరువైపులా గుంతలు తవ్వి వ్యాపారస్తులకు, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించారు అన్నారు. ఈ సెంట్రల్ లైటింగ్ ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా తక్షణమే పూర్తి చేసి ప్రజలకు మేలు చేయాలని వినతి పత్రంలో సూచించారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి పథకం ఎందరో నిరుపేదలకు చిరు ఉద్యోగులకు సైతం ఎంతో ఆసరాగా ఉండి, మహిళల ముఖంలో ఆనందాన్ని నింపుతుందని ఆమె అంటూనే ఈ పథకం ద్వారా ఆటో వాళ్లకు నష్టం చేకూరుతుందని, ఆటోని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న కుటుంబాలకు భరోసా కల్పించేలా అసెంబ్లీలో వారి గోడు వినిపించాలని స్థానిక ఎంపీటీసీ కోరారు.

సింగరేణి డే వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన ఏజీఎం

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో డిసెంబర్ 23వ తేదీన నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ ప్రధాన వేడుకలు ఘనంగా నిర్వహించాలని సింగరేణి ఏజీఎం (పర్సనల్) కె.శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం ప్రకాశం స్టేడిఎంలో జరుగుతున్న ఏర్పాట్లు ఆయన పరిశీలించారు. ప్రధాన వేడుకల వేదిక, వివిధ విభాగాల వారు ఏర్పాటు చేసే స్టాల్స్ ఏర్పాట్ల గురించి డిజీఎం (సివిల్) పి.రాజ శేఖర్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ వేడుకలకు వచ్చే ముఖ్య అతిధులకు, సింగరేణీయులకు వారి కుటుంబ సభ్యులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కావలసిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమములో పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ, సీనియర్ పిఓ టి.శ్రీనివాస రావు, డివై.ఎస్ఈ (సివిల్) రవి కుమార్ పాల్గొన్నారు.

షాపులు ఆక్రమించి కిరాయిలకు ఇవ్వడం మానుకోవాలి

- వీధి వ్యాపారస్తుల సముదాయాల పరిశీలనలో ఎమ్మెల్యే కోరం, చైర్మెన్ డివి

నవతెలంగాణ-ఇల్లందు

ఒక్కరే మూడు, నాలుగు షాపులో ఆక్రమించి కిరాయికి ఇస్తున్నారని, అలాంటి వాటికి తావు లేకుండా అధికారులు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మెన్ డివి అధికారులను ఆదేశించారు. కొందరు రాజకీయ పలుకుబడితో గదులు ఆక్రమించుకొని కిరాయిలకు ఇస్తున్నారని ఫిర్యాదు చేయడంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన వీది వ్యాపారుల షాపింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం సందర్శించారు. వీది వ్యాపారస్తులు బతకడం కోసం నిర్మించిన వీధి వ్యాపారస్తుల సముదాయంలో వీధి వ్యాపారస్తులు మాత్రమే ఉండాలని అన్నారు. షాపులు కేటాయించే ప్రక్రియలో కోర్టు కేసు ఉన్నందున రూమ్లు కేటాయించడంలో జాప్యం జరిగిందన్నారు. విషయం గమనించిన కొంతమంది మూడు నుండి నాలుగు షాపులు ఆక్రమించుకొని వాటిని కిరాయికు ఇస్తున్నారు ఇది సరైన పద్ధతి కాదన్నారు. వీధి వ్యాపారస్తులు గౌరవప్రదంగా వ్యాపారం చేసుకునేందుకు వీధి వ్యాపారస్తుల సముదాయని నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకు షావలి, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
మనుసు తెలుగు దినపత్రిక
9
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | డిసెంబర్ 19, 2023 | www.navatelangana.com



బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలికల, బాలురల జట్లు ఎంపిక

నవతెలంగాణ - బోనకల్



ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్, జూనియర్ విభాగంలో బాలికల, బాలురుల జట్ల ఎంపికను బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం ఎంపిక చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఈ పోటీలకు 150 మంది బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా జట్ల ఎంపిక కోసం క్రీడాకారుల బాల్ బ్యాట్మెంటన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్లు లోకి ఎంపిక చేశారు. సీనియర్ బాలికల విభాగంలో టీ.జ్యోతిర్మయి, కే మధులత, బి చైతన్య, సిహెచ్ శశికళ, శ్రీ హర్షిని, కే జస్వితి, సవీరా, మైథిలి, ధరణి, చైతన్య, కీర్తి, సిహెచ్ నందిని, దివ్య, రూప లను ఎంపిక చేశారు. జూనియర్ విభాగంలో బాలికల జట్టులో పి శ్రీహర్షిని, కే మధులత, టీ జ్యోతిర్మయి, కే ఆకాంక్ష, మైథిలి, బి పౌర్ణమి, రేణుక, దివ్య, స్మైలీ, రూప, భవిష్య, నందిని, తేజస్వినిలను ఎంపిక చేశారు. బాలుర విభాగంలో లాకేష్, అదీల్, గణేష్, నాగానాయక్, ఓంకార్, జయదీప్ మానస, జోషి, త్రిశాంత్, మణికంఠ, దనోజ్, అపోజ్, మోహిత్, సురేష లను ఎంపిక చేశారు. జిల్లా జట్ల ఎంపికను పిఈటి టి. సంధ్యారాణి పీడీలు స్వాతి, రజిత, సుధారాణి నిర్వహించారు. జిల్లా బాల్ బ్యాడ్మిటన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కోచ్ అమరేసి లింగయ్య జిల్లా జట్ల ఎంపికలో కీలక పాత్ర నిర్వహించారు. హైదరాబాదులో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ జూనియర్ విభాగంలో జరిగే పోటీలలో ఎంపికైన జిల్లా జట్లు పాల్గొన్నట్లు అమరేసి లింగయ్య తెలిపారు.

జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మొక్కను నాటిన సూర్యపోగు మేరీ

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం ప్రభుత్వాసుపత్రి డైటిషియన్ డాక్టర్ సూర్యపోగు మేరీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆమె మొక్కను నాటారు. అనంతరం పలు ప్రాంతాల్లో సాయంత్రం చిన్నారులకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన పుట్టినరోజు పురస్కరించుకొని రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ ఇచ్చిన పిలుపులో భాగంగా తాను.. ప్రతి అకేషన్ను బట్టి ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటుతూ వస్తున్నానని... తన జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటడం జరిగిందని, హరిత తెలంగాణ దిశగా తాను కూడా భాగస్వామిని అవుతానని ఆమె అన్నారు. డైటిషియన్ డాక్టర్ సూర్యపోగు మేరీ బర్త్ డే సందర్భంగా పలు వైద్యాధికారులు, పలువురు వైద్యులు, విద్యావేత్తలు, ప్రముఖులు, ఆమెకు బర్త్డే విషెస్ తెలిపారు.



వ్యవసాయానికి ఉపాధి పనులు అనుసంధానం చేయాలనే ఆలోచన వెనక్కి తీసుకోవాలి

- వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నెకంటి సంగయ్య

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

రాష్ట్రంలో వ్యవసాయానికి గ్రామీణ ఉపాధి హామీ పనులను అనుసంధానం చేస్తామంటూ కాంగ్రెస్ శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి చేసిన ప్రకటనను తక్షణమే వెనక్కు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నెకంటి సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్ లో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం పాము ఉపేందర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు.ఈ సమావేశంలో సంగయ్య మాట్లాడుతూ వామపక్షాల పోరాట ఫలితంగా యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు.గ్రామాల్లో కూలీలు వ్యవసాయ పనులు లేని రోజుల్లో పేదలకు వంద రోజులు పని కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. అటువంటి పథకాన్ని మరల వ్యవసాయానికి అనుసంధానం చేస్తే కూలీలు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి ఇటువంటి ఆలోచనలు చేయవద్దన్నారు.ఈ సమావేశంలో సంఘం మండల కార్యదర్శి నాగేశ్వరరావు,నాయకులు చెరుకూరి మురళీ కృష్ణ, పగిడిపల్లి ఉపేందర్, వెంకట్రావు, యర్రా నరసింహారావు, పడిశాల లక్ష్మణ్, జింక బాలరాజు, వెంకన్న, గోగుల నాగరాజు, ఏపూరి మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓలకు ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలి

- అసిస్టెంట్ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దార్ వీరభద్రప్రసాద్

నవతెలంగాణ పినపాక



బీఎల్ఓలు ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, పినపాక తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం పినపాక, కరకగూడెం బీఎల్ఓలతో ఎన్నికల విధి విధానాలపై జిల్లా స్థాయి మాస్టర్స్ ట్రైనర్స్తో స్థానిక రైతు వేదికలో శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం బీఎల్వోలకు ఎన్నికల విధానంపై అవగాహన పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్ జాబితా తయారీలో బి.ఎల్.ఓల పాత్ర కీలకమైందని అన్నారు. రెండు మండలాల్లో ఉన్న 52 మంది బిఎల్ఓలకు ఓటర్ జాబితా తయారి, మార్పులు, చేర్పులు అలాగే మరణించిన వారు, వలస వెళ్లిన వారి ఓట్లను పరిశీలించి తుది సమాచారం అందించుటలో కీలక పాత్ర పోషించే విధంగా శిక్షణా తరగతులు చేపట్టారు. 80 సంవత్సరాలు దాటిన ఓటర్ వివరాలను తప్పక సేకరించాలని ఆదేశించారు. ఫోటో ఎలక్ట్రోల్ వచ్చిన తరువాత ఎలాంటి పొరపాటు జగకుండా ఎన్నిక ప్రక్రియ సక్రమంగా నిర్వహించడం జరుగుతుందని, ఎలక్ట్రోల్ సక్రమంగా నిర్వహించడం వలన గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఓటు శాతం ఎక్కువగా పెరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో మాస్టర్స్ ట్రైనర్స్ రామి రెడ్డి, రవికుమార్, సూపర్వైజర్లు వీరభద్రం బాలకృష్ణ, రమేష్, రోశయ్య,ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్

- పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్

నవతెలంగాణ-ఖమ్మం



ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ అని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ అన్నారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులో వృద్ధాప్యంలో వారసులు పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలు ఫిర్యాదు వచ్చాయి. అదేవిధంగా భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు, భార్యాభర్తల సమస్యలపై వచ్చిన బాధితుల ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌లో అధికారులకు ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్,

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టీ.నాగరాజు

నవతెలంగాణ-ఖమ్మం



పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయాంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ ఎల్ మూర్తి, టీ. నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని సుందరయ్య భవన్లో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ . మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వారు ఇచ్చిన ఆరు గ్యారంటీలే కాకుండా విద్యా రంగంలో అనేక సమస్యల నిలయాలుగా ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నాయని, కొత్త ముఖ్యమంత్రి వాటి పై ద్రుష్టి సారించాలన్నారు. గత 3 సంవత్సరాల నుండి 5వేల కోట్ల పైబడి విద్యార్థుల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్ లో ఉన్నాయని, గత ప్రభుత్వం స్కాలర్ షిప్స్ రీయింబర్స్ మెంట్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం గా వ్యవహరించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 20వ తేదీ నుండి డిగ్రీ విద్యార్థుల సెమిస్టర్ ప్రారంభం అవడంతో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ పై ఆధారపడి చదువుకుంటున్న పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అదేవిధంగా వసతి గృహాల్లో చదువు కుంటున్న విద్యార్థులకు గత 5 నెలల నుండి పెండింగ్ బిల్లులు విడుదల కాక తీవ్ర ఇబ్బందీ పడుతున్నారన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హాస్టల్ విద్యార్థులకు మెస్‌ఛార్జీలు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచవలసిన అవసరం ఉందన్నారు. 35 రూపాయిలతో 3 పూటల భోజనం ఎట్లా సాధ్యపడుతుందని అన్నారు. గత ప్రభుత్వం కేజీ టూ పిజి పేరుతో ఏర్పాటు చేసిన నూతన గురుకులాల్లో విద్యార్థులకు అద్దె భవన్లో ఇరుకు గదుల్లో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వ విద్య రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల సంఘం ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాల అధ్యక్ష పర్విన్, రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు బి. వీరభద్రం, శ్రీకాంత్ వర్మ, అశోక్ రెడ్డి, సాయికుమార్, ప్రశాంత్, భరత్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి కాంగ్రెస్

- వెంగళరావు సాగర్ కు పూర్వ వైభవం.....
- మండలంలో తొలి పర్యటనకు ఆత్మీయ స్వాగతం
- అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ

నవతెలంగాణ-చంద్రుగొండ



అశ్వరావు పేట శాసనసభ్యులు జారే ఆది నారాయణ మండలంలో సోమవారం పర్యటించారు. ఎమ్మెల్యే హోదాలో తొలి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం పలికారు. తొలుత సీతయ్య గూడెం గ్రామ సమీప వెంగళరావు ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. గత ఐదేళ్లుగా వెంగళరావు ప్రాజెక్టు అలుగు మరమ్మతులకు గురి కావడంతో నీటి నిల్వలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. త్వరలో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి మరమ్మతులకు ఆదేశాలు ఇస్తామన్నారు. అనంతరం మండలంలోని మహమ్మద్ నగర్, తిప్పనపల్లి, రేపల్లెవాడ, తుంగారం గ్రామాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో అందరిని ఆకట్టుకునేలా మాట్లాడారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరినీ ఆలింగనం చేసుకుంటూ ఆప్యాయత చాటారు. మండలం నుంచి భారీ మెజార్టీ ఇచ్చిన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్ల ప్రజాసేవకే అంకితం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు భోజ్యా నాయక్, అంకిరెడ్డి కష్టారెడ్డి, సారేపల్లి శేఖర్, నల్లమోతు వెంకటరమణ, శివ, కీసర భద్రయ్య, బన్నె నాగరాజు, పదం వినోద్, బొర్ర సురేష్, తుమ్మలపల్లి సురేష్, అన్వర్, వసీం, ఎంపీపీ పార్వతి, సర్పంచులు కాక శీను, ధారావత్ రామారావు ,బానోత్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలపై శ్రద్ధ చూపాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



చలికాలం ఎక్కువ అవుతున్నందున ఆశ్రమ పాఠశాల, గురుకులాలలో చదివే విద్యార్థిని, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారి ఆరోగ్య స్థితిగతులు ఎప్పటికప్పుడు సంబంధిత ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో వివిధ సదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుండి ఆయన యూనిట్ అధికారుల సమక్షంలో అర్జీలు స్వీకరించి తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ వీలైనంత తొందరగా అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేయాలని ఆయన అన్నారు. గిరిజనులు, గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలలో పోడు భూముల పట్టాలకు, పట్టాలలో పేర్లు మార్పుకు, రైతు బంధు రుణాలకు, వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలు, పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం కొరకు, గిరిజన గ్రామాలలో వ్యవసాయం చేసుకోవడానికి కరెంటు, బోరు, మోటారుకు, మారుమూల గిరిజన గ్రామాలలో మంచినీటి సౌకర్యం కల్పించుటకు, నూతనంగా మత్స్యకార సొసైటీలు ఏర్పాటు చేసుకొనుటకు, దీర్ఘకాలిక జబ్బులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుటకు, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి వృత్తి శిక్షణలు ఇప్పించుటకు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు కల్పించుటకు గిరిజనులు అర్జీలు సమర్పించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ ,ఎస్ఓ సురేష్ బాబు, ఏడి అగ్రికల్చర్ భాస్కరన్, డిటిఆర్ఓ ఎఫ్ ఆర్ శ్రీనివాస్, ఏపీవో పవర్ మునీర్ పాషా, ఉద్యానవనాధికారి అశోక్ కుమార్, మేనేజర్ ఆదినారాయణ, ఏవో గురుకులం నరేందర్, డిఈ హరీష్, సిబ్బంది నాగభూషణం, సుగుణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అత్యదునిక వైద్య సేవలు అందించాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



మారుమూల ప్రాంత ఆదివాసీ గ్రామాలలో నివసిస్తున్న గిరిజనులకు, కొండరెడ్ల గ్రామాలలోని గిరిజనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ వైద్యాధికారులకు ఆదేశించారు. సోమవారం సాయంత్రం తన ఛాంబర్ లో వైద్యాధికారులతో ఆదివాసీ గిరిజన గ్రామాలలో నివసిస్తున్న ఆదివాసీలకు వైద్య సేవలపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఏ ఆధ్వర్యంలో నడుస్తున్న మొబైల్ హెల్త్ వాహనాల పనితీరు గురించి ఆయన అడిగి తెలుసుకుని ఆదివాసి గ్రామాలలో ఆదివాసీలకు కొండ రెడ్లకు వాళ్ల ఇంటింటికి వెళ్లి వైద్యం అందించాలని అలానే మందుల కొరత లేకుండా చూసుకోవాలని మొబైల్ డాక్టర్స్ విధుల పట్ల అలసత్వం వహించకుండా చాలా నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. అలాగే గిరిజనులకు మందుల కొరత లేకుండా కొనుగోలు చేయడానికి ఐదు లక్షల మంజూరు చేస్తున్నానని గిరిజనులకే ఉపయోగపడేలా మందుల నిల్వలు ఉంచుకోవాలని ప్రస్తుతం ఏరియా హాస్పిటల్ లో గర్భిణీ స్త్రీలకు ముఖ్యంగా ఆదివాసి గిరిజన మహిళలకు సుఖంగా కాన్పు కావడానికి గైనిక్ డాక్టర్ కి ఇన్సెటివ్గా 50,000 అధికంగా ఇచ్చి సేవలు ఉపయోగించుకోవాలని గిరిజనులకు మాత్రం ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఉద్యానవనాధికారి అశోక్ కుమార్, జిల్లా వైద్యాధికారిని శిరీష, డిసిహెచ్ఎస్ రవిబాబు, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు రామకృష్ణ, ప్రోగ్రాం మేనేజర్ రాములు, మొబైల్ డాక్టర్లు పాల్గొన్నారు.

తుమ్మలకు నివాళలర్పించిన జారే

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని పెంట్లం గ్రామానికి చెందిన తుమ్మల వెంకన్న ఆకస్మికంగా మృతి చెందడంతో అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఆయన వెంట పర్స వెంకట్, భీముడు, మడవి నాగేంద్ర పలువురు కాంగ్రెస్ నాయకులు వున్నారు.

అన్ని పంచాయతీలలో నర్సరీ పనులు చేపడుతున్నాం

- ఎంపీడీవో చంద్రశేఖర్

నవతెలంగాణ-పినపాక

మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ ద్వారా నర్సరీలలో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లుగా ఎంపీడీవో చంద్రశేఖర్ తెలియజేశారు. సోమవారం ఉప్పాక, సీతంపేట గ్రామపంచాయతీలో ఆయన పర్యటించి నర్సరీ పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలలో ఇంటికి ఆరు మొక్కలు ఆరు మొక్కలు అందే విధంగా మొక్కలు పెంచడంతోపాటు, రోడ్డుకు ఇరువైపులా మరియు కమ్యూనిటీ ఇన్స్టిట్యూషన్స్ ప్లాంటేషన్కు అందుబాటులో ఉంచే మొక్కలు సైతం పెంచుతున్నట్లు తెలిపారు. ప్రతి నర్సరీకి పదివేల మొక్కలు పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. ఇళ్లలో పెంచుకునే పండ్లు పూల మొక్కలు కూడా అందుబాటులో ఉండే విధంగా చూస్తున్నామన్నారు. గ్రామపంచాయతీ సెక్రటరీలు బాధ్యతాయుతంగా మొక్కలు పెంపకం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.



టీజీజేఎల్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొప్పిశెట్టి సురేష్ ఎన్నిక

నవతెలంగాణ-వైరా

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల సంఘం తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (టిజిజెఎల్ఏ) బి475 నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కొప్పిశెట్టి సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాదులో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ ఖమ్మం జిల్లా ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, ఖమ్మం ఎస్సార్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీలో ప్రభుత్వ పాలన శాస్త్రంలో ఎం.ఏ, కాకతీయ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలన శాస్త్రంలో ఎంఫిల్, పిహెచ్డి చేశారు. అనేక విద్యార్థి, అధ్యాపక ఉద్యమాల్లో కీలకంగా పనిచేస్తూ పలు హక్కులు సాధించారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. డాక్టర్ కుప్పిశెట్టి సురేష్ ఏకగ్రీవంగా ఎన్నిక పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

వీడియో కెమెరామెన్, ఫొటో గ్రాఫర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

నవతెలంగాణ-పాల్వంచ

జిల్లా పౌర సంబంధాల అధికారి భద్రాద్రి కొత్తగూడెం కార్యాలయంలో వీడియో కెమెరామెన్, ఫొటో గ్రాఫర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానుస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి భద్రాద్రి కొత్తగూడెం కార్యాలయంలో వీడియో కెమెరామెన్, ఫొటో గ్రాఫర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మార్చి 31, 2024 వరకు ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేయడానికి నియామకం చేస్తున్నట్లు చెప్పారు. నెలకు రూ.27,130 వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేరుగా నూతన కలెక్టరేట్ లోని ఎస్ 27, జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో దరఖాస్తులను ఈ నెల 21వ తేదీలోగా పంపించాలని కోరారు.

వీడియో గ్రాఫర్ పోస్టు ఒకటికి డిప్లొమా ఇన్ సినిమా ఫోటో గ్రఫీ, తెలంగాణ లేదా ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ద్వారా సాంకేతిక విద్య, శిక్షణ పొందిన అభ్యర్థులు లేదా గుర్తింపు పొందిన యునివర్సిటీ తత్సమాన విద్యార్హత సాధించిన వారు అర్హులు.

ఫోటోగ్రాఫర్ ఒకటి:-

10వ తరగతి ఉత్తీర్ణత, ప్రముఖ ఫోటో స్టూడియోలో పని చేసినట్లు 5 సంవత్సరాలు అనుభవం కలిగిన ధ్రువీకరణ పత్రం.





గుండెపోటుతో సంక్రాంతి జానకీరామయ్య మృతి

నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిధిలోని లాలాపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సంక్రాంతి జానకీరామయ్య ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గతంలో జానకీరామయ్య గొంతు సంబంధిత క్యాన్సర్ గురై క్యాన్సర్‌ను జయించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. ఈ సందర్భంగా జానకిరామయ్య భౌతికదేహం పై సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు సంక్రాంతి మధుసూదన్ రావు పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళు లూర్పించారు.నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, జిల్లాకార్యదర్శి వర్గ నాయకులు బుగ్గవీటి సరళ, భూక్య వీరభద్రం బొంతు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య, చింత నిప్పు చలపతిరావు, సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నరసయ్య, బోడపట్ల రవీందర్, శ్రీనాథ్, మాజీ సర్పంచ్ సంక్రాంతి చంద్రశేఖర్, బత్తిరన్న కట్టా రాంబాబు, టీడీపీ నాయకులు కిలారు సురేందర్, మన్నేపల్లి ప్రదీప్ తదితరులు పాల్గొని నివాళు లర్పించారు.

వేరు శనగ తోటకు అలంకరణగా వాడిన క్రిమి సంహారక డబ్బాలు

- చూపరులను ఆకట్టుకుంటున్న వైనం

నవతెలంగాణ - అశ్వారావుపేట



ఒక ఆలోచన జీవన గమనాన్నియే మార్చేస్తుంది. అలాగే ఏదో ఒక ప్రత్యేకత ఎందరినో ఆకట్టుకుంటుంది అనడానికి ఒక రైతు తన వేరుశనగ సాగు కోసం,అధిక దిగుబడులు కోసం వినియోగించిన క్రిమి సంహారక, ఎరువు ఖాళీ ప్యాకెట్ లు, డబ్బాలు తన తోటలో అమర్చిన తీరు అటువైపుగా పయనించే వ్యవసాయదారులు, చూపరులను ఆకట్టుకుంటుంది. తను వాడిన ఔషధాలు గుర్తు కోసమో లేక ఎన్ని రకాలు వాడితే ఆ తోట అలా ఉందని చెప్పడానికి ఓ గానీ మండలంలోని గాండ్ల గూడెంకు చెందిన చిన్న అనే వేరుశనగ రైతు తన వేరుశనగ పంటకు వాడి మందులు డబ్బాలను పలవలుతో ఉన్న కొమ్మ కు తగిలించి చేనులో మధ్య ఏర్పాటు చేసాడు. ఈ దృశ్యాన్ని సోమవారం నవతెలంగాణ క్షేత్ర సందర్శన లో కంటపడింది.

భద్రాద్రి రామా పేరుతో నూతన జిల్లా ఏర్పాటు చేయాలి

- పూనెం ప్రదీప్ కుమార్ డిమాండ్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అత్యంత దారుణంగా నష్టపోయిన ప్రాంతం భద్రాచలమేనని, నష్టపోయిన భద్రాచలం ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురి చేసిందని భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం స్వతంత్రంగా పోటీ చేసిన అభ్యర్థి పూనెం ప్రదీప్ కుమార్ డిమాండ్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 8 మండలాలతో విశాలమైన నియోజకవర్గంగా ఉన్న భద్రాచలం ప్రాంతం, రాష్ట్ర విభజన అనంతరం కూనవరం, విఆర్ పురం, చింతూరు మండలాలు పూర్తిగా, భద్రాచలం గ్రామపంచాయతీ మినహాయించి భద్రాచలం మండలంతో సహా ఆంధ్రాలో కలపడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం జిల్లాల పునర్విభజనలో భద్రాచలం నియోజకవర్గంలోని వెంకటాపురం, వాజేడు మండలాలను ములుగు జిల్లాలో కలిపి భద్రాచలం నియోజకవర్గానికి తీరని అన్యాయం చేశారన్నారు. అనేక ఉద్యమాలు చేసి సాధించుకున్న స్వరాష్ట్రంలో పది సంవత్సరాలు పరిపాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలం ప్రాంతాన్ని పట్టించుకోకపోవడం వల్ల మరింత వెనుకబాటు తనానికి గురైందని ఆయన అన్నారు. నేడు భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాలు అభివృద్ధి జరగక, నిధులు కేటాయించక వెనుకబడిందన్నారు. ములుగు జిల్లాలో కలిపిన వెంకటాపురం, వాజేడు మండలాలను తక్షణమే భద్రాచలం రెవిన్యూ డివిజన్‌లో విలీనం చేసి, పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాలు, భద్రాచలం నియోజకవర్గంలోని ఐదు మండలాలతో ప్రత్యేక జిల్లాగా భద్రాద్రి రామ జిల్లాను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భద్రాచలం నియోజకవర్గంలో దుమ్ముగూడెం, చర్ల మండలాలు అతిపెద్ద మండలాలుగా ఉన్నాయని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా పరిపాలన సౌలభ్యం కోసం దుమ్ముగూడెం, చర్ల మండలాలను మరో రెండు మండలాలుగా విడదీసి మొత్తం పద్నాలుగు మండలాలతో భద్రాచలం కేంద్రంగా భద్రాద్రి రామ జిల్లాను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. దీనివలన భద్రాచలం ప్రాంతం అనేక విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఆ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు, నాయకులు కృషి చేయాలని ఆయన కోరారు. రానున్న రోజుల్లో భద్రాద్రి రామ జిల్లా ఏర్పాటు కోసం అనేక రకాల పోరాటాలు చేసేందుకు ఈ ప్రాంత ప్రజలు సిద్ధమవుతున్నారని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భద్రాద్రి రామ జిల్లాను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎల్‌బీస్టేడియంలో 22న క్రిస్మస్ వేడుకలు

- ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహణ
- పాల్గొననున్న సీఎం ఎ.రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 22న ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొంటారని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.కాంతి వెస్లీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఏడాది ఆనవాయితీగా ఈ వేడుకలను నిర్వహిస్తున్న సంగతి విధితమే. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ

- ఆర్టీసీ, రవాణాశాఖకు చెందిన మూడు ఫైళ్లపై సంతకం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఆ తర్వాత ఆయన టీఎస్‌ఆర్టీసీ, రవాణా శాఖకు సంబంధించిన మూడు ఫైళ్లపై సంతకం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి బస్‌పాస్‌లకు రాయితీల ఖర్చు కింద రీయింబర్స్‌మెంట్ కోసం రూ.212.50 కోట్లను విడుదల చేస్తూ ఒక ఫైలు, 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి రూ.162.50 కోట్లను విడుదల చేస్తూ మరో ఫైలు, హెడ్ ట్రాన్స్ పోర్ట్ కానిస్టేబుల్ ఎల్ పాండుబాబు భార్య ఎల్ రాజ్యలక్ష్మికి రూ.లక్ష మెడికల్ క్లెయిమ్‌ను మంజూరు చేస్తూ మూడో ఫైల్‌పై ఆయన సంతకం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్‌ను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వివేక్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శులు బుర్రా వెంకటేశం, వాణీప్రసాద్, టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు కలిసి అభినందించారు.

'బిగ్ బాస్' ఫ్యాన్స్ రచ్చ..

- ఆరు ఆర్టీసీ బస్సులు, పోలీసు వాహనం, రెండు ప్రయివేటు వాహనాలు ధ్వంసం
- అభిమానులపై జూబ్లీహిల్స్‌లో కేసు నమోదు
- బిగ్‌బాస్ షో ఫైనల్ తర్వాత ఘటన



నవతెలంగాణ - బంజారాహిల్స్

ప్రముఖ టీవీ ఛానెల్‌లో ప్రసారమైన బిగ్‌బాస్ షో ఏడో సీజన్ ఆదివారం గ్రాండ్ ఫినాలేతో ముగిసింది. అయితే, ఫైనల్ అనంతరం కృష్ణానగర్ అన్నపూర్ణ స్టూడియో వద్ద బిగ్‌బాస్ షో ఫ్యాన్స్ బీభత్సం సృష్టించారు. బిగ్‌బాస్ షో విన్నర్ పల్లవి ప్రశాంత్, రన్నరప్ అమర్‌దీప్ అభిమానులు కొట్టుకున్నారు. ఈ క్రమంలో అన్నపూర్ణ స్టూడియో నుంచి బయటకు వస్తున్న బిగ్‌బాస్ కంటెస్టెంట్స్, ఇతర సెలబ్రిటీల కార్లపై రాళ్లు విసిరి అద్దాలను పగలగొట్టారు. అటుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సుల అద్దాలను ధ్వంసం చేశారు. మొత్తం ఆరు ఆర్టీసీ బస్సులు, పోలీసు వాహనం, రెండు ప్రయివేటు వాహనాలను ధ్వంసం చేశారు. ఒక్కసారిగా జరిగిన విధ్వంసంతో భయభ్రాంతులకు గురైన కొందరు అభిమానులు పరుగులు తీశారు. రంగంలోకి దిగిన పోలీసులు లాఠీచార్జ్ చేసి వారిని చెదరగొట్టారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఆర్టీసీ అధికారులు ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. సీసీటీవీ, వీడియో ఆధారాలతో నిందితులను గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. వారిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.

బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్‌పైనా కేసు

బిగ్‌బాస్ 7 విజేతగా నిలిచిన పల్లవి ప్రశాంత్‌పైనా జూబ్లీహిల్స్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. 147, 148, 290, 353, 427 రెడ్ విత్, 149 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. పోలీసుల హెచ్చరికలను పట్టించుకోకుండా ర్యాలీ నిర్వహించినందుకు, అందుకు కారణమైనందుకు పల్లవి ప్రశాంత్‌పై కేసు నమోదు చేశారు.

అవుట్‌సోర్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- నిలోఫర్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పొరుగుసేవల ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అవుట్‌సోర్స్ ఉద్యోగుల సంఘం నేత శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణికి వినతిపత్రం సమర్పించారు. పేషెంట్ కేర్ ఎంప్లాయిస్ అండ్ సెక్యూరిటీ శానిటేషన్ జీవో 60 ప్రకారం వారికి రూ.15,600 రూపాయలు చెల్లించాలనీ, 12 లీవులు, మహిళలకు అదనంగా ఐదు క్యాజువల్ లీవులను కూడా ఇవ్వాలని కోరారు. 30 శాతం ఇంక్రిమెంట్‌ను ఆరోగ్యశ్రీ కింద డాటా ఎంట్రీ ఉద్యోగులకు కూడా వర్తింప జేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి నెల మొదటి తేదీనే జీతాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. నక్షత్ర, సాయి కార్తికేయ ,సహస్ర ఏజెన్సీల గడువు ఈనెల చివరి తో ముగుస్తున్నదనీ, ఈఎస్ఐ, పీఎఫ్ క్లియర్ చేసిన తర్వాతే వారిని టెర్మినేట్ చేయాలని కోరారు. తమ సమస్యలపై సూపరిండెంట్ ఉషారాణి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన



నవతెలంగాణ-హైదరాబాద్

కర్ణాటక బ్యాంకు శతాబ్ది సంవత్సరం సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రాంతీయ కార్యాలయం వారు ఆదివారం వాక్‌థాన్ నిర్వహించారు. బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం బంజారాహిల్స్ నుండి కేబీఆర్ పార్కు శ్రీనగర్ కాలనీ వరకు వివిధ శాఖల సిబ్బందితో కలిసి వాక్ చేస్తూ సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ ప్రధాన కార్యనిర్వాహక అధికారి కేఎల్. శేషాద్రి, బజాజ్ అలియాన్జ్ ప్రాంతీయ అధికారి అనిల్ సంయుక్తంగా ప్రారంభించారు. కేబీఆర్ పార్కు వద్ద సైబర్ సెక్యూరిటీ , బ్యాంకు సేవలు, వివిధ రకాల సైబర్ ఫ్రాడ్స్ అరికట్టడంపై సందర్శకులకు వివరించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల నిపుణులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం శేషాద్రి బ్యాంకు సిబ్బందికి, ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఒకే ప్రాంగణం.. రెండు పాఠశాలలు..

- 279 మందికి 10 మరుగు దొడ్లు
- అసౌకర్యాలు నడుమ ఆశ్రమ విద్యార్థులు





నవతెలంగాణ-అశ్వారావుపేట

విద్యకు అత్యధిక నిధులు కేటాయిస్తున్నాం, విద్యార్థుల సమగ్ర విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామంటూ ప్రభుత్వాధినేతలు ఊకదంపుడు ఉపన్యాసాలిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంటుంది. నలుగురు ఉండే ఇంట్లోనే అదనంగా ఒక్కరు బస చేయాలన్నా ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో అందరికీ తెలిసింది. అయితే 250 మంది విద్యార్థులు కోసం నిర్మించిన వసతి గృహంలో రెండు వసతి గృహాలకు చెందిన విద్యార్థులకు వసతి అంటే ఎలా ఉంటుందో ఊహించండి. ఇది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని సున్నం బట్టి గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖకు చెందిన ఆశ్రమ పాఠశాలల పరిస్థితి.

గ్రామంలోని గిరిజన సంక్షేమ విద్యా విభాగం ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు సరిపడా సౌకర్యాలతో కూడిన ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 118 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 103 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. మిగతా 15 మంది ప్రైమరీ పాఠశాల విద్యార్థులు. కాగా, ఈ పాఠశాల ప్రాంగణంలోకి గతేడాది పెద్దవాగు ప్రాజెక్ట్ ఆశ్రమ పాఠశాలను తరలించారు. ఈ పాఠశాల నిర్వహణ కోసం సున్నం బట్టి పాఠశాలకు చెందిన భవన సముదాయాన్ని విభజించారు. ఈ పాఠశాల విద్యార్థుల కోసం ఆరు గదులు కేటాయించారు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 172 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరందరికీ సరిపడా నివాస గదులు, స్నానాల గదులు, మరుగు దొడ్లు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు వంట గది సైతం లేకపోవడంతో ఆరుబయటే వంట నిర్వహిస్తున్నారు. ఈ రెండు పాఠశాలలకు కలిపి 279 మంది విద్యార్థులకు 10 మరుగు దొడ్లు మాత్రమే ఉన్నాయి. మౌలిక సదుపాయాలు సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న అవస్థలపై ఇరు పాఠశాలల ఉపాధ్యాయులు కాంతయ్య, బాలును నవతెలంగాణ వివరణ కోరగా.. సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలుపుతూనే ఉన్నామని చెప్పారు. వారం కిందట ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఈ పాఠశాలను సందర్శించినప్పుడు సైతం ఈ విషయాన్ని వివరించామన్నారు. అశ్వారావుపేట ప్రస్తుత ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సున్నంబట్టి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. కాబట్టి ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరిస్తారని స్థానికులు, ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

త్వరలో మంత్రివర్గ విస్తరణ ..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. మలి విస్తరణలో తమకు అవకాశం వస్తుందని పలువురు నేతలు ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల19న ఢిల్లీ వెళ్లి పార్టీ అగ్ర నేతలతో సమావేశం కానున్నారు. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపైన హైకమాండ్‌తో చర్చించనున్నారని సమాచారం. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనుండటంతో ముందుగా పదవుల పంపిణీ ద్వారా పార్టీలో జోష్ తేవాలని భావిస్తున్నారు. లోక్‌సభ అభ్యర్థుల విషయంలోనూ ఇప్పటికే ఒక జాబితా సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. మంత్రివర్గ విస్తరణలో గ్రేటర్ హైదరాబాద్‌కే తొలి ప్రాధాన్యం ఇస్తారని సమాచారం. హైదరాబాద్ నగరంలోని నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరూ ఎన్నికల్లో గెలవలేదు. అయినప్పటికీ నాంపల్లిలో పరాజయం పొందిన ఫిరోజ్‌ఖాన్ మైనార్టీ కోటాలో మంత్రి పదవి కోసం పోటీలో ఉన్నారు. నిజామాబాద్ అర్బన్ స్థానంలో ఓటమి చెందిన షబ్బీర్ అలీకి మంత్రి పదవి ఓకే అయితే ఫిరోజ్‌ఖాన్‌కు అవకాశాలు ఉండకపోవచ్చని సమాచారం. మల్కాజిగిరి నుంచి ఓడిపోయిన మైనంపల్లి హన్మంతరావు కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. అయితే ఆయన్ను మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దింపాలనే ఆలోచన ఉన్నట్టు పార్టీలో ప్రచారం సాగుతోంది. అంజన్‌కుమార్ యాదవ్(ముషీరాబాద్), మధుయాస్కీ(ఎల్బీనగర్)లు కూడా ఎన్నికల్లో ఓడిపోయినా వారి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. షబ్బీర్‌అలీ, అంజన్‌కుమార్‌లకు మంత్రులుగా అవకాశం ఇచ్చి ఎమ్మెల్సీలుగా ఎంపిక చేస్తారని వారి అనుచరులు చెబుతున్నారు. ఆదిలాబాద్ నుంచి గడ్డం వినోద్, వివేక్ సోదరుల మధ్యే మంత్రి పదవి కోసం పోటీ ఉంది. ఇద్దరూ ఢిల్లీలో అగ్రనేతలను కలిసినట్టు తెలుస్తోంది. తనకు అవకాశం ఇస్తారని వివేక్ ధీమాతో ఉన్నారు.

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కూడా ప్రయత్నిస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేరు పరిశీలనలో ఉంది. అదే సమయంలో కీలకమైన హోం శాఖ ఎవరికైనా అప్పగిస్తారా లేక సీఎం వద్దనే ఉంచుకుంటారా అనే చర్చ కూడా సాగుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులకు ఏడాది పాటు ఏ పదవీ ఇవ్వకూడదని పార్టీ యోచిస్తున్నట్టు కూడా మరోపక్క ప్రచారం జరుగుతోంది. దాన్నే అమలు చేస్తే మాత్రం ఓటమి చెందిన వారికి మంత్రిపదవులు దక్కే అవకాశం లేదని పార్టీ నేతలు చెబుతున్నారు.

ఆస్తి కోసం ఆరు హత్యలు

లోన్ ఇప్పిస్తానని నమ్మబలికి ఘాతుకం

- స్నేహితుడితో పాటు అతడి కుటుంబాన్ని హతమార్చిన వైనం
- నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో కలకలం రేపిన ఘటన
- నిందితుడు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అనుచరుడు



నవతెలంగాణ-మాక్లూర్

స్నేహితుని ఆస్తికోసం ఆశపడి అతని కుటుంబంలో ఆరుగురిని నిందితుడు పొట్టనపెట్టుకున్నాడు. స్నేహితుడితో పాటు తన కుటుంబాన్ని ఒక్కొక్కరిని ఒక్కోచోట హతమార్చాడు. అలా వారం వ్యవధిలోనే ఆరు హత్యలు చేశాడు. ఈ ఘటన నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. కాగా నిందితుడు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అనుచరుడు కావడం గమనార్హం. సంబంధీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన రాచర్ల పూనప్రసాద్ (35) కుటుంబం ఏడాది క్రితం స్వగ్రామాన్ని వదిలి.. కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డికి వెళ్లి స్థిరపడ్డారు. ఆయనకు భార్య రమణి (32) గర్భిణి, కొడుకు చైతు (6), కూతురు చైత్రి (6) కవలలు, ముగ్గురు చెల్లెండ్లు స్వప్న (32), శ్రావణి, స్రవంతి (25) ఉన్నారు. అయితే ప్రసాద్‌కు మాక్లూర్‌లో ఓ ఇల్లు ఉంది. ప్రసాద్ స్నేహితుడైన మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన మెడిద ప్రశాంత్ ఆ ఇంటిపైన కన్నేశాడు. ప్రసాద్ అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో లోన్ ఇప్పిస్తానని ఆ డబ్బుతో అప్పులు తీర్చుకోవచ్చని ప్రసాద్‌ను ప్రశాంత్ నమ్మించాడు. సులువుగా రుణం వస్తుందని చెప్పి.. ప్రశాంత్ పేర ఆ ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. బ్యాంకుల చుట్టూ తిరిగినా లోన్ రాకపోవడంతో.. ఇల్లును తిరిగి తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని ప్రశాంత్‌పై ప్రసాద్ ఒత్తిడి తీసుకొచ్చాడు.

ఎలాగైనా ఆ ఇంటిని తన సొంతం చేసుకోవాలనుకున్న ప్రశాంత్.. పతకం ప్రకారం ప్రసాద్‌ను ఈ నెల 9న బయటకు తీసుకెళ్లాడు. నిజామాబాద్-కామారెడ్డి జాతీయ రహదారికి సమీపంలోని అటవీ ప్రాంతంలో ప్రసాద్‌ను హత్య చేశాడు. మరుసటి రోజే ప్రసాద్ ఇంటికి వెళ్ళి.. తన భర్తను పోలీసులు అరెస్టు చేశారని ప్రసాద్ భార్య రమణిని నమ్మించి బయటకు తీసుకెళ్ళాడు. ఆమెను సైతం హతమార్చి బాసర నదిలో పడేశాడు. ఆ తర్వాత ప్రసాద్ పెద్ద సోదరి స్వప్నను హత్య చేశాడు. ఇద్దరు పిల్లలు చైతు, చైత్రి కవల పిల్లలను సోన్ బ్రిడ్జి సమీపంలో హత్యచేశాడు. ప్రసాద్ చిన్న సోదరి స్రవంతిని మాచారెడ్డి సమీపంలో హత్య చేశాడు. మొదటి మూడు హత్యలు ఒక్కడే చేశాడని.. మిగిలిన మూడు హత్యల్లో మరో ముగ్గురి ప్రమేయం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. హత్యకు గురైన వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఎక్కడా కూడా అదృశ్యం కేసు నమోదు కాలేదు. నమ్మిన స్నేహితుడే హంతకుడిగా మారి కుటుంబాన్ని అంతమొందించటం కలకలం రేపుతోంది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు తమకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. కాగా.. నిందితుడు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడు. బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షునిగా ఉన్నాడు. ఈ హత్యల్లోని ఓ శవం ఆధారంగా పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నారు. కాగా.. ఈ హత్యలపై పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదు. అంతా గోప్యంగా ఉంచడం గమనార్హం.

ఆదిలాబాద్ రిమ్స్‌లో విషాదం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వైద్య విద్యార్థుల మృతి

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్
- మహారాష్ట్రలో డిన్నర్ చేసి వస్తుండగా ఘటన
- స్వస్థలాలకు మృతదేహాల తరలింపు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఎంబీబీఎస్ 2020 బ్యాచ్‌కు చెందిన యశ్వంత్ రెడ్డి, అమృతరాజ్, సాయి కిరణ్, చరణ్‌దీప్, బాలసాయి, డేవిడ్ రాజ్ మూడు ద్విచక్రవాహనాలపై ఆదివారం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్యలో క్యాంపస్ నుంచి బయటకు వెళ్లారు. మహారాష్ట్రలోని యవత్మల్ జిల్లాలో ఓ దాబాలో డిన్నర్ చేశారు.

తిరుగు ప్రయాణమై ఆదిలాబాద్‌కు వస్తుండగా మహారాష్ట్రలోని పాండ్రకవడ సమీపంలో టోల్ ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో ఒకే వాహనంపై ఉన్న ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. డేవిడ్ రాజ్(21), బాలసాయి(23) అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన రాత్రి 12 గంటల సమయంలో జరిగింది.

పాండ్రకవడలో పోస్టుమార్టం.. రిమ్స్‌లో సంతాప సభ

విషయం తెలుసుకున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, తోటి విద్యార్థులు సోమవారం ఉదయం ఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడి అధికారులతో మాట్లాడి పాండ్రకవడలోని ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అంబులెన్స్ రిమ్స్‌కు తీసుకొచ్చారు. రిమ్స్‌లో వారి చిత్రపటాలు ఏర్పాటు చేసి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరి మృతదేహాలకు రిమ్స్ డైరెక్టర్, వైద్యులు పుష్పాంజలి ఘటించారు. అలాగే తోటి విద్యార్థులు, రిమ్స్ సిబ్బంది నివాళులర్పించారు.

మిన్నంటిన రోదనలు

డేవిడ్ రాజ్ తల్లిదండ్రులు కొడుకు మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది. చేతికి అందిన కొడుకు దూరమయ్యాడంటూ కన్నీటిపర్యంతమయ్యారు. తోటి స్నేహితులు సైతం తమ మిత్రులు దూరం అయ్యారన్న బాధను తట్టుకోలేకపోతున్నారు. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించి వారి స్వస్థలాలకు పంపించారు. డేవిడ్ రాజ్ వరంగల్ జిల్లా పరకాలకు చెందినవాడు కాగా, బాలసాయి విజయవాడ జిల్లా అవనిగడ్డకు చెందినవారు. ఇద్దరివీ పేద కుటుంబాలే. విజయవాడ నుంచి బాలసాయి కుటుంబీకులు సోమవారం రాత్రి రిమ్స్‌కు వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు. అప్పటి వరకు మార్చురీలో ఉంచారు.



మా భూములు కాపాడాలంటూ..

- పాదయాత్రగా ప్రజా భవన్‌కు బయలుదేరిన కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితులు

నవతెలంగాణ -నర్సాపూర్

కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు కాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులు తమ భూములను కాపాడాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. పాదయాత్రను మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట శివారులోని జల హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభించారు. కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డికి వెళ్లే కాల్వను తమ గ్రామాల మీదుగా నిర్మించొద్దని డిమాండ్ చేశారు. ప్రజాభవన్ వరకు పాదయాత్ర చేసి తమ సమస్యలను ప్రభుత్వానికి విన్నవిస్తామని భూ నిర్వాసితులు తెలిపారు. పాదయాత్రలో తిమ్మాపూర్, పిల్లుట్ల, బ్రాహ్మణపల్లి, గొల్లపల్లి, లింగాపూర్, పెద్ద చింతకుంట, చిన్నచింతకుంట, గ్రామాల రైతులు ప్యాటా మహేష్ గౌడ్, నరసింహారెడ్డి, కష్టగౌడ్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీశైలం, కిషన్, శ్రీనివాస్, కిషన్ నాయక్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలనీ, వారి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు పాలడుగు సుధాకర్, తదితర నాయకులు డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. సింగరేణి మొదటి సమీక్షలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రస్తావించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెరుగుదల, కోలిండియా వేతనాల అమలు, జీఓ నెం.22పై సింగరేణి యాజమాన్యం గత రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖ, కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లింపు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రమైన వివరాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వేతనాల పెరుగుదల, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డిప్యూటీ సీఎం హామీనిచ్చారని మధు తెలిపారు.

నీట మునిగి కర్నాటక వాసి మృతి

నవతెలంగాణ -పాపన్నపేట

ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధిలోని చెక్ డ్యామ్‌లో పడి యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటకలోని బీదర్ జిల్లా కర్కనల్లి గ్రామానికి చెందిన సంకు బసవరాజు(37) కుటుంబ సమేతంగా ఏడుపాయలకు దర్శనం కోసం ఈ నెల 17న రాత్రి వచ్చారు. మరుసటి రోజు ఉదయం స్నానం చేయడానికి కోసం అతను చెక్‌డ్యామ్‌లో దిగాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి బసవరాజు మృతి చెందాడు. మృతుని భార్య సంకు సిద్ధమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హద్దులు దాటారు

- ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌పై సీపీఐ(ఎం) ఆగ్రహం
- కేరళ గవర్నర్ పదవికి ఆయన అనర్హులని వెల్లడి



తిరువనంతపురం : కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తీరుపై సీపీఐ(ఎం) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నుకోబడిన రాష్ట్ర ప్రభుత్వంపై ఆయన తన నిరంతర రాజకీయ దాడులు, అస్థిర ప్రవర్తనతో అన్ని హద్దులనూ దాటారని ఆరోపించింది. "రాష్ట్రంలో రాజ్యాంగ యంత్రాంగం పతనానికి నాంది" అని ఆయన చేసిన ప్రకటన తాజా ఉదాహరణ అని వివరించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) ఒక ప్రకటనను విడుదల చేసింది. దీని ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వంపై వచ్చే ఇలాంటి బెదిరింపులను రాష్ట్ర ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తారు.

కేరళ, కాలికట్ విశ్వవిద్యాలయాల సెనేట్‌లలో నామినేట్ చేయబడిన సీట్లను ఆరెస్సెస్ నామినీలతో భర్తీ చేసి, ఈ విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా తన పదవిని దుర్వినియోగం చేసినందుకు గవర్నర్ విద్యార్థుల నుంచి నిరసనలను ఎదుర్కొంటున్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రజాస్వామిక హక్కు విద్యార్థులకు ఉన్నది. ఈ నిరసనలకు గవర్నర్.. ముఖ్యమంత్రిపై నిందలు వేయాలని ఆయనపై అవమానకర వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పదవిని కలిగి ఉన్న వ్యక్తి ప్రవర్తించడానికి ఇది మార్గం కాదు. అతను ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని నిరూపించుకున్నాడు.

నవతెలంగాణ మానవి 11
www.navatelangana.com
ఖమ్మం
మంగళవారం 19 డిసెంబర్ 2023



సంసారమన్నాక మనస్పర్థలు, గొడవలు సహజం. అయితే దంపతుల్లో ఎవరో ఒకరు రాజీపడి వీటిని సద్దుమణిగేలా చేస్తేనే కాపురం సజావుగా ముందుకు సాగుతుంది. కానీ ఇలా అర్థం చేసుకునే తత్వమున్న దంపతులు ఈ కాలంలో చాలా అరుదుగానే కనిపిస్తున్నారంటున్నారు నిపుణులు. ఇందుకు ఆర్థిక స్వాతంత్ర్యం, అసూయాద్వేషాలు, పురుషాధిపత్యం.. వంటివెన్నో కారణాలు కావచ్చు. అయితే వీటి కారణంగా ఇద్దరి మధ్య పలు విషయాల్లో వచ్చే చిన్న చిన్న భేదాభిప్రాయాలు అనుబంధాన్ని తెగే దాకా లాగుతున్నాయని కొన్ని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. మరి, ఇలా జరగకూడదంటే ఈ కాలపు దంపతులు కొన్ని విషయాలు దృష్టిలో ఉంచుకోవాలని చెబుతున్నారు రిలేషన్‌షిప్ నిపుణులు. మరి అవేంటో తెలుసుకుందాం...

నిర్ణయాలు కలిసి తీసుకుంటేనే...



ఎన్నో ఆశలతో కొత్త జీవితంలోకి అడుగు పెడుతుంది జంట. అన్యోన్య దాంపత్యానికీ.. కలిసి ఆనందంగా సాగడానికీ బోలెడు ప్రణాళికలు వేసుకుంటారు. అయితే కొంత మంది భర్తలు అన్ని విషయాలు భార్యలకు చెప్పిన డబ్బు విషయం వచ్చే సరికి ఆమెకు చెప్పేదేంటి అనుకుంటారు. కానీ అన్నింటితో పాటు ఆర్థిక విషయాలు కూడా భాగస్వాములిద్దరూ ఒకరినొకరు పంచుకోవాలంటున్నారు నిపుణులు. అప్పుడే మనస్పర్థలకు తావుండదంటున్నారు.

అలాగే వదిలేస్తే...

వివాహ బంధమంటే ఎన్నో బరువు బాధ్యతలతో కూడుకున్నది. పెండ్లి కాక ముందు వరకు ఎలా ఉన్నా.. పెండ్లయ్యాక మాత్రం దంపతులిద్దరూ ఒకరికొకరు కొన్ని విషయాల్లో సర్దుకుపోవడం తప్పనిసరని అర్థం చేసుకోవాలి. అయితే ఈ కాలపు దంపతుల్లో ఇది కొరవడుతోందని చెబుతున్నారు నిపుణులు. ఒకరి మాటలు-అభిప్రాయాలతో మరొకరు ఏకీభవించకపోవడం, పరిణతితో ఆలోచించలేకపోవడం వంటివే ఇద్దరి మధ్య గొడవలకు కారణమవుతున్నాయి. అయితే వీటిని ఇలాగే వదిలేస్తే జీవితాలే నాశనం కావొచ్చు. అనుబంధాలు దూరం కావొచ్చు. కాబట్టి ఇలాంటి కలతల్ని దూరం చేసుకోవాలంటే ఇద్దరూ కూర్చొని మాట్లాడుకుంటేనే సాధ్యమవుతుంది. ఒకవేళ భార్యాభర్తలిద్దరిలో ఒకరు కాస్త మొండిగా ఉన్నా.. మరొకరు ఓ మెట్టు దిగితే తప్పు లేదు. దీని వల్ల వచ్చే సమస్యలేమీ లేవు. నేను తగ్గేదేంటి అనే ధోరణి వదిలెయ్యాలి. దీని ఫలితంగా గొడవలూ సద్దుమణుగుతాయి. ఎదుటివారూ మీ ఓపికను అర్థం చేసుకొని వారి ప్రవర్తననూ క్రమంగా మార్చుకునే అవకాశాలుంటాయి.

దాపరికాలు వద్దు

ఇప్పటి జంటల్లో భేదాభిప్రాయాలు రావడానికి ముఖ్య కారణమేదైనా ఉంది అంటే అది డబ్బే అంటున్నారు నిపుణులు. ఇద్దరూ రెండు చేతులా సంపాదించడం, పొదుపు-మదుపు విషయాల్లో ఎవరి నిర్ణయాలు వాళ్ల తీసుకోవడం వల్ల.. ఇద్దరి మధ్య దూరం అగాధంలా పెరిగిపోతోంది. ఒకానొక దశలో ఇది బయటపడి తెగతెంపుల దాకా వెళ్లినా ఆశ్చర్యపోనవసరం లేదు. అందుకే భార్యాభర్తలిద్దరూ ఎవరెంత సంపాదించినా, ఎంత ఖర్చు పెట్టినా, ఎంత పొదుపు చేసినా.. దాపరికం లేకుండా అన్ని విషయాలు పంచుకోవడం అత్యంత ముఖ్యమైన విషయం అంటున్నారు నిపుణులు. అలాగే ఆస్తులు కొన్నా, రుణాలు చెల్లించినా.. కలిసే పెట్టుబడి పెట్టడం వల్ల ఇద్దరూ బాధ్యతాయుతంగా వ్యవహరించే అవకాశముంటుంది. ఈ కలుపుగోలుతనమే ఆలుమగలిద్దరినీ శాశ్వతంగా కలిపి ఉంచుతుంది.

ఇలాంటి విభజన వద్దు

ఇల్లు నిర్వహణ నువ్వు.. సంపాదన సంగతి నేను.. ఇలా విభజించుకున్నప్పుడే సమస్యలు. ఇద్దరూ ఉద్యోగాలు చేసినా, చేయకపోయినా పొదుపు, మదుపు, కొనుగోళ్ల వంటి నిర్ణయాలేవైనా ఇద్దరూ కలిసి తీసుకోవాలి. అప్పుడు ప్రతి రూపాయి లెక్క తెలియడమే కాదు.. మెరుగైన ప్రణాళికకీ ఆస్కారం ఉంటుంది. కొత్తలో కలిసి పర్యటనలు, షాపింగ్ వంటివి సహజమే. అలాగని మరీ ఖర్చు చేసుకుంటూ వెళ్లొద్దు. కొనేది ఏదైనా నిజంగా అవసరమేనా అని ప్రశ్నించుకుంటే దుబారాకి చోటుండదు. నగరాల్లో ఉండేవారికి కరెంటు కోతలు పెద్దగా పరిచయం ఉండదు. ఇష్టమొచ్చినట్లుగా లైట్లు, ఫ్యాన్లు వేసి వదిలేస్తుంటారు. మీకూ ఆ అలవాటు ఉంటే తగ్గించుకోండి. ఇంట్లోకి వస్తువులు కొనేప్పుడూ కరెంటు ఆదా చేసే రకాలను ఎంచుకోండి. కరెంటు బిల్లు తగ్గుతుంది. ఇంకా ఇలాంటి వృథాలేం చేస్తున్నారో తెలుసుకున్నా చాలావరకూ ఆదా చేయొచ్చు. ఇవి ఏవైనా ఇద్దరూ పాటించండి. అప్పుడు సంసారం ఆర్థిక సమస్యలు లేకుండా, ఎలాంటి గొడవలు రాకుండా సజావుగా సాగిపోతుంది.

ఒక పుస్తకాన్ని పెట్టుకోండి

ఎవరు ఎంత ఖర్చు పెడుతున్నారన్నది ఓ పుస్తకం పెట్టుకుని ఇద్దరూ అందులో కచ్చితంగా రాయాలనే నియమం పెట్టుకోండి. దీని ద్వారా నెలకు ఎంత అవసరం అన్న సంగతే కాదు.. అనవసర ఖర్చుల వివరాలూ తెలుస్తాయి. వీలైతే వాటిని తగ్గించుకొని పొదుపుగా మలుచుకోవచ్చు. ఇద్దరూ సంపాదిస్తోంటే.. ఏ బాధ్యతలూ లేకపోతే ఒకరి జీతాన్ని పూర్తిగా పక్కన పెట్టేయొచ్చు. భవిష్యత్తులో సొంత ఇల్లు, స్థలం వంటివి ప్లాన్ చేసుకున్నా డబ్బుపరంగా ఇబ్బంది ఉండదు. అయితే ఏ నిర్ణయం అయినా ఇద్దరూ కలిసి తీసుకోసుకోవాలి అనే విషయాన్ని మాత్రం మర్చిపోవద్దు. అప్పుడు ఇద్దరి మధ్య ఎలాంటి సమస్యలూ రావు.



జీర్ణక్రియ మెరుగుదలకు...



జీవక్రియలను మెటబాలిజం అంటారు. అంటే మన శరీరంలో క్యాలరీలు ఖర్చయ్యే రేటన్నమాట. మెటబాలిజం తగ్గితే అనారోగ్యం పాలవుతారు. లావెక్కుతారు, ఏం చేసినా సన్నబడరు. క్యాలరీలు త్వరగా ఖర్చు కావు కనుక గుండె జబ్బులు, డయాబెటీస్, బీపీ వంటివి వస్తాయి. మెటబాలిజం అనేది అందరిలో ఒకేలా ఉండదు. ఇది ఒక్కో వ్యక్తిలో ఒక్కోలా ఉంటుంది. మెటబాలిజం పెంచాలంటే క్రమం తప్పకుండా ఎక్సర్ సైజులు చేయాలి, నీరు ఎక్కువ తాగాలి. ఇక మెటబాలిజం పెంచాలంటే అదంతా మనం తీసుకునే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. చలికాలంలో కాస్త మెటబాలిజం సహజంగానే తగ్గుతుంది. కనుక శీతాకాలంలో మెటబాలిజం పెరగడానికి ఈ కింది ఆహారాన్ని తీసుకోండి.

గ్రీన్ టీ : టీలోని కెఫిన్ మెటబాలిజం పెరిగేందుకు సాయం చేస్తుంది. గ్రీన్ టీలో ఉన్న సుగుణాలు సమర్థవంతంగా కెలరీలను కరిగిస్తుంది.

కందిపప్పు : ఐరన్ పుష్కలంగా ఉన్న కందిపప్పు ఒంట్లో ఆక్సిజన్ ఫ్లో ను అమోఘంగా పెంచుతుంది. దీంతో మెటబాలిజం రేటు బాగా పెరిగి శక్తి వస్తుంది.

నట్స్ : బాదం, పిస్తా వంటి నట్స్‌లో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. ప్రొటీన్లు అరగాలంటే వాటికి ఎక్కువ శక్తి అవసరమవుతుంది. ఇలా నట్స్‌ను అరిగించేందుకు ఎక్కువ శక్తి ఖర్చు చేసే క్రమంలో మీ శరీరంలో మెటబాలిజం రేటు పెరుగుతుంది. కనుక రోజూ గుప్పెడు బాదం, పిస్తా వంటివి లాగించండి. అయితే అతిగా తిని శరీరంలో కొవ్వు నిల్వలు పెంచుకోవద్దు.

కారం : కారం బాగా తింటే మెటబాలిజం వృద్ధిచెందటం ఖాయం. దీంతో కెలరీలు బాగా ఖర్చు అయ్యి, ఒంట్లో కొవ్వు తగ్గుతుంది.

చేపలు : చేపలు తినటం వల్ల మెటబాలిజం బాగా పెరుగుతుంది. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న చేపలు ఒంట్లో కొవ్వును బాగా కరిగిస్తాయి.

వీటికి దూరంగా : జీర్ణశక్తి మందగించే ఆహారానికి దూరంగా ఉండాలి. ముఖ్యంగా జంక్ ఫుడ్స్, ప్రాసెస్డ్ ఫుడ్, ఇన్‌స్టంట్ ఫుడ్స్ జోలికి వెళ్లకండి. జంక్ ఫుడ్స్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఇలాంటి ఆహారం వల్ల శరీరంలో ఫ్రీ ర్యాడికల్స్ పెరిగి మెటబాలిజం కుంటుపడుతుంది. కాబట్టి తేలికగా అరుగుతూ, స్వల్ప పరిమాణాల్లో గ్లూకోజ్‌ను రక్తంలోకి విడుదల చేసే ఆహారానికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలి. కాబట్టి వీలైనంత వరకు ఇంట్లో వండిన ఆహారాన్నే తీసుకుంటే బాడీ మెటబాలిజాన్ని బాగా పెంచుకునే అవకాశం ఉంటుంది.

హైదరాబాద్‌కు విచ్చేసిన రాష్ట్రపతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ విచ్చేశారు. సోమవారం ఢిల్లీ నుంచి ఆమె ప్రత్యేక విమానం ద్వారా బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దనసరి అనసూయ(సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆమె ఐదు రోజుల పాటు బస చేయనున్నారు. ఈ నెల 23న తిరిగి ఢిల్లీకి తిరిగి వెళ్లనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము వచ్చిన నేపథ్యంలో బొల్లారంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

వ్యూహ ప్రతివ్యూహాలు

(మొదటిపేజీ తరువాయి)

రఘురాం రాజన్‌తోనూ ఇతర నిపుణులతోనూ భేటీ అయిన సంగతి విదితమే. శ్వేతపత్రాలపైన్నే ప్రధాన చర్చ ఉంటుంది కాబట్టి బుధవారం నాటి అసెంబ్లీ సమావేశానికి మరింత పకడ్బందీగా, పక్కా లెక్కలతో రావాలని ఆయన భావిస్తున్నారు. అదే తరహాలో సన్నద్ధమై రావాలంటూ సీఎం ఇప్పటికే మంత్రలందర్నీ ఆదేశించారు. తాజాగా సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో సైతం ఇదే అంశం చర్చకొచ్చినట్టు సమాచారం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పుల్ని ఎత్తి చూపాలి. ఇందుకోసం అసెంబ్లీని వేదికగా ఉపయోగించుకోవాలి. అయితే సాధారణ విమర్శలు, ప్రతి విమర్శలకే పరిమితం కాకుండా ప్రతి శాఖకు సంబంధించిన బడ్జెట్, నిధుల విడుదలపై అంకెలు, సంఖ్యలు, గణాంకాలను తెలుసుకుని మరీ రావాలి. ముఖ్యంగా ఆర్థిక దుబారా, సాగునీటి ప్రాజెక్టుల్లో అవినీతి, అక్రమాలు, రేషన్ షాపులు, బియ్యం పంపిణీలోని లోపాలు, లొసుగులపై అధ్యయనం చేయండి...' అంటూ ఆయన సూచించినట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మంచి ఊపు మీదున్న పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపటం ద్వారా పార్లమెంటు ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలంటూ పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్...క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ఈ విషయంలో నూటికి నూరు పాళ్లు విజయం సాధించే లక్ష్యంతో పని చేయాలంటూ ఆయన సూచించినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

ఇక అధికార పార్టీకి ధీటుగా... ప్రతిపక్ష బీఆర్‌ఎస్ కూడా 'రెఢీ' అవుతోంది. ఆ పార్టీ శాసనసభాపక్ష నేతగా ఉన్న మాజీ సీఎం కేసీఆర్... మరో నెలన్నర వరకూ బయటకు రాలేని సంగతి విదితమే. అందువల్ల శాసనసభలో తాను లేని లోటును (ఎదురుదాడితో కూడిన ప్రసంగాల ద్వారా) భర్తీ చేయాలంటూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ట్రబుల్ షూటర్ హరీశ్‌రావును ఆయన ఆదేశించారు. బీఆర్‌ఎస్ మొదటి ప్రభుత్వం (2014 నుంచి 2018 వరకు)లో హరీశ్, సాగునీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న సంగతి విదితమే. ఆ తర్వాత రెండో దఫాలో (2018 నుంచి మొన్నటి వరకు) అదే హరీశ్... ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అందువల్ల ఆర్థిక, సాగునీటి రంగాలపై అధికార పక్షం వేసే ప్రశ్నలకు, లేవనెత్తే అంశాలకు ఆయనే ఎక్కువగా సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది. ఆయా అంశాలపై ఎక్కువ పట్టున్న మంత్రి కాబట్టి... ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాల్సిన బాధ్యతను ఆయన మోయాలి. ఈ నేపథ్యంలో గత రెండు రోజుల నుంచి హరీశ్ పూర్తిగా అధ్యయనానికే పరిమితమయ్యారు. తాను ఆయా శాఖలను చూసినప్పటి పరిస్థితులతోపాటు ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలకు ఎంత ఖర్చవుతుందనే దానిపై ఆయన పక్కాగా లెక్కలు తీస్తున్నారు. వాటిని శాసనసభలో ఏకరువు పెట్టేందుకు వీలుగా సమాచారాన్ని సేకరించి పెట్టుకున్నట్టు తెలిసింది. మరోవైపు ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధితోపాటు ఇతర అనేకాంశాలు తెలిసిన మాజీ మంత్రి కేటీఆర్ కూడా తనదైన శైలిలో అధ్యయనం చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం నుంచి నిర్వహించబోయే అసెంబ్లీ మరింత హీటెక్కనుంది.

78 మంది ఎంపీల సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యసభలో 45 మంది, లోక్‌సభలో కాంగ్రెస్ సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి సహా 33 మంది ప్రతిపక్ష ఎంపీలపై వేటువేశారు. కాగా, లోక్‌సభలో ప్రివిలేజెస్ కమిటీ నివేదిక వచ్చే వరకు ముగ్గురిని సస్పెండ్ చేశారు. లోక్‌సభలో ఎంపీలు కె జయకుమార్, విజయ్ వసంత్, అబ్దుల్ ఖలీక్ అనే ముగ్గురు స్పీకర్ పోడియంపైకి ఎక్కి నినాదాలు చేశారని, వారిని ప్రివిలేజ్ కమిటీ నివేదిక వచ్చేవరకు సస్పెండ్ చేశారు. రాజ్యసభలో 11 మంది ప్రివిలేజెస్ కమిటీ నివేదిక వచ్చే వరకు సస్పెన్షన్‌కు గురయ్యారు. మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రివిలేజెస్ కమిటీకి సూచించారు. ప్రివిలేజెస్ కమిటీకి నివేదించిన వారిలో జెబి మాథర్ హిషామ్, ఎల్.హనుమంతయ్య, నీరజ్ డాంగి, రాజమణి పటేల్, కుమార్ కేత్కర్, జి. సి. చంద్రశేఖర్, బినోయ్ విశ్వం, పి. సంతోష్ కుమార్, మొహమ్మద్ అబ్దుల్లా, జాన్ బ్రిట్టాస్, ఎ. ఎ. రహీమ్ లు ఉన్నారు.

లోక్‌సభ సోమవారం ప్రారంభం కాగానే పార్లమెంట్ భద్రతా వైఫల్యంపై చర్చించాలని, ప్రధాని మోడీ ప్రకటన చేయాలని ప్రతిపక్ష ఎంపీలు పట్టుపట్టారు. అందుకు ప్రభుత్వం సిద్ధపడకపోవడంతో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలతో హోరెత్తించారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ సభ లోపల నిరసనలు, ప్రదర్శనలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ సక్రమంగా పనిచేయాలని అన్నారు. 'ఈ అంశంపై రాజకీయాలు చేయడం బాధాకరం. వెల్‌లోకి ప్రవేశించి నినాదాలు చేయడం సభ గౌరవానికి విరుద్ధం. ముఖ్యమైన అంశాలపై చర్చలు జరిపేందుకు మీ (ప్రతిపక్షం) సహకారాన్ని అభ్యర్థిస్తున్నాను' అని బిర్లా అన్నారు. వెంటనే సభను వాయిదా వేశారు. ప్రభుత్వం సమాధానం చెప్పడానికి సిద్ధపడకపోవడం, ప్రతిపక్ష సభ్యులు ఆందోళనలు విరమించకపోవడంతో సభలో వరుసగా వాయిదాల పరంపర కొనసాగింది. చివరికి ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి సభను మంగళవారానికి వాయిదా వేశారు. ఈ ఆందోళనల మధ్యే టెలి కమ్యూనికేషన్ బిల్లు, పోస్ట్ ఆఫీస్ బిల్లు-2023ను మూజువాణి ఓటుతో ఆమోదించారు.

మరోవైపు రాజ్యసభలోనూ ఇదే అంశంపై ఆందోళన జరిగింది. సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ భద్రత వైఫల్యంపై చర్చించాలని పట్టుపట్టారు. అందుకు ప్రభుత్వం సిద్ధపడకపోవడం, ప్రతిపక్షాల ఆందోళనతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో ఇక్కడ కూడా పదే పదే వాయిదాల పర్వమే కొనసాగింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ జమ్మూ, కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (రెండవ సవరణ) బిల్లు, 2023, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు 2023ని రాజ్యసభలో పరిశీలన, ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. ఆ రెండు బిల్లులను మూజువాణి ఓటుతో ఆమోదించారు. 45 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి సభను నేటికి (మంగళవారం) వాయిదా వేశారు.

నేడు ప్రజావాణి

- పాల్గొననున్న మంత్రి పొన్నం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొననున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జనం వస్తున్న సంగతి తెలిసిందే. ప్రజల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం లభించేందుకు గాను ప్రభుత్వం ప్రజావాణి నోడల్ అధికారిగా ఐఏఎస్ అధికారి దాసరి హరిచందనను నియమించింది.

మేం కదలం

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ నాయకులు లెల్లెల బాలకృష్ణ, ఆశయ్య ప్రసంగించారు. నిరుపేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతాన్ని చాకలి ఐలమ్మ నగర్‌గా నామకరణం చేసుకున్నామని, అక్కడ గుడిసెలు వేసుకున్న ప్రతి పేద కుటుంబానికీ 120 గజాల స్థలం, పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 67 కేంద్రాల్లో లక్షలాది మంది గుడిసెలు వేసుకున్నారని గుర్తు చేశారు. జగిత్యాలలో గుడిసెలు వేసుకున్న భూమికి పట్టాలు ఉన్నాయని అధికారులు అబద్ధాలు ఆడుతున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ భూముల్లో గుడిసెలు తొలగించొద్దని అన్నారు. రెండు నెలలుగా నిరుపేదలు ఇంటి జాగా కోసం ఎండ, వాన, చలిని తట్టుకుని గుడిసెల్లో తల దాచుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోనెంబర్ 58 ప్రకారం ప్రతి కుటుంబానికీ 120గజాల స్థలం, దానికి పట్టాలు సాధించే వరకూ కొట్లాడుతామని తెలిపారు.

గత సర్కారు ఇండ్లు ఇవ్వకుండా, కనీసం జాగలూ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తాము చేస్తున్న ఇండ్ల స్థలాల పోరాట యాత్రకు వెంటనే మద్దతు ప్రకటించాలని నేతలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లులేని ప్రతి పేదవారికీ ఇంటి స్థలం సహా ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించడం అభినందనీయమని, అది వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే పేదల ఇండ్ల స్థలాలపై ప్రకటన చేయాలన్నారు. కేంద్రంలోని మోడీ కూడా ప్రజలకు ఇండ్లు కట్టిస్తామని చెప్పి పదేండ్లుగా మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర సర్కారు రూ.5లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు కలుపుకుని ప్రతి పేద కుటుంబానికీ ఇంటి నిర్మాణం కోసం రూ.15లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరి పోరాటానికి జగిత్యాల జిల్లాలోని విద్యావంతులు, ఉద్యమకారులు, వివిధ తరగతుల ప్రజలు, రాజకీయపార్టీల నాయకులు మద్దతుగా నిలవాలని కోరారు. టీఆర్‌నగర్ వద్ద వేసుకున్న గుడిసెవాసులకు అండగా నిలవాలన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సారంగపాణి, పార్టీ జిల్లా కన్వీనర్ గుగులోతు తిరుపతినాయక్, జగిత్యాల ఇండ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు రమేష్, ఇందూరి సులోచన, కో కన్వీనర్ వెల్గొండ పద్మ, సిరికొండ చంద్రయ్య, ఎమ్‌డి సలీం, బొడ్డు సుధారాణి, ఎం.డి. రఫీక్, వెల్మలపల్లి, వెంకటాచారి, ఎస్కె ఆఫీజా, బొర్రా శేఖర్, అంగోత్ నరేష్, రంగు హరీష్, బచ్చల వినోద్ పాల్గొన్నారు.

కబ్జాకోరుల చేతుల్లోనే సర్కారు భూములు

జగిత్యాల జిల్లాలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను రాజకీయ పలుకుబడి ఉన్నపెద్ద పెద్ద వ్యక్తులు, కార్పొరేట్ పెద్దలు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు.. అక్రమంగా ఆక్రమించుకున్నారని, వారంతా సత్రాలు, ట్రస్టులు, ఫాంహౌజ్‌ల పేర్లతో తోటలు, కంపెనీలు, ఫంక్షన్ హాల్స్, పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, టింబర్ డిపోలు, ఇటుకల బట్టీలు పెట్టుకున్నారని సీపీఐ(ఎం) నాయకులు విమర్శించారు. అడ్డదారిలో ట్రస్టుల పేరుతో ప్రభుత్వ భూములను కబ్జా చేసి రెగ్యులరైజ్ చేసుకున్నారని ఆరోపించారు. జగిత్యాల పట్టణంలో కొత్తగా నిర్మించిన కలెక్టరేట్ వెనుక భాగంలో కబ్జాకు గురైన విలువైన ప్రభుత్వ భూములు కండ్ల ఎదుటే కనిపిస్తున్నాయని చెప్పారు. ఎస్‌ఆర్‌ఎస్పీ క్వార్టర్స్ భూములు, వీక్లీ బజార్, మోతెచెరువు శికం భూమినీ మింగేశారన్నారు. తిమ్మాపూర్, థరూర్, నర్సింగాపూర్ శివారు ప్రాంతంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారని చెప్పారు. కొత్త బస్టాండ్ పెట్రోల్ బంక్, మంచాల రామేషం కాంప్లెక్స్, రాంబజార్ సర్దార్ సత్రానికి సంబంధించిన కోట్లాది రూపాయల విలువ చేసే భూములను అడ్డదారితో కాజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

28 నుంచి గ్రామసభలు

(మొదటిపేజీ తరువాయి)

తీర్మానించిందని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన తల్లిగా సోనియాకు రుణపడి ఉంటామన్నారు. ఆరు గ్యారంటీల అమలుపై సమావేశం చర్చించిందనీ, వాటి వివరాలను సీఎం అసెంబ్లీలో వెల్లడిస్తారని తెలిపారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాగపూర్‌లో ఈ నెల 28న జరిగే వేడుకకు రాష్ట్రం నుంచి 50 వేల మంది తరలి వెళతారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డిప్యూటీ సీఎం భట్టి వివరించగా, సాగునీటి అవకతవకలపై ఉత్తమ్ వివరించారని చెప్పారు. ప్రాజెక్టులపై వేల కోట్ల రూపాయలను గత ప్రభుత్వం ఖర్చు చేసినా ఎకరానికి కూడా నీళ్లివ్వలేదని విమర్శించారు. విద్యుత్తు, ఆర్థికరంగం, సాగునీటి ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరించనున్నట్టు తెలిపారు. పార్లమెంటు స్థానాలకు మంత్రులను ఇంఛార్జీలుగా నియమించినట్టు చెప్పారు. నామినేటెడ్ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని సీఎం చెప్పారన్నారు. రెండు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేస్తున్నామనీ, మిగతా నాలుగు గ్యారంటీలను త్వరలోనే అమలు చేయనున్నట్టు వెల్లడించారు.

-రేవంత్ కీలక వ్యాఖ్యలు

రాబోయే నెల రోజుల్లో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు పీఏసీలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సంక్షేమ పథకాల లబ్దిదారుల ఎంపిక గ్రామసభల ద్వారా జరగాలన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేని చోట సంక్షేమ పథకాలను బీ.ఫామ్ అందుకున్న నాయకుని ద్వారానే వారికి చేరవేయాలనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ సీట్ల సంగతి అధిష్టానం చూసుకుంటుందని స్పష్టతనిచ్చారు. పార్లమెంటు ఎన్నికలు నెల ముందే రావచ్చన్నారు. అభ్యర్థుల ప్రకటన సంక్రాంతి తర్వాత ఉంటుందని రేవంత్ చెప్పినట్టు తెలిసింది.

కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు నియోజకవర్గాలకు ఏఐసీసీ అబ్జర్వర్లను నియమించింది.

వరంగల్ - రవీంద్ర దాల్వి, జహిరాబాద్ - మేయప్పన్
నాగర్‌కర్నూలు - పీవీ మోహన్, ఖమ్మం - ఆరీఫ్ నసీంఖాన్
నల్లగొండ - రాజశేఖర్ పాటిల్, పెద్దపల్లి - మోహన్ జోషి
మల్కాజ్‌గిరి - రిజ్వాన్ అర్షద్, మెదక్ - యూబీ వెంకటేశ్
సికింద్రాబాద్ - రూబీ మనోహరన్,హైదరాబాద్ - భాయ్ జగదప్
భువనగిరి - శ్రీనివాస్,మహబూబాబాద్ - శివశంకర్‌రెడ్డి
ఆదిలాబాద్ - ప్రకాశ్ రాథోడ్,నిజామాబాద్ - అంజలీ నింబాల్కర్
మహబూబ్‌నగర్ - మోహన్ కుమార్ మంగళం
చేవెళ్ల - ఎం.కె. విష్ణుప్రసాద్,కరీంనగర్ - క్రిష్టోఫర్ తిలక్

మోడీని గద్దె దించడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడుతూ కూటమి ఐక్యత, మోడీ సర్కారుపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు అన్ని ప్రతిపక్ష పార్టీలు కలిసి ఉంటాయనీ, సమిష్టిగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌తో కలిసి ఢిల్లీకి బయలుదేరే ముందు లాలూ ప్రసాద్ యాదవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాల కూటమి ఏకమై ఈసారి ప్రధాని మోడీని గద్దె దించేందుకు పోరాడుతుందని చెప్పారు. ప్రతిపక్ష కూటమిని ప్రస్తుత రూపంలో పటిష్టం చేయటంలో ముఖ్య పాత్ర పోషించిన ముఖ్యనేతలలో ఒకరిగా లాలూ ఉన్నారు. బీహార్ సీఎం, జేడీయూ చీఫ్‌గా ఉన్న నితీశ్ కుమార్ కూడా 'ఇండియా' కూటమి సమావేశానికి హాజరుకానున్నారు. లాలూ, నితీశ్‌లు ఇద్దరు బీజేపీ హిందూత్వ అస్త్రాన్ని(కమండల్) ఎదుర్కోవటానికి 'మండల్' అనే కులగణన అంశాన్ని వాడాలని చూస్తున్నట్టు రాజకీయ విశ్లేషకులు తెలిపారు. బీహార్‌లోని మహాఘట్‌బంధన్ ప్రభుత్వం కుల సర్వే నివేదికను విడుదల చేయటం, రిజర్వేషన్‌లను పెంచడం వంటి రెండు డిమాండ్‌లను నెరవేర్చిందని వారు చెప్పారు. లాలూ, నితీశ్‌లు ఇద్దరు 'ఇండియా' కూటమిలో ప్రధాన మిత్రపక్షమైన కాంగ్రెస్‌ను జాతీయ స్థాయిలో ప్రధాన వాగ్దానంగా ఉపయోగించుకునేలా ఒప్పించగలిగితే ఇది గేమ్ ఛేంజర్ కావచ్చని వారు విశ్లేషిస్తున్నారు. దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికే గట్టిగా వాదన వినిపిస్తున్నారు.

బీజేపీని ఎదుర్కోవటానికి ఐక్య ప్రతిపక్షం (ఇండియా) తప్పనిసరని నితీష్ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ప్రతిపక్ష పార్టీ కలిసికట్టుగా పోరాడాలని కోరుకుంటున్నానని చెప్పారు. కూటమిలో తనకు ఎలాంటి పదవీ అక్కర్లేదని ఆయన ఇప్పటికే అనేక సార్లు స్పష్టం చేశారు.

కౌన్ బనేగా టాప్ కరోడ్‌పతి

నేడే ఐపీఎల్ -2024 మినీ వేలం

• 16ఏండ్ల చరిత్రలో తొలిసారి వేలాన్ని నిర్వహించనున్న మహిళ మల్లిక • 77భర్తీలకు 333మంది రేసులో..

దుబాయ్: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్-2024) మినీ వేలానికి రంగం సిద్ధమైంది. మినీ వేలం ఈసారి దుబాయ్ వేదికగా మంగళవారం జరగనుంది. ఐపీఎల్-2024 మినీ వేలానికి మొత్తం 1166మంది ఆటగాళ్ల తమ పేర్లను నమోదు చేసుకోగా.. ఐపీఎల్ నిర్వాహకులు 333మంది ప్లేయర్లను షార్ట్ లిస్ట్ చేశారు. ఇందులో 214మంది భారత ప్లేయర్స్ కాగా, 119మంది విదేశీ ఆటగాళ్ల ఉన్నారు. 10 ఫ్రాంచైజీలు కలిపి మొత్తం గరిష్టంగా 77 మాత్రమే ఖాళీగా ఉండగా.. ఇందులో 30 ఓవర్ సీస్ స్లాట్స్ ఉన్నాయి. వేలంలో ఖర్చు పెట్టడానికి ఫ్రాంఛైజీల వద్ద మొత్తం రూ.262.95 కోట్లు ఉన్నాయి. గుజరాత్ టైటాన్స్ వద్ద అత్యధికంగా రూ.38.15 కోట్లు, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ వద్ద అత్యల్పంగా రూ.13.15 కోట్ల సొమ్ము ఉంది. ఇప్పటికే ఫ్రాంచైజీలు ఈ వేలానికి సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాయి. ఈసారి వేలంలో ఆక్షనీర్‌గా మల్లికా సాగర్ వ్యవహరించనున్నారు. దీంతో ఐపీఎల్ వేలంలో ఆక్షనీర్‌గా వ్యవహరించనున్న తొలి మహిళగా ఆమె చరిత్రకెక్కనుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబయి ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీలు 11మంది ఆటగాళ్లను విడుదల చేశాయి. గుజరాత్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాను ముంబయి ఇండియన్స్ ఇచ్చి పుచ్చుకొని ధోరణిలో కోల్పోగా.. రోహిత్ శర్మతో ఢిల్లీ ఫ్రాంచైజీ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.



రికార్డుకెక్కనున్న మల్లిక..

48ఏండ్ల మల్లిక సాగర్ ముంబయికి చెందిన ఆర్ట్ కలెక్టర్. ఆమె తొలుత ఉండోల్ ఆర్ట్ గ్యాలరీలో వేలాన్ని నిర్వహించేది. వేలంలో దాదాపు 25 సంవత్సరాల అనుభవం మల్లిక ఉమెన్స్ ప్రీమియర్ లీగ్-2023 వేలంతో పాటు డబ్ల్యూపీఎల్ 2024 వేలానికి కూడా ఆమె ఆక్షనీర్‌గా పనిచేసింది. ప్రొకబడ్డీ లీగ్-2021నుంచి వరుసగా పీకేఎల్ వేలాన్ని నిర్వహిస్తోంది. దీంతో ఐపీఎల్ వేలం తొలి ఆక్షనీర్‌గా ఆమె రికార్డులకెక్కనుంది.

16ఏండ్ల ఐపీఎల్ చరిత్రలో వేలాన్ని నిర్వహించనున్న తొలి మహిళ కూడా మల్లికనే. 2008 నుంచి 2018 వరకు రిచర్డ్ మాడ్లీ వేలంపాటదారుగా బాధ్య తలు నిర్వర్తించాడు . దశాబ్ద కాలం పాటు అతడే వరుసగా ఆక్షన్ నిర్వహించాడు. అయితే 2018 నుంచి ఆక్షనీర్ బాధ్యత హ్యు ఎడ్మెడ్స్ అందుకున్నాడు . కానీ 2022 మెగా వేలంలో ఎడ్మెడ్స్ అనారో గ్యానికి గురయ్యాడు. దీంతో చారు శర్మ ఆ వేలాన్ని కొనసాగించాడు.

ఫ్రాంచైజీల వారీగా అందుబాటులో ఉన్న పర్స్ వాల్యూ

3. గుజరాత్ టైటాన్స్	:	రూ. 38.15 కోట్లు
10. సన్‌రైజర్స్ హైదరాబాద్	:	రూ. 34 కోట్లు
4. కోల్‌కతా నైట్‌రైడర్స్	:	రూ. 32.7 కోట్లు
1. చెన్నై సూపర్ కింగ్స్	:	రూ. 31.4 కోట్లు
7. పంజాబ్ కింగ్స్	:	రూ. 29.1 కోట్లు
2. ఢిల్లీ క్యాపిటల్స్	:	రూ.28.95 కోట్లు
8. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు	:	రూ.23.25 కోట్లు
6. ముంబయి ఇండియన్స్	:	రూ.17.75 కోట్లు
9. రాజస్థాన్ రాయల్స్	:	రూ. 14.5 కోట్లు
5. లక్నో సూపర్‌జెయింట్స్	:	రూ. 13.5 కోట్లు

తెలుగు రాష్ట్రాల నుంచి 13 మంది

2024 ఐపిఎల్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి 13 మంది ఆటగాళ్ల బరిలో ఉన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నుంచి 9మంది, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి నలుగురు వేలం రేసులో ఉన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నుంచి మురుగన్ అభిషేక్, రాహుల్ బుద్ధి, రోహిత్ రాయుడు, అనికేత్ రెడ్డి, రవితేజ, తనయ్ త్యాగరాజన్, అరవెల్లి అవినాష్ రావు, రక్షన్ రెడ్డి, మనీష్ రెడ్డి బరిలో ఉన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి హనుమా విహారి, కేఎస్ భరత్, రికీ భుయ్, పథ్వీరాజ్ ఎర్రా బరిలో ఉన్నారు వీరిలో కొందరు జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించారు.

హనుమ విహారి, కెఎస్ భరత్‌లాంటి ఆటగాళ్ల టీమిండియా టెస్టు జట్టులో ఆడారు. తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్ ఐపిఎల్‌లో రాణించి జాతీయ జట్టుకు ఎంపికైనవారే.

అన్ని ఫ్రాంచైజీల చూపు రచిన్ రవీంద్రవైపే..



ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో రాణించిన న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్రపైనే అన్ని ఫ్రాంచైజీలు దృష్టి సారించాయి. మినీ వేలంలో అతడు కోట్లు కొల్లగొడతాడని సమాచారం. రచిన్ రవీంద్రతో పాటు వన్డే ప్రపంచకప్ టైటిల్ విజేత ఆస్ట్రేలియా పేసర్లు పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్‌లకు ఈసారి వేలం భారీ ధర పలకవచ్చు.

సిరీస్‌పై దృష్టి

నేడు దక్షిణాఫ్రికాతో రెండో వన్డే



జెబెర్రా(సెయింట్ జార్జెస్ పార్క్): తొలి వన్డేలో ఘన విజయం సాధించిన టీమిండియా.. ఇక సిరీస్‌పై కన్నేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన తొలి వన్డేలో 8వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారత్.. రెట్టించిన ఉత్సాహంతో నేటి మ్యాచ్‌కు సిద్ధమైంది. పేసర్లు ఆర్ష్‌దీప్, ఆవేశ్ ఖాన్ బౌలింగ్‌లో చెలరేగడంతో తొలి వన్డేలో దక్షిణాఫ్రికా జట్టు 116పరుగులకే ఆలౌటైంది. ఆ లక్ష్యాన్ని టీమిండియా 2వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. వన్డేల్లో అరంగేట్రం చేసిన సాయి సుదర్శన్(55), శ్రేయస్ అయ్యర్(52) అర్ధసెంచరీలతో రాణించారు. కెప్టెన్ కెఎల్ రాహుల్ సారథ్యంలోని టీమిండియా దుర్భేధ్య ఫామ్‌లో ఉంది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమతూకలంలో ఉన్న టీమిండియా.. గెలుపే ధ్యేయంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు దక్షిణాఫ్రికా జట్టు తొలిసారి పింక్ జెర్సీ వన్డేలో ఓటమిపాలైంది. అలాగే ఆ జట్టులో నిలకడ లేమి స్పష్టంగా కనబడుతోంది.

జట్లు (అంచనా)...

ఇండియా : కెఎల్ రాహుల్(కెప్టెన్, వికెట్ కీపర్), గైక్వాడ్, సాయి సుదర్శన్, శ్రేయస్, తిలక్ వర్మ, సంజు, అక్షర్, అర్ష్‌దీప్, ఆవేశ్ ఖాన్, కుల్దీప్, ముఖేశ్ కుమార్.

దక్షిణాఫ్రికా : మార్క్‌క్రమ్(కెప్టెన్) హెన్రిక్స్, జోర్జి, డుస్సెన్, క్లాసెన్(వికెట్ కీపర్), మిల్లర్, ఫెహ్లుకియో, కేశవ్ మహరాజ్, బర్గర్, షాంసీ

రెండేండ్లు...21 మంది

• వన్డే సిరీస్‌లో అడుగుపెట్టిన ఆటగాళ్లు

న్యూఢిల్లీ : భారత జట్టులో చోటు దక్కటమే గగనమయ్యేది ఆనాడు. కానీ ఇపుడు సత్తా ఉంటే నిలబడటం లేకపోతే..కొత్త ఆటగాళ్లకు చోటు దక్కుతోంది. తాజాగా దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో యువ ఆటగాడు సాయి సుదర్శన్ పరిమిత ఓవర్ల క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. ఎంట్రీ ఇవ్వగానే హాఫ్ సెంచరీ సాధించడం విశేషం. గత రెండేండ్లలో దాదాపు 21 మంది వన్డే ఫార్మాట్‌లోకి అడుగు పెట్టారు. ఈ మేరకు మాజీ క్రికెటర్, క్రికెట్ విశ్లేషకుడు ఆకాశ్ చోప్రా స్పెషల్ ట్వీట్ పెట్టాడు. దీనివల్ల బీసీసీఐ చాలా సంతోషంగా ఉంటుందని, అయితే ఇది మంచి కాదనే ఉద్దేశంలో వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 2021 నుంచి మొత్తం 21 మంది భారత ఆటగాళ్ల జాతీయ జట్టులోకి వచ్చారని ఓ అభిమాని ట్వీట్ చేయగా.. దానికి ఆకాశ్ చోప్రా స్పందించాడు.

జ్వాల మహిళల క్రికెట్ అకాడమీ ప్రారంభం

హైదరాబాద్: ప్రముఖ షట్లర్ జ్వాల గుత్తా తన బ్యాడ్మింటన అకాడమీని విస్తరించింది. సోమవారం మొయినాబాద్‌లోని సుజాత స్కూల్‌లో జ్వాల గుత్తా మహిళల క్రికెట్ అకాడమీని ఆమె ప్రారంభించింది. ఈ సందర్భంగా జ్వాల మాట్లాడుతూ దేశంలో క్రికెట్‌కు మంచి ఆదరణ ఉందని, అయితే, మహిళా క్రికెటర్లకు ప్రత్యేకంగా అకాడమీలు చాలా అరుదుగా ఉన్నాయని చెప్పింది. బాలికలు, మహిళా క్రికెటర్లకు ప్రొఫెషనల్ కోచింగ్ అందించాలనే ఉద్దేశంతో ఉమెన్స క్రికెట్ అకాడమీ ప్రారంభించినట్లు తెలిపింది.

అకాడమీలో తక్కువ మందికే అడ్మిషన్స ఇస్తున్నామని, హాస్టల్ సదుపాయం కూడా ఉందని చెప్పింది. ఈ కార్యక్రమంలో సుజాత స్కూల్ డైరెక్టర్ ఉదయ్ సింగ్, జ్వాల గుత్తా అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స డైరెక్టర్ క్రాంతి పాల్గొన్నారు.



జాతీయ టెన్నిస్ విజేత శ్రీధర్

• జీవీకే జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో...
• తొమ్మిదిసార్లు ఈ టైటిల్ నెగ్గిన శ్రీనివాస్ రెడ్డిపై విజయం

హైదరాబాద్: జీవీకే జాతీయ టెన్నిస్ చాంపియనషిప్‌లో ప్రముఖ నిర్మాత లగడపాటి శ్రీధర్ విజేతగా నిలిచాడు. సోమవారం జరిగిన పురుషుల 55 ప్లస్ కేటగిరీ ఫైనల్లో శ్రీధర్ 12-10తో డిఫెండింగ్ చాంపియన, తొమ్మిదిసార్లు ఈ టైటిల్ నెగ్గిన శ్రీనివాస్ రెడ్డిపై విజయం సాధించాడు. హైదరాబాద్ ఓపెన టెన్నిస్ సంఘం శ్రీధర్‌ను అభినందించింది.



నవచిత్రం

స్నేహితుడి కోసం..



ప్రభాస్

ప్రభాస్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ 'సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్'. హెూంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది.

ఈ సినిమా ఈనెల 22న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో సోమవారం మేకర్స్ ఈ చిత్ర రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు.

ఇద్దరు పిల్లల మధ్య స్నేహం.. వారు పెరిగి పెద్దయిన తర్వాత కాన్సార్ ప్రాంతానికి రాజు (పృథ్వీరాజ్ సుకుమారన్) కావాలనుకున్న వాడిపై శత్రువులు దాడి చేస్తే తన స్నేహితుడి కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాటం చేసే మరో స్నేహితుడు దేవా (ప్రభాస్) కథే సలార్ సీజ్ ఫైర్ అని స్పష్టమవుతుంది. ఇప్పటికే ఆకాశాన్నంటుతున్న అంచనాలు రిలీజ్ ట్రైలర్‌తో మరింత పీక్స్‌కి చేరుకున్నాయి.

ఫస్ట్ ట్రైలర్, టీజర్, సూరీడే సాంగ్ ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్‌ని రాబట్టుకున్నాయి. ఇది కేవలం యాక్షన్ సినిమాయే కాదు..అంతకు మించి ఎమోషనల్ కంటెంట్ ఉంటుందని ఆడియెన్స్‌కి క్లియర్‌గా తెలుస్తోంది. ఈనెల 22న హెూంబలే సంస్థ ఆడియెన్స్‌కు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేందుకు రెడీగా ఉంది. క్రిస్మస్ సీజన్‌లో ఈ సినిమాను రిలీజ్ చేయడంతో ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. పృథ్వీరాజ్ సుకుమారన్, శ్రుతి హాసన్, జగపతి బాబు ముఖ్య పాత్రల్లో అలరించనున్నారు.

దూరమే తీరమై..


కళ్యాణ్ రామ్, సంయుక్తా మీనన్

నందమూరి కళ్యాణ్ రామ్ నటిస్తున్న కొత్త మూవీ 'డెవిల్'. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా దర్శక, నిర్మాతగా ఈ సినిమా రూపొందు తోంది. ఈనెల 29న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇదొక పీరియడ్ డ్రామా. బ్రిటీష్‌వారు ఇండియాను పరిపాలించిన కాలానికి సంబంధించిన కథతో తెరకెక్కిన సినిమా కావటంతో నాటి పరిస్థితులను ఆవిష్కరించేలా భారీగా సినిమాను చిత్రీకరించారు. ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్, పాటలు, టీజర్ సూపర్బ్ రెస్పాన్స్‌ని రాబట్టకున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం మేకర్స్ ఈ మూవీ నుంచి 'దూరమే తీరమై..' అనే లిరికల్ వీడియో సాంగ్‌ను రిలీజ్ చేశారు. సమీర భరద్వాజ్ ఈ పాటను రాసి, పాడటం విశేషం. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు.

అంతకుమించి ట్రైలర్


రవితేజ

రవితేజ నటిస్తున్న నయా యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కుతోంది. టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.
టీజర్‌తో పాటు ఈగల్ ఊర మాస్ అంథమ్ 'ఆడు మచ్చా' పాట చార్ట్ బస్టర్ హిట్ అవ్వడంతో ఈ సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు పెరిగాయి. ఈ అంచనాల నేపథ్యంలో మేకర్స్ తాజాగా ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు. ప్రేక్షకులు, అభిమానులు ఎంతగానో ఎదురుచుస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ఈనెల 20న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాలో రవితేజ మల్టిపుల్ షేడ్స్ ఉన్న పాత్రలో అలరించనున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తుండగా, కావ్య థాపర్ మరో కథానాయిక. నవదీప్, మధుబాల ఇతర ముఖ్య తారాగణం.

ది ఫస్ట్ స్ట్రైక్ సందడి మొదలైంది..


వరుణ్ తేజ్

వాస్తవ సంఘటనల ప్రేరణతో రూపొందుతున్న ద్విభాషా చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. వరుణ్ తేజ్, మానుషి చిల్లర్ జంటగా నటించిన ఈ చిత్రం నుంచి మేకర్స్ సోమవారం 'ది ఫస్ట్ స్ట్రైక్' పేరుతో టీజర్‌ను విడుదల చేశారు. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహించిన ఈ చిత్ర టీజర్ ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది. 'ది ఫస్ట్ స్ట్రైక్'లో హీరో వరుణ్ తేజ్ కొన్ని పవర్ ఫుల్ డైలాగ్స్‌తో పాటు అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్ సందీప్ ముద్దా నిర్మించారు. నందకుమార్ అబ్బినేని, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ (వకీల్ ఖాన్) సహ నిర్మాతలు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 16న విడుదల కానుంది.

నవ్వించే మారుతి నగర్ సుబ్రమణ్యం


రావు రమేష్

రావు రమేష్ టైటిల్ పాత్రలో పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా 'మారుతి నగర్ సుబ్రమణ్యం'. ఇంద్రజ కీలక పాత్రధారి. 'హ్యాపీ వెడ్డింగ్' ఫేమ్ లక్ష్మణ్ కార్య దర్శకుడు. పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తి అయ్యింది.
దర్శకుడు లక్ష్మణ్ కార్య మాట్లాడుతూ, 'రావు రమేష్‌ని ఇప్పటి వరకు చూసిన దాని కన్నా పదిరెట్లు ఎక్కువ ఎంటర్టైన్ క్యారెక్టర్లో కనిపిస్తారు. ప్రేక్షకులకు ఈ సినిమా మంచి వినోదాన్ని అందిస్తుంది' అని చెప్పారు.
'క్యారెక్టర్స్ సెలక్షన్ విషయంలో నిజాయతీగా ఉండే రావు రమేష్ ఈ సినిమా చేయడానికి ప్రధాన కారణం మా దర్శకుడు లక్ష్మణ్ కార్య రాసిన కథ. కథలో భాగంగా కామెడీ ఉంటుంది. ముఖ్యంగా లక్ష్మణ్ కార్య రాసిన మాటలు అందరినీ నవ్విస్తాయి. ఆ డైలాగులను రావు రమేష్ చెప్పిన తీరు థియేటర్లలో విజిల్స్ వేయిస్తూ నవ్వించడం ఖాయం. సోషల్ మీడియాలో మీమ్స్ రూపంలో కూడా హల్‌చల్ చేస్తాయి. అజీజ్ నగర్, బీహెచ్‌ఈఎల్, కనకమామిడి, వనస్థలిపురం... హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ చేశాం' అని నిర్మాతలు తెలిపారు. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి, అజయ్, హర్షవర్ధన్, ప్రవీణ్ ఇతర ప్రధాన తారాగణం. కళ్యాణ్ నాయక్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. 'బేబీ' ఫేమ్ బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందించారు.

పిండం.. మరోసారి రుజువు చేసింది



యశ్వంత్, శ్రీరామ్, సాయికిరణ్ దైదా

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అయ్యారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించారు. ఈసినిమా ఈనెల 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదలైంది. ప్రేక్షకులు ఈ సినిమాకి బ్రహ్మరథం పడుతున్నారు. రోజురోజుకి షోలు పెంచుకుంటూ విజయవంతంగా ప్రదర్శితమవుతోందీ ఈ చిత్రం. ఈ నేపథ్యంలో చిత్ర బృందం సోమవారం ప్రసాద్ ల్యాబ్స్ లో విజయోత్సవ సభను నిర్వహించింది. కథానాయకుడు శ్రీరామ్ మాట్లాడుతూ, 'నిజాయితీగా సినిమా చేస్తే, దానిని గెలిపిస్తామనే నమ్మకాన్ని ప్రేక్షకులు మరోసారి ఇచ్చారు' అని తెలిపారు.
సినిమా బాగుంటే ప్రేక్షకులు థియేటర్లకు వస్తారని మా చిత్రం మరోసారి రుజువు చేసింది. దర్శకుడు సాయికిరణ్ ఈ కథను అద్భుతంగా తెరకెక్కించారు. దాని ఫలితమే 170 స్క్రీన్‌లతో మొదలైన ఈ సినిమా, 400 లకు పైగా స్క్రీన్‌ల వరకు వెళ్ళింది. ఈ సినిమా విజయవంతమైన సందర్భంగా మా బ్యానర్‌లో రెండో సినిమాని సాయికిరణ్ దైదా దర్శకత్వంలో పొలిటికల్ డ్రామా చేస్తున్నాము' అని నిర్మాత యశ్వంత్ దగ్గుమాటి చెప్పారు.
దర్శకుడు సాయికిరణ్ దైదా మాట్లాడుతూ, "నేను పిండం కథ మొదలు పెట్టినప్పుడు.. ఈ సినిమా థియేటర్లలో ఇంత భారీగా విడుదలవుతుంది అని ఊహించలేదు. యూఎస్ 120కి పైగా స్క్రీన్‌లు, ఇండియాలో 400కి పైగా స్క్రీన్‌లలో విడుదల కావడం నిజంగా గొప్ప విషయం. దీనికి కారణమైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు' అని తెలిపారు.

అరాచక రాచరికం


అప్సరా రాణి, విజయ్ శంకర్

చిల్ బ్రోస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ ఈశ్వర్ నిర్మిస్తున్న చిత్రం 'రాచరికం'. విజయ్ శంకర్ హీరోగా, అప్సరా రాణి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సురేష్ లంకలపల్లి కథ, కథనం అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు.
సోమవారం ఈ చిత్ర పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ కొట్టగా, నిర్మాత డీఎస్ రావు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. నిర్మాత ఈశ్వర్ స్క్రిప్ట్‌ను అందజేశారు.
ఈ సందర్భంగా దర్శకుడు సురేష్ లంకలపల్లి మాట్లాడుతూ, 'ఈ చిత్ర గ్లింప్స్ మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. గ్లింప్స్‌లో వెంగి ఇచ్చిన మ్యూజిక్ బాగుంది. ప్రతీ పాత్రకు ఇంపార్టెన్స్ ఉంది' అని తెలిపారు. 'దర్శకుడు సురేష్ కథని అద్భుతంగా రాశారు. సినిమా కూడా అద్భుతంగా వస్తుంది అనే నమ్మకం ఉంది. గ్లింప్స్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ మూవీకి పనిచేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు వస్తుంది' అని నిర్మాత ఈశ్వర్ చెప్పారు.
హీరో విజయ్ శంకర్ మాట్లాడుతూ, 'టైటిల్ రివీల్ చేసినప్పటి నుంచీ పాజిటివ్ వైబ్స్ వచ్చాయి. మా టైటిల్ చూసి దర్శకుడు బోయపాటి శ్రీను పర్సనల్‌గా మెసెజ్ పెట్టారు. రిలీజ్ అయ్యాక రెండు తెలుగు రాష్ట్రాల్లో అందరూ దీని గురించే మాట్లాడుకుంటారు. ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. 'కథ విన్నప్పుడే ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుందని నమ్మాను. ఇలాంటి చిత్రంలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. రాచరికంతో అరాచకం సృష్టించబోతున్నాం' అని అప్సరా రాణి అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886